ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
సిటీ◆

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com
సంపుటి : 37 సంచిక : 221 | విజయవాడ, శుక్రవారం 11 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



పార్లమెంటులో జరిగిన వీడ్కోలు సభలో ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీకి జ్ఞాపిక అందజేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, వేదికపై కొత్త ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్

మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడుల నివారణకు

ప్రత్యేక చట్టం

అనంత బహిరంగ సభలో బివి రాఘవులు డిమాండ్



- ప్రజాసమస్యలపై దేశవ్యాప్త ప్రచారం
- ఎన్నికల సంస్కరణలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ
- మేము మాఫియాలమా? అరెస్టులెందుకు? :పి.మధు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశ వ్యాప్తంగా మైనార్టీలు, దళితులు, మహిళలపై పెరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా అనంతపురంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాడులు విపరీతంగా పెరిగాయని అన్నారు. దాడుల మిగతా 9లో



సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా అనంతపురంలో నిర్వహించిన భారీ ప్రజా ప్రదర్శన, అనంతరం జరిగిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

విమర్శ లేకపోతే

నిరంకుశత్వమే

వీడ్కోలు సభలో హమీద్ అన్సారీ

న్యూఢిల్లీ : ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విమర్శించలేకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశంగా మారుతుందని రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీ అన్నారు. భారత ఉప రాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా దశాబ్దకాలం పాటు సేవలందించిన అన్సారీ పదవీకాలం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత్ వైవిధ్యాన్ని వెల్లడించే రాజ్యాంగ సృష్టే రాజ్యసభ అన్నారు. ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విమర్శించేందుకు ప్రతిపక్షాలకు అవకాశమివ్వకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశంగా మారే అవకాశముందని మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. ఇదే సమయంలో సభ్యులకు విమర్శించే హక్కు ఉంటుందని, పార్లమెంట్ కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా మిగతా 9లో

నిరంతరం
ప్రజా పక్షమే

- రాజ్యసభలో ఏచూరికి ఘన వీడ్కోలు
- అధికార, ప్రతిపక్ష సభ్యుల ప్రశంసలు

12

సంక్షోభంలో
సంక్షేమం

- నిధుల విడుదలలో కోతలు

2



గుంటూరులోని టిజెపిఎస్ కాలేజీ నుండి తరగతులు బహిష్కరించి బయటకు వస్తున్న విద్యార్థులు

బంద్ సంపూర్ణం

- ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకూ భాగస్వామ్యం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, రాస్తారోకోలు, ధర్నాలు
- పలుచోట్ల అరెస్టులు

విద్యార్థి సంఘాల ఐక్య పిలుపుతో చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎల్‌కెజి నుంచి పిజి వరకూ తరగతులు జరగలేదు. చాలా విద్యాలయాలు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపాయి. అనేక చోట్ల విద్యార్థులు తరగతులను బహిష్కరించి ప్రదర్శనలు, రాస్తారోకోలు, ధర్నాలు, మానవహారాలు చేపట్టారు. ఈ సందర్భంగా గుంటూరు, నెల్లూరుల్లో విద్యార్థులను అరెస్టు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల రద్దును విరమించుకోవాలని, స్వయం పోషక యాజమాన్య స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని - 2017ను రద్దు చేయాలని, ఉపకారవేతనాలు, రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాలు ఈ బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. వార్త 7లో

వణికిస్తున్న మలేరియా

- నెలరోజుల్లో 2400 కేసులు
- ప్రబలుతున్న అంటు వ్యాధులు
- విశాఖలో అత్యధికం
- తూతూ మంత్రంగానే రోగ నిర్ధారణ
- నివారణ చర్యలూ అంతంత మాత్రమే



విశాఖ మన్యంలో ఏ ఇంట చూసిన ఇలాంటి దృశ్యమే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వర్షాకాలం వచ్చిందంటే చాలు రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. రోగ నిర్ధారణ, నివారణా చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలొస్తున్నా పెడచెవిన పెడుతోంది. పరిస్థితిని చక్కదిద్దడంలో సంబంధిత శాఖలు పరిధులు పెట్టుకోవడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. క్షేత్రస్థాయిలో సరియైన పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికివారు తప్పించుకుంటున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. నమోదైన కేసుల విషయంలో కూడా తప్పుడు లెక్కలు చూపిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. గత నలభై రోజుల నుండి రాష్ట్రంలో ప్రబలిన అంటువ్యాధుల కేసుల్ని పరిశీలిస్తే వాటిలో అత్యధికంగా దాదాపు 2400 మలేరియా, 400 డెంగ్యూ కేసులే ఉన్నాయి. ఇవి కేవలం ప్రభుత్వాసుపత్రుల్లో నమోదైన కేసులు మాత్రమే. ఇక ప్రయివేటు ఆసుపత్రుల్లో ఈ కేసులు 6 వేలకు పైగా ఉండొచ్చంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసుల్లో అత్యధికంగా విశాఖ జిల్లాలో 1229 మలేరియా కేసులు, 56 డెంగ్యూ కేసులు ఒక్క జులైలోనే నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విశాఖలో డోనూర్, దారకొండ తదితర గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా మలేరియా కేసులు నమోదవ్వగా, పట్టణ ప్రాంతాల్లోనే డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదైనట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులే చెప్తున్నారు. నీటి ద్వారా సంక్రమించే డయేరియా వంటి వ్యాధులు రాష్ట్రవ్యాప్తంగా 653 కేసులు నమోదుకాగా, సిఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోనే అత్యధికంగా 189 కేసులున్నాయి. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలే నివారణా చర్యల్ని తీసుకోవాలని, ఆ పని తమది కాదని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. వ్యాధి సోకిన తరువాత చికిత్సకు అవసరమైన మందులు, రోగనిర్ధారణ కిట్లు, ఇతర వైద్య సదుపాయాల్ని అందుబాటులో ఉంచడం వరకే తమ బాధ్యతని కప్పిపుచ్చుకుంటున్నారు. పారిశుధ్య లోపంతో పాటు దోమల నివారణా చర్యలు చేపట్టకపోవడం వల్లే వ్యాధులు విస్తరిస్తున్నాయని చెప్తున్నారు.

నిర్ధారణలోనే అసలు లోపం

జాతీయ కీటక జనిత వ్యాధి నివారణా కార్యక్రమం (ఎన్‌విబిడిపి) మార్గదర్శకాల ప్రకారం మలేరియా వంటి వ్యాధుల్ని నిర్ధారించేందుకు ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించాలి. అలా కాకుండా సూక్ష్మదర్శినిలో రక్త నమూనాను పరిశీలించి చాలా ప్రాంతాల్లో మలేరియాను నిర్ధారిస్తున్నారు. దీనివల్ల ఒక్కోసారి వ్యాధికారకాలు సూక్ష్మదర్శినిలో కనిపించవని పలువురు ప్రజారోగ్యవేదిక నేతలు పదేపదే చెప్తున్నారు. సూక్ష్మదర్శినిలో రక్త నమూనాను పరిశీలించి రోగ నిర్ధారణ చేయడం ఎన్‌విబిడిపి మార్గదర్శకాలకు విరుద్ధమంటున్నారు. ఈ విధానం వల్లే మలేరియా కేసులు ఎక్కువగా ఉన్నప్పటికీ, రోగ నిర్ధారణ పరీక్షలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ లెక్కల్లో తక్కువ కేసులుగా నమోదవుతున్నాయని చెప్తుతున్నారు. వాస్తవంగా మిగతా 9లో

మెడికల్ హబ్‌గా అమరావతి



నూతన రాజధాని అమరావతి నమూనాను బిఆర్ శెట్టికి చూపుతున్న చంద్రబాబు

- త్వరలో రూ.12,500 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు
- రాష్ట్రంలో 13 వైద్యశాలల ఏర్పాటుకు కృషి
- మెడిసిటీ శంకుస్థాపన సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు దీటుగా నూతన రాజధాని అమరావతిని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నామని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని దొండపాడు వద్ద బిఆర్ శెట్టి అమరావతి మెడిసిటీ ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఇప్పటికే మంగళగిరిలో ఎయిమ్స్ నిర్మాణం ప్రారంభమైందని, త్వరలో ఇండో-యూకే ఆస్పత్రికి శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. విజయవాడ, గుంటూరు పెద్దాస్పత్రులు, ఎన్ఆర్ఐ ఆస్పత్రితోపాటు ఇప్పటికే అనేక ఆస్పత్రులు ఈ ప్రాంతంలో ఉన్నాయని, వీటన్నింటిని కలిపి మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రూ.12,500 కోట్లతో అమరావతిలో ఒక మెడికల్ కళాశాల, వెయ్యి పడకల ఆస్పత్రి, పరిశోధన మిగతా 9లో



జెడియులో చీలిక!

- మహాగట్‌బంధన్‌కి నితీష్ తూట్లు : శరద్‌యాదవ్
- 'జన్ సంవాద్' పేరుతో ప్రజాభిప్రాయసేకరణ యాత్ర

పాట్నా: బీహార్‌లో రాజకీయ అలజడి చెలరేగుతోంది. మహాగట్‌బంధన్‌కు బీహార్ సిఎం నితీశ్ కుమార్ తూట్లు పొడిచారంటూ జెడి(యు) వ్యవస్థాపకుడు శరద్ యాదవ్ విమర్శలు చేయడమేగాక, ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో గురువారం నుంచి ప్రారంభించిన మూడు రోజుల యాత్ర పార్టీలో చీలికకు దారితీయనుందనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. శరద్ యాదవ్ వ్యాఖ్యలపై ఇప్పటివరకూ మిగతా 9లో

ప్రజ్ఞ

1. తొలిసారిగా 'మైక్రోఫారెస్ట్' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్న నగరం ఏది?
2. ఎఎస్ఇఎన్-2017 శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యమిస్తున్న నగరం ఏది?
3. ఓ ఫ్రెంచి సంస్థ నివేదిక ప్రకారం విశ్రాంత ఉద్యోగుల వసతుల కల్పనలో అట్టడుగున ఉన్న దేశం?
4. భూమికి సమీపంలో భూమిని పోలిన నాలుగు గ్రహాలను కలిగిన నక్షత్రం ఏది?
5. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాతావరణం

రాయలసీమ నుంచి కొమురిన్ వరకు ద్రోణి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రం మీదుగా ద్రోణులు కొనసాగుతున్నాయి. రాయలసీమ నుంచి తమిళనాడు మీదుగా శ్రీలంక తీరంలోని కొమురిన్ తీరం వరకు ఒకటి, ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు మరొకటి కొనసాగుతున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర పరిసరాల్లో 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఊపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో కోస్తాలోని కృష్ణా, కడప, చిత్తూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు, నెల్లూరులో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నెల 12, 13, 14 తేదీల్లో కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల ఉరుములతో కూడిన చెదురుమదురు జల్లుల నుంచి ఓ మోస్తరు జల్లులు కురుస్తాయని తెలిపింది. గురువారం ఉదయానికి తిరువూరులో 13.2, షార్ 10.4, అవనిగడ్డ 7.9, సుళ్లూరుపేట 5.4, గరివిడి 5.2, అనకాపల్లి 4.9, చిత్తూరు 12.9, రాయచోటి 11.6, చినమండెం 11.5, పాకాల 10.5, సాంబపల్లె, పుత్తూరు 8.8, తంబళ్లపల్లె, ఆరోగ్యవరం 6.2, మదనపల్లె 5.4, పెనగల్లూరు 5.1, రాజంపేట 4.9 శాంతిపురం 4.5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



అమరావతిలో ఆర్మీకి భూమిని కేటాయించండి

సిఎస్‌ను కోరిన మేజర్ జనరల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆర్మీ విభాగానికి అవసరమైన భూమిని కేటాయించాలని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మేజర్ జనరల్ ఎస్.శ్రీనివాసరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు వెలగపూడి లోని సచివాలయంలో సిఎస్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజధాని ప్రాంతంలో జరుగుతున్న వివిధ అభి వృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా రక్షణ రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

శంకరంబాడికి సిఎం నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి.. మల్లెపూదండా.. గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాళు లర్పించారు. తెలుగుజాతి ఉన్నంతకాలం ఆయన పేరు నిలిచిపోతుందని సిఎం కొనియాడారు. ప్రాంతీయ విభేదాలు లేకుండా ఆయన రాష్ట్ర గీతాన్ని రాశారని తెలిపారు. సుందర రామాయణం, సుందర భారతం, శ్రీనివాస శతకం ఆయనే రాశారని గుర్తు చేశారు.

ఔట్‌సోర్సింగ్ టెండర్లను రద్దు చేయాలి

- హైకోర్టు తీర్పు గౌరవించాలి..
- మున్సిపల్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జీవో 279లోని వర్క్ ఔట్‌సోర్సింగ్ టెండర్లను రద్దు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మున్సిపల్ జెఎసి హర్షం వ్యక్తం చేసింది. హైకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించి రాష్ట్ర మంతటా ఆయా టెండర్లు రద్దు చేయాలని మున్సిపల్ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో దీక్షా శిబిరం వద్ద జెఎసి నాయకులు గురువారం విలేకరుల సమావేశంలో మాటా డారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 279 జీవో ప్రకారం టెండర్ల ప్రకటన జారీ చేయగా, ఆ టెండర్లను రద్దు చేయాలని గుంటూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు హైకోర్టును ఆశ్రయించారని వివరించారు. వీటిని రద్దు చేస్తూ హైకోర్టు గురువారం తీర్పునిచ్చిందన్నారు.

279 జీవోను రద్దు చేయాలని 18 నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ నిరంకుశంగా టెండర్ల ప్రక్రియను ప్రారంభిం చిందని విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా జులైలో రాష్ట్ర వ్యాప్తంగా సాగిన మూడు రోజుల సమ్మెను గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని, హైకోర్టు తీర్పును గౌరవించి వర్క్ ఔట్‌సోర్సింగ్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించ కుండా మొండిగా వ్యవహరిస్తే కార్మికుల ఆగ్రహానికి గురికా వల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని వెల్లడించారు. మున్సిపల్ జెఎసి నాయ కులు కె ఉమామహేశ్వరరావు, ఎ రంగనాయకులు, ఎం డేవిడ్, ఎస్ జ్యోతిబాస్, జె జేమ్స్, జె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న దీక్షలు

మున్సిపల కార్మికుల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు దీక్షలను ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేషు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం బాలకాశి ప్రారంభించారు. కృష్ణా, కర్నూలు జిల్లాల కార్మికులు గురువారం దీక్షలో పాల్గొన్నారు. తెలుగుదేశం ఆత్మ గౌరవాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్న టిడిపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఓబులేషు ఈ సందర్భంగా అన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో తగిన శ్రద్ధ చూపడం చేతగాని ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థల పాదసేవలో మునిగితేలుతోందని విమర్శించారు. బాలకాశి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పోయేకాలం వచ్చినందునే కార్మికులకు భద్రత లేకుండా చేస్తోందన్నారు. కార్మికులకు సాంఘిక భద్రత, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని మంటగలిపే ప్రైవేటీకరణ విధానాలను విడనాడక పోతే తగిన మూల్యాం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గుంటూరు మున్సిపల్ వర్కర్స్ నాయకులు రవికుమార్, ఐఎన్‌టియుసి నాయకులు ఎంవి నారాయణ, ఎం డేవిడ్, సుబ్రమణ్యం, కృష్ణయ్య తదితరులు ప్రసంగించారు.

సంక్షోభంలో సంక్షేమం

- ఘనంగా కేటాయింపులు
- ఖర్చులో వెనుకబాటు
- విడుదలలో కోతల పర్వం
- ఇదీ మూడేళ్ల తీరు..

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమం.. సం'క్షామం'గా మారిపోతోంది. ఈ విషయంలో సంక్షేమ శాఖలు ఆశించిన స్థాయిలో స్పందిం చడం లేదు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో శాఖాధిపతులే కొంతవరకు కోతలు విధిస్తూ తక్కువ నిధులను విడుదల చేస్తుండగా, విడుదలైన నిధులను కూడా పూర్తిగా ఖర్చు చేయలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా సంక్షేమం కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత గత మూడేళ్లలో సంక్షేమం కోసం చేసిన కేటాయిం పులు, ఖర్చులను గమనిస్తే లక్ష్మించిన ప్రగతి కనిపించడం లేదు. నాలుగు ప్రధాన సంక్షేమ రంగాలుండగా, వాటిలో మైనార్టీ, గిరిజన సంక్షేమాల్లో కొంతవరకు సంతృప్తికర గణాంకాలు కనిపిస్తుండగా, కీలకమైన సాంఘిక, బిసి సంక్షేమాల్లో మాత్రం ఆందోళనకర పరిస్థితులున్నాయి. ఈ శాఖలకు విడుదల చేసిన నిధులు మురిగిపోతున్నాయి. దీంతో పేదలకు లబ్ధి చేకూరటం లేదు. ఇందుకు అధికారుల నిర్ల క్ష్యంతో పాటు బ్యాంకుల సహకారం కూడా పెద్దగా లేకపో వడం, లబ్ధిదారుల ఎంపికలోనే అపశ్రతులు ప్రధాన కారణా లుగా కనిపిస్తున్నాయని అధికారులే అంగీకరిస్తున్నారు.

సాంఘిక సంక్షేమ శాఖలో గత మూడేళ్లుగా పూర్తి స్థాయిలో ఖర్చు లేదు. 2015-16లో రూ. 2700 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, కేవలం రూ. 2123 కోట్లే వ్యయం చేయగలిగారు. 2016-17లో రూ. 3440 కోట్లకుగాను రూ. 2920 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 3685 కోట్లు కేటాయించగా, ఇంతవరకు రూ. 341 కోట్లు ఖర్చు చేశారు.

వెనుకబడిన తరగతుల శాఖకు 2015-16లో 3143 కోట్లు కేటాయించగా రూ.2675 కోట్లు, 2016-17లో రూ. 5113 కోట్లుకుగాను రూ. 3790 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. తాజా బడ్జెట్‌లో రూ. 5011 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ. 369 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గిరిజన సంక్షేమ శాఖకు 2015-16లో రూ.1115 కోట్లు కేటాయించగా రూ. 957 కోట్లు, 2016-17కు రూ.1563 కోట్లుకుగాను రూ. 1208 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది రూ. 1815 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ. 214 కోట్లు ఖర్చు చేశారు.

మురుగుతున్న నిధులు

బడ్జెట్ కేటాయింపులకు, ఖర్చుకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. వేల కోట్లు ఖర్చు కాకుండానే మురిగిపోతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బిసి సంక్షేమ శాఖకు 2015-16లో రూ. 3105 కోట్లు విడుదల చేయగా రూ. 2675 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రూ. 429 కోట్లు ఖర్చు కాకుండా మురిగిపోయినట్లు గుర్తించారు. 2016-17లో కూడా 1196 కోట్లు ఖర్చు కాకుండా మిగిలిపోయింది. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు విడుదలైన నిధుల్లో రూ. 360 కోట్లు ఇంకా ఖర్చు కాలేదు. బిసి సంక్షేమ శాఖలో కూడా రూ. 2015-16లో రూ. 270 కోట్లు, 2016-17లో రూ. 450 కోట్ల వరకు ఖర్చు కాలేదు.

ఖర్చుకాని కాపు నిధులు

రాష్ట్రంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా ఉన్న కాపుల ఉద్యమ నేపథ్యంలో కాపుల కోసం చేస్తున్న ఖర్చును పరిశీలిస్తే గత ఏడాది విడుదల చేసిన రూ.1000 కోట్లలో కేవలం రూ. 581 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ ఏడాది వెయ్యి కోట్లలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని అధికారులు చెబుతున్నారు.

సంక్షేమ శాఖల్లో ఖర్చు కాని నిధులు (రూ.కోట్లలో)

శాఖ	2015-16		2016-17		2017-18	
	బడ్జెట్	ఖర్చు	బడ్జెట్	ఖర్చు	బడ్జెట్	ఖర్చు
సాంఘిక	2691	2123	3440	2469	3695	341
బిసి	3143	2675	5113	3790	5011	369
గిరిజన	1115	957	1563	1208	1815	214
మైనార్టీ	378	335	710	635	840	96

వ్యక్తిగత దూషణలు సరికాదు..

- మంత్రులపైనా ఫిర్యాదులొచ్చాయ్
- నంద్యాల ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో కోడ్ ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో నేతలంతా సంయమనం పాటించాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు సరికాదని సూచించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈనెల 23న జరిగే నంద్యాల ఉప ఎన్నికలకు ఏర్పాటన్నీ పూర్తి చేశామని చెప్పారు. పోటీలో 15 మంది అభ్యర్థులు ఉన్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, కాంగ్రెస్ సహా మరో ఆరు పార్టీలు పోటీలో ఉన్నాయని చెప్పారు. వీరితో బాటు మరో ఆరుగురు ఇండిపెండెట్లు పోటీ పడుతున్నారని చెప్పారు. ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఓటర్లుగా అవకాశం కల్పించామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,19,108 మంది ఓటర్లుంటే, వీరిలో 1,07,778 మంది పురుషులు కాగా, 1,11,018 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. థర్డ్ జెండర్‌లు 62 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. 255 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసిటీవీలను ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల నుంచి లైవ్ వెబ్ కాస్టింగ్ ఉంటుందని, ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వీడియోగ్రఫీ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కేంద్ర బలగాలతో పాటు ఎపిఎస్పీ బలగాలను వినియోగిస్తున్నామన్నారు. 173 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 32 మంది స్టాటిక్ ఆఫీసర్లు, 57 మోడల్ కోడ్ నిర్వహణ బృందాలను నియమించామన్నారు. ఇంతవరకు 44 కేసులు నమోదు చేశామన్నారు. రూ.10,75,730 నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. 166 అక్రమ మద్యం కేసులు నమోదు చేయగా, వాటికి సంబంధించి 177 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 77 బెల్ట్‌షాపులను సీజ్ చేశామన్నారు.



జగన్ వ్యాఖ్యలపై తుది నిర్ణయం కేంద్ర ఎన్నికల సంఘానిదే..

నంద్యాలలో ఈనెల 3న జరిగిన సభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై తుది నిర్ణయం కేంద్ర ఎన్నికల సంఘానిదేనని భన్వర్‌లాల్ తెలిపారు. జగన్ వాఖ్యలపై వివరణ కోరామని, ఆయన నుంచి వివరణ కూడా అందిందని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కూడా నివేదిక కోరామన్నారు. నివేదిక అందగానే ఎన్నికల సంఘానికి పంపిస్తామని చెప్పారు. కొందరు మంత్రులపై కూడా ఫిర్యాదులు అందాయని, వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. మంత్రుల పర్యటనలపై కూడా కలెక్టర్‌నుంచి నివేదిక కోరామన్నారు. ఎవరు అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. .

చిత్తూరులో రెండు పరిశ్రమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లాలో రెండు కొత్త కంపెనీలు రానున్నాయి. ఈ జిల్లా శ్రీసిటీలో టెక్నికల్ టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటుకు టోరే కంపెనీ, అదే జిల్లాలో అల్యూమినియం డై కాస్ట్ పరిశ్రమ ఏర్పాటుకు రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో వెలగపూడిలోని సచివాలయంలో ఆయా కంపెనీ ప్రతినిధులు గురువారం భేటీ అయ్యారు. చిత్తూరు జిల్లాను దక్షిణ భారతదేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సిఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈజిల్లా చెన్నై నగరానికి, కృష్ణపట్నం పోర్టుకు దగ్గరగా ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల సంస్థ నుంచి శ్రీసిటీకి భూమిని బదలాయిస్తుందని, ఈ నెలఖారులోగా ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. టెక్నికల్ టెక్స్‌టైల్ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా 100మందికి, పరోక్షంగా 300 నుంచి 400 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని కంపెనీ ప్రతినిధులు సిఎంకు తెలిపారు. తమ యూనిట్‌కు వచ్చే జనవరిలో శంకుస్థాపన చేసి 2020 నాటికి పూర్తిచేస్తామన్నారు. హీరో మోటో కార్ప్ గ్రూప్‌నకు అనుబంధంగా ఉన్న రాక్‌మేన్ ఇండస్ట్రీస్ రూ.540కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ డైరెక్టర్ వీరరాఘవన్ తెలిపారు. ఈ పరిశ్రమ వల్ల 4వేల ఉద్యోగావకాశాలు కలుగుతాయని వివరించారు. రాష్ట్రంలో ద్విచక్రవాహనాలకు, నాలుగు చక్రాల వాహనాలకు కావలసిన అల్యూమినియం డై కాస్ట్ భాగాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. భూ కేటాయింపు జరిగిన నెలరోజుల్లో శంకుస్థాపన చేసి ప్లాంటు నిర్మిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో వరుసగా మూడేళ్ల కరువు

రూ.1851 కోట్లివ్వండి

కేంద్ర మంత్రికి లోకేష్ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వరుసగా మూడేళ్ల పాటు రాష్ట్రంలో కరువు ఏర్పడిందని ఎపి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అందువల్ల ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించామని, ఇతర రాష్ట్రాల కంటే ముందు ఉన్నామని తెలిపారు. గురువారం నాడిక్కడ మంత్రి లోకేష్ కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను కలిశారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి జితేందర్ సింగ్, కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖ సెక్రటరీ అమర్జీత్ సిన్హా లను కూడా కలిశారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రానికి మెటీరియల్ బడ్జెట్ కింద రావాల్సిన రూ.1351.81 కోట్లు, లేబర్ బడ్జెట్ కింద రావాల్సిన రూ.600 కోట్ల నిధులు త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. రోడ్డు సౌకర్యం లేని 2207 నివాస ప్రాంతాలను గుర్తించామని, ఈ ప్రాంతాలకు 4772 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3185 కోట్ల ఖర్చు అవుతుందని, దీనికి కేంద్ర సహాయం చేయాలని , అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్‌కు రావాల్సిన రెండో విడత నిధులు రూ.165 కోట్లు విడుదల చేయాలని కోరారు. జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులు, సోలార్ ఆధారిత నీటి సరఫరా పథకానికి రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయాలని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కూడా లోకేష్ కోరారు.

వెంకయ్యతో ఉపరాష్ట్రపతి కావడం ఏపికి లోటు

వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం ఆంధ్రప్రదేశ్‌కు లోటని లోకేష్ పేర్కొన్నారు. వెంకయ్య నాయుడు రాష్ట్రాభివృద్ధికి ఎనలేని సహాయ సహకారాలు అందించారని ఆయన అన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యానాయుడును గురువారం ఆయన నివాసంలో కలిసి లోకేష్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం గర్వంగా ఉందన్నారు. లోకేష్ వెంట ఎంపిలు సిఎం రమేష్, మాగంటి బాబు, అవంతి శ్రీనివాసరావు, జె.సి దివాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, ఏపి భవన్ రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ తదితరులున్నారు.

ఆక్వా సాగులో యాంటీ బయోటిక్స్‌ను తగ్గించండి

సిఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆక్వా సాగులో రైతులు విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్ వినియోగించకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఆక్వా రైతులకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. యాంటీ బయోటిక్స్‌ను వినియోగాన్ని తగ్గిస్తే, క్వా ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మత్స్య శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆక్వా ఎగుమతులకు యూరోపియన్ (ఇయు), అమెరికా, జపాన్‌ల నుంచి వస్తున్న అభ్యంతరరాలను అధికారులు సిఎస్‌కు వివరించారు. రాష్ట్రం నుంచి ఇయుకు ఎగుమతి అవుతున్న రొయ్యలకు దేశ సరిహద్దులో చేస్తున్న తనిఖీలు పెరిగాయని చెప్పారు. వాటిలో యాంటీ బయోటిక్స్ అవశేషాలుంటే వెనక్కి పంపేస్తున్నారని తెలిపారు. నవంబరులో ఇయు కమీషన్ సభ్యులు రాష్ట్రానికి రానున్నారని, వారు రాష్ట్రంలోని ఆక్వాసాగును స్వయంగా పరిశీలించే అవకాశం ఉందని సిఎం అధికారులకు చెప్పారు. ఈ నేపథ్యంలో యాంటీ బయోటిక్స్ తగ్గించేందుకు వీలుగా రైతుల్లో అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జెఎస్వి ప్రసాద్, కమీషనర్ రాం శంకర్ నాయక్, ఎంపెడా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సంతృప్తికంగా సేవలందించండి

ప్రజలకు సంతృప్తి కలిగించే రీతిలో సేవలందించాలని విద్యుత్తు పంపిణీ సంస్థల అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ సూచించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సేవా దృక్పథంతో రైతులకు విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. పంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యుత్తు శాఖపైనా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విద్యుత్తు టారిఫ్ వివరాలను అధికారులకు సిఎస్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. సమావేశంలో విద్యుత్తు శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో ఎండి విజయానంద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆయేషా మీరా హత్య కేసుపై విశాఖ డిఐజి శ్రీకాంత్‌తో సిట్

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆయేషా మీరా హత్య కేసును తిరిగి దర్యాప్తు చేసే ప్రత్యేక దర్యాప్తు బందానికి (సిట్) విశాఖ రేంజ్ డిఐజీ సీహెచ్ శ్రీకాంత్ సారథ్యం వహిస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వివరించింది. వెంటనే దర్యాప్తును ప్రారంభించే సిట్ టీంలో సభ్యులుగా డిఎస్‌పిలు శ్రీలక్ష్మి, డి.హిమావతి, నున్న ఇన్‌స్పెక్టర్ సాహెరున్నీసా ఉంటారని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్‌కు విన్నవించింది. బి ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య కేసులో పి.సత్యంబాబును హైకోర్టు నిర్దోషి తేల్చుతూ, అసలు దోషులు ఎవరో గుర్తించే ప్రయత్నం చేయాలని పేర్కొంది. దీంతో ఈ కేసును పునర్ దర్యాప్తు చేయాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమా మెల్కోటే, సామాజిక కార్యకర్త వి. సంధ్యారాణి, జర్నలిస్టు కె.సజయ వేసిన ప్రజాహిత వ్యాజ్యంతోపాటు, సిట్ దర్యాప్తును హైకోర్టు పర్యవేక్షించాలని, లేని పక్షంలో సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ ఆయేషా తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాష మరో పిటిషన్‌ను కలిపి బెంచ్ గురువారం విచారించింది. సిట్ టీంలో ఉండే వివరాల్ని ప్రభుత్వ న్యాయవాది విద్యావతి హైకోర్టుకు తెలిపారు. విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

కరువు ప్రాంతాల్లో రేపటి నుంచి సిపిఐ బృందం పర్యటన

అనంతపురంపై కరువు నివేదిక సిద్ధం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కరువు జిల్లాల్లో సిపిఐ ప్రతినిధి బృందం ఈ నెల 12 నుంచి 17వరకు పర్యటిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వెల్లడించారు. రాష్ట్రంలో 237 మండలాలకుపైగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వేసిన పంటలకు నీరు లేకపోవడంతో ఎండిపోయి, పొలాలన్నీ బీడుగా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23లక్షల ఎకరాల్లో వేరుశెనగ వేయాల్సి ఉండగా కేవలం 8.32 లక్షల ఎకరాల్లోనే వేశారని, వేసిన పంట కాస్తా వర్షాభావం కారణంగా పూర్తిగా ఎండిపోయిందని వివరించారు. ప్రకాశంజిల్లాలో అత్యల్పంగా 18 శాతం విస్తీర్ణంలోనే వేసిన పంట కూడా ఎండిపోవడంతో విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చుల కోసం వెచ్చించిన మొత్తాన్ని రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. రెయిన్‌గన్లు పంటలను కాపాడేందుకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదని, కరువు తీవ్రత వల్ల గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారని వివరించారు. కరవు పీడిత ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటించి రైతాంగాన్ని ఆదుకోవాల్సింది పోయి, నంద్యాల ఉప ఎన్నికపైనే దృష్టి కేంద్రీకరించారని ఆయన తప్పుబట్టారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కరవు సహాయక చర్యలు చేపట్టాలని, వర్షాలు కురిసిన పక్షంలో ప్రత్యామ్నాయ పంటలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఇప్పటికే అనంతపురం జిల్లాలో సిపిఐ ప్రతినిధిబృందం పర్యటించి కరవు పరిస్థితులను సమీక్షించిందన్నారు. సిఎం, వ్యవసాయ శాఖా మంత్రికి కరువు నివేదికను అందజేస్తామన్నారు.

మున్సిపల్ శాఖ పనితీరు మారాలి

- పారిశుధ్యం లోపిస్తే బిల్లుల్లో కోత
- జిల్లా కేంద్రాల్లో కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్లు
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మూడు నెలల్లో మున్సిపల్ శాఖ పనితీరు పట్ల ప్రజల్లో 80 శాతానికి మించి సంతృప్తి కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పాలనకు సంబంధించి ప్రజల సంతృప్తే ముఖ్యమన్నారు. ఈ అంశంపై థర్డ్ పార్టీ సర్వేను చేయిస్తామన్నారు. సచివాలయంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ (సిసిసి)ను గురువారం సిఎం ప్రారంభించారు. అనంతరం ఆ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ సెంటర్ నుంచి మున్సిపాలిటీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ నిర్మాణాలు, మోడల్ ఇళ్ళ నిర్మాణాలను సిఎం ప్రత్యేక్షంగా (లైవ్‌లో) వీక్షించారు. పారిశుధ్యం, ఇతర విషయాలలో బాధ్యతగా వ్యవహరించే పౌరులకు పన్నుల్లో రాయితీలిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏజన్సీలు పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోతే వారికి చెల్లించే బిల్లుల్లో కోత విధించాలని, ఇతర క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారాన్ని ప్రజలకు తెలిసే విధంగా అందుబాటులో ఉంచాలన్నారు. ఇతర శాఖలు కూడా సిసిసిలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిపాలనా విభాగం డైరెక్టర్ కె.కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 18,500 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని, అక్కడ జరిగే పారిశుధ్య కార్యక్రమాలను లైవ్‌లో ప్రతి రోజూ పరిశీలిస్తున్నామని సిఎంకు వివరించారు. అన్ని బ్లాక్ స్పాట్‌లను గ్రీన్ స్పాట్‌లుగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పనుల పర్యవేక్షణకు గాను స్మార్ట్ పబ్లిక్ హెల్త్ వర్క్యుర్లుగా 850 మందికి శిక్షణ ఇప్పించామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, ముఖ్య కార్యదర్శి ఆర్.కరికాల వలవన్, రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఒ ఎ.బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మున్సిపాలిటీల్లో ప్రజల భాగస్వామ్యం: సిఎం

ప్రజలకు అందించే సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో వ్యయం, సమయం ఆదా అవడంతోపాటు అవినీతి తగ్గుతుందని సిఎం చంద్రబాబు అన్నారు. సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీని స్మార్ట్‌గా తీర్చి దిద్దడానికి ప్రజలను భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పౌరుడు తాను నివశించే పట్టణం, నగరం తనదిగా చెప్పుకునే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రాల్లో కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇక్కడి సెంటర్‌కు అనుసంధానం చేస్తామన్నారు.

ఏర్పేడు కథ కంచికేనా?!

- కేసు మూసివేతకు రంగం సిద్ధం
- నాలుగు నెలలైనా సాగని స్థితి
- ఎఫ్ఐఆర్‌లో ఒక్కరి పేరుంటే ఒట్టు
- కళ్లముందే తిరుగుతున్న కీలక నిందితులు
- ఇసుక మాఫియాకు అండగా సర్కారు


బాధితులను బయటే నిలబెట్టి మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఏర్పేడు ఘటన జరిగి నూరు రోజులు దాటింది. ఆ ఘటన 16 మందిని పొట్టన పెట్టుకుంది. 23 మందిని శాశ్వత వికలాంగులను చేసింది.. ప్రధాన కారకులైన ఇసుక మాఫియా కీలక నిందితులు కళ్ల ముందే తిరుగుతున్నా అరెస్టు చేయలేదు.. ఘటన జరిగి మూడు నెలలు దాటినా ఇంతవరకూ ఎఫ్ఐఆర్‌లో చనిపోయిన వారి పేర్లు గానీ, గాయపడిన వారి పేర్లు గానీ లేవు.. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకపోవడంతో ఇన్స్యూరెన్సు చేయించుకున్న వారికి అందాల్సిన సాయం అందలేదు. కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే ఇసుక మాఫియాకు సర్కారు అండగా నిలిచిందని ప్రతిపక్షాలూ, బాధిత కుటుంబీకులూ, ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏప్రిల్ 21.. మరచిపోలేని రోజు

ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని, భూగర్భ జలాలను పరిరక్షించాలని గత ఏప్రిల్ 21న మునగనపాళ్యం రైతులు చిత్తూరు జిల్లా ఏర్పేడు మండల పోలీసు స్టేషన్‌లో ఉన్న అర్బన్ ఎస్‌పి జయలక్ష్మికి విన్నవించుకునేందుకు వచ్చారు. తమపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసులే రక్షించాలని రైతులు ఎస్‌పికి మొరపెట్టుకున్నారు. ఇది సివిల్ మ్యాటరనీ, రెవెన్యూ వాళ్ల ద్వారా పరిష్కరించుకోవాలనీ ఎస్‌పి సమాధానం చెప్పారు. సిఐ సాయినాథ్, ఎస్ఐ రామకృష్ణ రైతులను లోనికి పిలవకుండా బయటే నిల్చోబెట్టి గంటకు పైగా మాట్లాడారు. ఎండగా ఉంది లోనికి వెళ్లి మాట్లాడుకుందామన్నా పట్టించుకోలేదు. ఇంతలో మృత్యు రూపంలో లారీ దూసుకొచ్చింది. అన్నదాతలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 16 మంది మృతి చెందారు. 23 మంది శాశ్వత వికలాంగులయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమై అప్పట్లో ఇసుక మాఫియాను ఒక్క కుదుపు కుదిపింది.

కేసు మూసివేతకు ప్రయత్నం

ఇసుక మాఫియా కీలక నిందితులంతా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టిడిపి అనుచరగణమే. వీరిపై బెయిలబుల్ కేసులు పెట్టాలంటే ఘటనలో చనిపోయిన వారి పేర్లు గానీ, గాయపడిన వారి పేర్లు గానీ ఉద్దేశపూర్వకంగానే నమోదు చేయలేదు. ఇసుక మాఫియాలో ఎంతటి వ్యక్తినైనా వదిలేది లేదంటూ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ పరామర్శించడానికి వచ్చి ప్రగల్భాలు పలికారు. ఆచరణలో మాత్రం కీలక నిందితులైన ధనంజయులు నాయుడు, చిరంజీవులు నాయుడు, నాగరాజు నాయుడు విదేశాలకు వెళ్లి కొన్నాళ్లు తలదాచుకుని, తిరిగొచ్చి కళ్లెదుటే తిరుగుతున్నా అరెస్టు చేయలేదు. ప్రభుత్వమే వారిని కాపాడే ప్రయత్నం చేస్తోందని సర్వత్రా వినవస్తోంది.

ఐపిసి 41, 42 సెక్షన్ల కింద కేసు నమోదు

ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పోలీసులు మాఫియా డాన్‌లపై ఐపిసి 41, 42 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. లారీ ఘటనకు ఇసుక మాఫియానే కారణమని ప్రతిపక్షాలు, బాధితులు నెత్తీనోరూ కొట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేయలేదు. ఇసుకను తరలిస్తున్నారని 33 మందిపైన అక్రమంగా కేసులు పెట్టారు.

వీరిలో కీలకంగా ధనంజయులు నాయుడు, చిరంజీవులు నాయుడు, నాగరాజు నాయుడు ప్రధానంగా ఉన్నారు. చిన్నాచితక ఇసుక వ్యాపారం చేసే 13 మందిని మాత్రమే పోలీసులు అప్పట్లో అరెస్టు చూపారు. మిగిలిన 20 మందిని గుర్తించి వంద రోజులవుతున్నా అరెస్టు చేయకపోవడం శోచనీయం. ఈ ఘటనకు సంబంధించి లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్లను అరెస్టు చేయడంతోపాటు, రెండునెలల పాటు వారికి బెయిల్ దొరకలేదు.

శాశ్వత వికలాంగులకు అందని ఇన్స్యూరెన్స్

ఏర్పేడు ఘటనలో ఓ జర్నలిస్టుతోపాటు 16 మంది మృతి చెందారు. 23 మంది తీవ్రంగా గాయపడి శాశ్వత వికలాంగులయ్యారు. మృతులకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియో అందింది. టిడిపి సభ్యత్వం కలిగి ఉన్నోళ్లకు మరో రెండు లక్షలు ఇచ్చారు. గాయపడిన వారికి రెండుసార్లుగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష మొత్తాన్ని అందించి చేతులు దులుపుకున్నారు. విశాలాంధ్ర విలేకరి వెంకటేష్‌కు ఇంతవరకూ సాయమందలేదు. ఆంధ్రప్రభ రిపోర్టర్ హరిబాబుకు వైద్యఖర్చులు రూ.ఐదు లక్షలుకాగా, ప్రభుత్వం కేవలం రూ.రెండున్నర లక్షలే అందించింది. బొందల దినేష్ యాదవ్, దేశమూర్తి, సావిత్రి, మోతుపల్లి గజేంద్ర నాయుడు, రావూరి మునిరత్నం నాయుడు, సుబ్బమ్మ ఇప్పటికీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూనే ఉన్నారు. 20 మంది వరకూ ఇన్స్యూరెన్స్ (చంద్రన్న బీమా) చేయించుకున్నారు. అయితే ఎఫ్ఐఆర్‌లో మృతుల పేర్లుగానీ, క్షతగాత్రుల పేర్లు గానీ లేకపోవడంతో రావాల్సిన రూ.ఐదు లక్షల సాయం ఇప్పటికీ అందలేదు.


ఘటనకు ముందు అర్బన్ ఎస్‌పితో మాట్లాడుతున్న బాధితురాలు


ఏప్రిల్ 21న ప్రమాదానికి కారణమైన మృత్యు లారీ


ఘటన జరిగిన ముందు రోజు ఇసుకను తవ్వకుండా అడ్డుకుంటున్న మునగలపాళెం మహిళలు

ఎఫ్ఐఆర్‌లో ఎవరి పేరు లేదు



ఏర్పేడు పోలీస్టు స్టేషన్ వద్ద రైతులు ఎస్‌పికి వినతిపత్రం ఇచ్చే వార్త కవరేజి కోసం ఆంధ్రజ్యోతి విలేకరి బాలమురళి, విశాలాంధ్ర విలేకరి వెంకటేష్, నేనూ వెళ్లాము. ఆ ఘటనలో పూర్తిగా గాయపడిన బాలమురళి మృతి చెందారు. నాకు బక్రెముకలు విరిగాయి. విద్యుత్ షాక్‌తో లివర్ దెబ్బతింది. చెన్నయ్ అపోలో ఆస్పత్రిలో 11 రోజులు చికిత్స తీసుకున్నా. రూ.ఐదు లక్షలు ఖర్చయ్యింది. ప్రభుత్వం రూ.రెండున్నర లక్షలే అందించింది. ఎఫ్ఐఆర్‌లో మా పేర్లు లేకపోవడంతో ఇన్స్యూరెన్స్ వారు మాకు ఇవ్వాల్సిన ఐదు లక్షలు ఇవ్వలేమని చెబుతున్నారు. పోలీసులు కావాలనే ఇసుక మాఫియాను రక్షించేందుకు మా పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదు.


- హరిబాబు, ఆంధ్రప్రభ విలేకరి

పైసా సాయం అందలేదు

మొత్తం 23 మంది తీవ్రంగా గాయపడితే 20 మందికి మాత్రమే అరకొ రగా సాయం అందిం చారు. నాకు కాలూ చేయి విరిగింది. ఇంతవరకూ ఎటువంటి సాయం అందలేదు. మంత్రికి స్వయంగా చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. ఇసుక మాఫియా డాన్‌లను రక్షించేందుకు టిడిపి ప్రభుత్వమే పోలీసులపై వత్తిడి తెచ్చి కేసు నీరుగారేలా చేస్తోంది.

- వెంకటేష్, విశాలాంధ్ర విలేకరి

పది రోజుల్లో ఛార్జిషీట్



పది రోజుల్లో ఛార్జిషీట్ వేస్తాం. కేసు పూర్వపరా లను పరిశీలించి ఛార్జిషీటు వేయాలని అనుకున్నాం. ఇసుక అక్రమ రవాణా చేసినందుకు కేసులను బనాయించాం. 13 మందిని అరెస్టు చేశాం. ఈ అక్రమ రవాణాలో కీలకంగా ఉన్న ధనంజయులు నాయుడును 10వ తేదీ లోపు లొంగిపోవాలని హెచ్చరించాం.

- నంజుండప్ప, రేణిగుంట డిఎస్‌పి

ప్రభుత్వం కాపాడుతోంది



ఏర్పేడు ఘటనకు సంబంధించి 90 రోజుల్లో కేసు పెట్టి నిందితులను కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. అయితే మూడు నెలలు దాటినా నిందితుల పైన కేసు నమోదు చేయకపోవడం చూస్తుంటే ప్రభు త్వమే ఇసుక మాఫియాను రక్షిస్తోంది. ఎఫ్ఐఆర్‌లో ఒక్కరి పేరు కూడా చేర్చకపోవడం చూస్తుంటే ఈ ఘటనలో బాధితులను ప్రభుత్వం ఎంత చులకనగా చూస్తోందో అర్థమవుతోంది.

- ఎ.పుల్లయ్య, రైతుసంఘం జిల్లాకార్యదర్శి

బాబు అబద్ధాల టేప్ రికార్డర్

- బాబును ఉరితీసినా తప్పులేదు ఎయిర్‌పోర్టు, ఫుడ్‌పార్కు, స్మార్‌సిటీ ఏమయ్యాయి?
- టిడిపి నేతలు రూ.ఐదేసి వేలు ఇస్తూ ఓటర్లతో ప్రమాణాలు చేయించుకుంటున్నారు
- ప్రతిపక్షనేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి


నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల క్రైం

'నంద్యాలలో ఉప ఎన్నికల్లో ఓటరుకు రూ.5 వేలు చొప్పున ఇచ్చి ఓటు వేయాలని టిడిపి నాయకులు ప్రమాణం చేయించుకుంటున్నారు. ముఖ్యమంత్రి అబద్ధాల టేప్ రికార్డు ఆన్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు' అని వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తీవ్రంగా విమర్శించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని చాబోలు గ్రామంలో గురువారం జగన్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేబినెట్ మొత్తం నంద్యాలలో తిష్ట వేసిందన్నారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును ఉరితీసినా తప్పులేదని మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలకు తెరదీశారు. 'ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తప్పితే తప్పు కాదా? మాట తప్పినందుకు ఉరిశిక్ష విధించాలంటే నా దిష్టిబొమ్మను కాల్చారు.' అని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైసిపి నేతలను టిడిపిలో చేర్చుకోవడానికి బుజ్జగింపులు, బేరసారాలు చేస్తున్నారని విమర్శించారు. 2014 ఆగస్టు 15న జిల్లాకు ఇచ్చిన వాగ్దానాలు అమలు కాలేదని తెలిపారు. మద్యం నుంచి ఇసుకు వరకూ, గుడి భూములుసహా బాబు దోచుకుంటూ రూ.మూడున్నర లక్షల కోట్లు సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. జాబు రావాలంటే బాబు రావాలని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారన్నారు. అధికారం కోసం రుణమాఫీ పేరుతో మోసం చేశారని విమర్శించారు.

చంద్రబాబుకు ఎన్నికల కోసమే నంద్యాల అభివృద్ధి గుర్తుకు వచ్చిందన్నారు. కర్నూలు రైల్వే మరమ్మతుల ఫ్యాక్టరీ, మైనింగ్ స్కూల్, ఎయిర్‌పోర్టు, ఫుడ్‌పార్క్, కర్నూలుకు స్మార్ట్‌సిటీ, ట్రిపుల్‌ఐటి, హైదరాబాద్, బెంగళూరు తరహా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు గతంలో హామీలిచ్చారని తెలిపారు. వీటిని ఎందుకు నెరవేర్చలేదని ప్రజలు ఆయన్ను నిలదీయాలని పిలుపునిచ్చారు. వైసిపి కులమతాలకు అతీతంగా అందరికీ అండగా ఉంటుందన్నారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జగన్‌తోపాటు వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పిపి.నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, ప్రముఖ న్యాయవాది ఎం.విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ సిద్ధం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ హరిజవర్‌లాల్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 120 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆగస్టు 15 నుంచి ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణను అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ హరిజవహర్‌లాల్ పేర్కొన్నారు. గురువారం గుంటూరు చుట్టుగుంటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 లక్షల హెక్టార్ల విస్తీర్ణం లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 20.20లక్షల హెక్టార్లలో పంటలు వేశారన్నారు. గతేడాది ఇదే సమయంతో పోల్చితో ఈ ఏడాది ఇప్పటి వరకూ ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వంద శాతం పంటలు వేశారని, అనంతపురంలో 44 శాతం, నెల్లూరు 50 శాతం, విజయనగరంలో 63 శాతం, ప్రకాశంలో 75 శాతం, విశాఖ 60 శాతం మాత్రమే పంటలేశారని తెలిపారు. ఆయా జిల్లాల్లో సరిపడా వర్షపాతం నమోదు కానందునే విస్తీర్ణం పెరగలేదని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు అలసంద, ఉలవలు, కంద, మినుములు, జొన్న, సజ్జ, రాగుల్ని ప్రత్యామ్నాయ పంటలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించామన్నారు. కౌలు రైతులకు సంబంధించి ఎల్ఇసి కార్డులకు రూ.383 కోట్లు, సిఒసి కార్డులపై రూ.130 కోట్లు, రైతు మిత్ర గ్రూపులకు రూ.221 కోట్లు, జెఎల్‌జి గ్రూపులకు రూ.108 కోట్లు మొత్తం రూ.843 కోట్లు రుణాలు అందచేశామన్నారు. గతేడాది ఖరీఫ్, రబీ అన్ని కలిపి రూ.300 కోట్లే రుణాలు అందాయని పేర్కొన్నారు.

తిరుపతి తారకరామ స్టేడియంలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో గురువారం విద్యార్థినులు గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ నిర్వహించారు. కళాశాలల, పాఠశాలల విద్యార్థినులు డ్యాన్స్, యోగా ప్రాక్టీస్ చేశారు. ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'క్విట్ ఇండియా'

సంపాదకీయం

బ్రిటిష్ వలస పాలకులను దేశం విడిచి వెళ్లాలని (క్విట్ ఇండియా) మహాత్మాగాంధీ పిలుపునిచ్చి 75 సంవత్సరాలైంది. 'క్విట్ ఇండియా' మహత్తర స్వాతంత్య్ర సంగ్రామాన్ని మరింత రగిలింపజేసి ఆంగ్లేయులు మన దేశాన్ని విడిచి పెట్టేలా చేసింది. ఆ చారిత్రక వార్షికోత్సవ సందర్భంగా బుధవారం పార్లమెంట్‌లో మన నేతలు చేసిన ప్రసంగాలు, వెలిబుచ్చిన అభిప్రాయాలు ముమ్మాటికీ చర్చనీయాంశాలు, సమీక్షాంశాలు. పేదరికం, అపారిశుధ్యం, అవినీతి, ఉగ్రవాదం, కులతత్వం, మతతత్వం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పోషకాహారలేమి వంటి అనేకానేక రుగ్మతలు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ వక్కాణించారు. అంతేనా, క్విట్ ఇండియా నినాదం మారాలన్నారు. నాడు 'సాధిస్తాం లేక ప్రాణాలర్పిస్తాం' అనే నినాదం ప్రతిధ్వనించగా నేడు 'సాధిస్తాం సాధించి తీరతాం' అనే నినాదం ఎత్తుకోవాలని ప్రవచించారు. 1942లో క్విట్‌ఇండియా పిలుపునివ్వగా ఐదేళ్లకు 1947లో స్వాతంత్య్రం సిద్ధించిందని, అలాగే దేశాన్ని పీడిస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు 2017లో సంకల్పం చెప్పుకొని 2022లో సాకారం చేయాలని ధర్మోపన్యాసం ఇచ్చారు. ఆ విధంగా పార్లమెంట్ సభ్యులతో ప్రతిజ్ఞ కూడా చేయించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ ఇంతకాలం ఏలిన కాంగ్రెస్‌దే తప్పన్నట్లు పరోక్షంగా ప్రత్యర్థి పార్టీపై విమర్శలు చేశారు. మోడీ వల్లించినట్లు ఐదేళ్లలో దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పోతే ఎవ్వరికైనా అంతకంటే కావాల్సిందేముంది? మూడేళ్లుగా కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో దేశానికి పట్టిన రుగ్మతలను నిరోధించడం సాధ్యమేనా?

స్వాతంత్య్రం వచ్చి 70 సంవత్సరాలైనా స్వాతంత్య్ర సాధన కోసం త్యాగాలు చేసిన నాటి సమర యోధులు కన్న కలలు సాకారం కాలేదని నాయకుల ఉపన్యాసాలతో తేటతెల్లమైంది. స్వాతంత్య్రోద్యమ లక్ష్యం కేవలం బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టడమేకాదు. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సమసమాజ స్థాపన నాటి ఉద్యమకారులు కన్న కలలు. అవి కల్లలు కావడానికి కారణం స్వాతంత్య్రానంతరం భారత పాలకులు ఎంచుకున్న పెట్టుబడిదారీ విధానం. పెట్టుబడిదారీ విధానంలో ప్రజలకు సమానత్వం రాదు సరికదా మరింతగా అసమానతలు పెరుగుతాయి. మనకు ఎదురైన అనుభవం అదే. దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించిన కాంగ్రెస్ పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగించింది. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు అమలు చేశాక పరోక్షంగా అమెరికా, అభివృద్ధి చెందిన దేశాల వలస పాలన మొదలైంది. ఫైనాన్స్ పెట్టుబడి స్వేచ్ఛగా రావడానికి వీలు కల్పిస్తూ కాంగ్రెస్ నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు తెచ్చింది. అలీన విధానాన్ని వదిలిపెట్టి అమెరికాకు అత్యంత నమ్మకమైన జూనియర్ భాగస్వామిగా భారత్‌ను తయారు చేసింది. నాడు క్విట్ ఇండియా అని బ్రిటిష్ వారిని వెళ్లగొట్టగా విదేశీ కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచి మన వనరుల దోపిడీకి స్వేచ్ఛ కల్పించింది. ప్రజలపై భారాలు మోపింది. కాంగ్రెస్‌కు తాను పూర్తి భిన్నమంటూ అధికారంలోకొచ్చిన బిజెపికి, కాంగ్రెస్‌కు ఆర్థిక విధానాల్లో తేడా లేదు. కాంగ్రెస్ అమలు చేసిన నయా- ఉదారవాద ఆర్థిక విధానాలను బిజెపి భుజానికెత్తుకొని వాయువేగంతో అమలు చేస్తోంది. మరింతగా అమెరికాకు సాగిలపడింది. కాంగ్రెస్ అమలు పర్చిన విధానాలనే మరింత వేగంగా అమలు చేస్తూ దేశానికి పట్టిన చీడను ఐదేళ్లల్లో వదిలిస్తానని మోడీ ప్రతిన బూనడం ప్రజలను మోసగించడానికే.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మతతత్వం జడలు విప్పి వికటాట్టహాసం చేస్తోంది. ప్రజల్లో చీలికలు పెట్టి అసహనం పెంచుతోంది. ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ శక్తులు అన్ని రంగాలనూ కాషాయీకరించేందుకు ఉపక్రమిస్తున్నాయి. మన ప్రజాస్వామ్య మూలాలపై దాడులు చేస్తున్నాయి. ప్రజల మధ్య విభజన, విద్వేషపూరితాలను పెంచుతున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్నాయి. బహుళత్వం, సమానత్వం, లౌకిక, ప్రజాస్వామ్య, భావప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయి. సామాజిక న్యాయం, న్యాయాధారిత వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నాయి. చీకటి శక్తులు భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. చర్చ, భిన్నాభిప్రాయాలకు ఆస్కారం లేకుండా చేస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లల్లో మతతత్వం కూడా ఒకటని ప్రధాని యథాలాపంగానే వెల్లడించారు. నిజంగా మతతత్వాన్ని సమస్యగా పరిగణిస్తే మూడేళ్లలో సంఘ్ పరివార్ నిర్వహించిన దాడులపై ఏం చర్యలు చేపట్టారు? కేంద్రం మద్దతు లేకుంటే సంఘ్ ఇంతగా బరి తెగిస్తుందా? ప్రస్తుతం దేశం ప్రమాదంలో పడింది. రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. క్విట్ ఇండియా స్ఫూర్తితో మతతత్వంపైనా, ప్రజలపై భారాలు మోపే, అసమానతలు పంచే ఆర్థిక విధానాలపైనా ప్రజలు ఏక తాటిపైకి వచ్చి పోరాడాలి.

మహనీయుల మాట




ఓ మర్రిగింజ మహా వృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం సైతం మహా ఫలితాన్నిస్తుంది.

- స్టాన్ స్లావిస్కి

దేశభక్తి గీతాలకు గౌరవమేది?

ప్రజాగళం

విప్లవ సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అందులో దేశభక్తి గీతాల ప్రాధాన్యతే వేరు! విద్యార్థుల్లో, పౌరుల్లో సోదరభావం, లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద భావాలు పెంచటానికి దేశభక్తి గీతాలు ఎంతగానో తోడ్పడతాయి. సినీ నిర్మాతలు సైతం వీటి ప్రాముఖ్యతను గుర్తించి సినిమాల్లో జోడించేవారు. అందుకు తగ్గట్టుగానే అవి విశేషాదరణ పొందేవి. అయితే రానురానూ సినిమాలల్లో వాణిజ్య అంశాలు పెరగటంతో నైతిక విలువలు పెంపొందించే దేశభక్తి గీతాల ప్రాముఖ్యత తగ్గుతూ వస్తోంది. దైవభక్తి గీతాలకు వున్న ఆదరణ కూడా దేశభక్తి గీతాలకు లేదు. స్వాతంత్య్ర ఉద్యమంలో భారతీయులందరినీ ఒకే తాటిపైకి తెచ్చిన 'వందేమాతరం' గీతాన్ని స్వలాభం కోసం వివాదాస్పదం చేస్తున్న ఘనులూ వున్నారు. 'దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా' గేయాన్ని రచించిన గురజాడ అప్పారావుకు సైతం పాలకులు సరైన గుర్తింపు ఇవ్వటం లేదు. 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయాన్ని రచించిన గరిమెళ్ళ సత్యనారాయణ ఎవరో ఈ తరం



వారికి పెద్దగా తెలియదు. 1942లో 'దీనబంధు' చిత్రానికి శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లె పువ్వు దండ' పాటను రచించారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా దీనిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతంగా గుర్తించారు. అయితే ఆ తరువాత సుందరాచారి కృషిని ఏ పాలకులూ పెద్దగా పట్టించుకోలేదు. 2014లో జరపాల్సిన ఆయన శతజయంతి ఉత్సవాలను ఒక్క చోట కూడా అధికారికంగా నిర్వహించలేక పోవటం విచారకరం. తెలంగాణలో అందెశ్రీ గానం చేసిన 'జయజయహే తెలంగాణ' గీతం విశేష ప్రాచుర్యం పొందింది. 2014లో తెలంగాణ ఏర్పడిన తరువాత ఈ పాటకు పాఠ్య పుస్తకాల్లో కూడా స్థానం లభించింది. తెలంగాణ ఏర్పడి మూడు సంవత్సరాలు అయినప్పటికీ ఈ గీతాన్ని అధికారికంగా గుర్తిస్తూ ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును... రెండు తెలుగు రాష్ట్రాలు చొరవ చూపి పాఠ్యపుస్తకాలలో చేర్చినప్పటికీ ఇంకా గెజిట్‌లో ఈ విషయాన్ని పొందుపరచలేదు. 'ప్రతిజ్ఞ'ను పైడిమర్రి 1962 లో రచించగా 1965 నుండి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యార్థులచేత పాడిస్తున్నారు. పలు ఉద్యమాల ఫలితంగా పైడిమర్రికి కొంత ఆదరణ లభించినా తెలుగు రాష్ట్రాల మాదిరిగా దేశవ్యాప్తంగా మిగతా అన్ని రాష్ట్రాల పాఠ్యపుస్తకాల్లో ఆయన పేరు ముద్రించాల్సి ఉంది. విద్యార్థుల్లో దేశభక్తి, సోదరభావం, ఐక్యత వంటి లక్షణాలను పెంపొందించటానికి దేశభక్తి గీతాలు తోడ్పడతాయి. దైవభక్తి గీతాల పట్ల ప్రజల్లో భిన్నాభిప్రాయాలుంటాయి. ప్రజల వ్యక్తిగత విశ్వాసాలను బట్టి వాటి ప్రాముఖ్యత మారుతూ ఉంటుంది. భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో గొప్ప గొప్ప దేశభక్తి గీతాలు మాత్రమే ఏకత్వంలో భిన్నత్వానికి దారితీయకుండా దోహదపడతాయి. కాబట్టి పాలకులు ఆయా గీత రచయితలకు తగిన ప్రాముఖ్యత ఇచ్చి గౌరవించినప్పుడే వారు ఇచ్చిన సందేశాలకు సార్థకత.

మందడపు రాంప్రదీప్, తిరువూరు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మాయగాళ్లు విశృంఖలంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు డేటా చోరీ చేసి నగదు ట్రాన్స్‌ఫర్ చేయడం, ఎటియం పిన్ మార్పు, ఆన్‌లైన్ లాటరీలు, ఈ కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్, వెబ్‌సైట్ హాకింగ్ చేసి డేటా దొంగలించడం వంటి సైబర్ నేరాలకు రెండు తెలుగు రాష్ట్రాలు చిరునామాగా మారాయి. 2015లో కేవలం 260 సైబర్ నేరాలు నమోదు అయితే ఇప్పుడు ఆ సంఖ్య రెండు వేలకు దాటింది. సైబర్ చట్టాలు ఎన్ని వచ్చినా ఈ నేరాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. ఈ మోసాలను అరికట్టేందుకు నిపుణులను నియమించడం, పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

ఉప్పలపు శేషునాథ్, నైనవరం.

సమర్థ సమాచార కమిషనర్లు



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వేర్వేరు సమాచార కమిషన్లను, ప్రధాన సమాచార కమిషనర్లను ఆరు వారాల్లో నియమించాల్సిందిగా 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై స్పందించిన కోర్టు వివరాల్ని దాఖలు చేయాలని సెప్టెంబరు 21 వ తేదీకి తదుపరి వాయిదా వేసింది. గతంలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిపారని, నలుగురు సమాచార కమిషనర్లను సుప్రీంకోర్టు తొలగించిన విషయాన్ని మరువకూడదు. సమాచార శాఖ విధులు సక్రమంగా నిర్వర్తించాలంటే ప్రధాన సమాచార కమిషనర్లుగా, సమాచార కమిషనర్లుగా సమర్థులను నియమించాలి. సామాజిక సేవకులు, జర్నలిస్టులు, సమాచార హక్కు చట్ట కార్యకర్తలను, పారదర్శకంగా ఎంపిక చేయాల్సి వుంది.

టి సురేష్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా.

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే-మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్

editpageps@gmail.com

చిరునామా

ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

విగ్రహం మాట్లాడే భాష

చల్లపల్లి స్వరూప రాణి



విశ్లేషణ

తరతరాలుగా కుల వివక్షకు, శ్రమ దోపిడీకి, అమానవీయతకు గురైన దళిత సమాజం అంబేద్కర్ కృషి ఫలితంగా గుండెల నిండా ఆత్మగౌరవాన్ని పీల్చుకుంటూ ఆయన్ని తమ అస్తిత్వ ప్రతీకగా భావిస్తుంది. అందులో భాగంగానే అంబేద్కర్ విగ్రహాన్ని దళితులు తమ వాడలలో ప్రతిష్ఠించుకుని తమలో పెంపొందుతున్న ఆత్మస్థైర్యాన్ని చాటుకుంటున్నారు. అయితే అక్కడి పెత్తందారీ కులాల ఆధిపత్యానికి తరతరాలుగా ఇతరుల నుంచి లభించే ఆమోదం, దళితులపై నియంత్రణ కోల్పోతామనే భయం పట్టుకుని వారు దళితులపై దాడి చెయ్యడానికి ప్రేరేపిస్తుంది. అంబేద్కర్ విగ్రహం వచ్చాక కొత్త రకం దాడులు ప్రారంభమయ్యాయి. ఈ దాడులకు కూడా చాలా పెద్ద చరిత్ర వుంది. 1978 ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి వుత్సవాలలో భాగంగా ఆగ్రా లోని దళిత జాతవ కులస్తులు తమ వాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవాలనుకున్నారు. విగ్రహాన్ని తయారు చేయించిన ప్రదేశం నుంచి ఏనుగు మీద పెట్టుకుని తమ వాడకు తీసుకెళ్ళడం అక్కడి పెత్తందారీ కులాల వారికి కంటగింపుగా మారింది. విగ్రహాన్ని తమ నివాసాల మీదుగా తీసుకు రాకూడదని, ఒక్కసారి తీసుకెళ్ళనిస్తే ప్రతి సంవత్సరం అల్లర్లు జరిగే అవకాశం వుందని వూరేగింపు దారి మళ్ళించాలని అగ్ర కులస్తులు వాదించారు. వారు ఇంకా జరగని అల్లర్లను సాకుగా చూపించి అధికారులను ఒప్పించి తమ పుర వీధులగుండా అంబేద్కర్ విగ్రహం వెళ్ళకుండా అడ్డగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అలజడి జరిగింది. జాతవులు పోలీసుల జోక్యాన్ని కూడా ప్రతిఘటించారు. ఈ సంఘటనలో వందలాది మందిని పోలీసులు అరెస్ట్ చేస్తే, జరిగిన హింసలో పది మంది దళితులు చనిపోయారు. చివరకు మిలటరీ దళాలు రంగం లోకి దిగాక గానీ అల్లర్లు సద్దుమణగలేదు.

అంబేద్కర్ చూపుడు వేలు సమాజంలో వున్న అసమానతలను వేలెత్తి చూపుతూ ప్రజల మధ్య వుండవల్సిన సామాజిక ప్రజాస్వామ్యాన్ని, సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని గుర్తు చేస్తుంది. దళితులు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించు కోవడం వారి మనోభావాలు, వారి సామాజిక రాజకీయ ఆకాంక్షల వ్యక్తీకరణగా అంగీకరించడానికి సిద్ధంగా లేనివారు విగ్రహ ప్రతిష్ఠని ఒక సాంకేతిక సమస్యగా, ఘర్షణలకు దారి తీసే శాంతి భద్రతల అంశంగా కుదిస్తారు.



ఉత్తర ప్రదేశ్‌లో ఠాకూర్ కులస్తుడైన యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యాక, సుదీర్ఘ విరామం అనంతరం... ఠాకూర్లు తమ కులాధిక్యతను తిరిగి ప్రదర్శించుకోడానికి అక్కడి దళితులపై దాడులు మొదలు పెట్టారు. ఈ క్రమంలో షబ్బీర్ పూర్‌లో 2017, ఏప్రిల్ 14 న దళితులు చేపట్టిన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఠాకూర్ల అసహనానికి కారణమయ్యింది. పశ్చిమ ఉత్తర ప్రదేశ్ లోని సహరన్‌పూర్ నగరానికి దగ్గరలో వున్న షబ్బీర్ పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠను ఠాకూర్లు అడ్డుకుని దానికి స్థానిక అధికారుల నుండి పాలనా పరమైన అనుమతులు లేవనే కారణం చూపారు. దీంతో ఠాకూర్లకు, దళితులకు ఘర్షణ ప్రారంభమయ్యింది. తర్వాత ఠాకూర్లు మధ్య యుగాలలో రాజపుత్ర వీరుడిగా భావించే మహారాణా ప్రతాప్ సింగ్ జ్ఞాపకార్థం ఒక వూరేగింపును ప్రారంభిస్తే అంబేద్కర్ విగ్రహాన్ని అడ్డగించినప్పుడు.... భంగపడి అసంతృప్తికి గురైన దళితులు ఠాకూర్ల వూరేగింపుకు కూడా సాంకేతికంగా అభ్యంతరాలున్నాయని దానిని అడ్డుకున్నారు. తర్వాత గత మే నెలలో ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి షబ్బీర్ పూర్‌ను సందర్శించారు. ఆమె పర్యటన సందర్భంగా కూడా అక్కడి ఠాకూర్లకు-దళితులకు ఘర్షణ చెలరేగి అందులో ఒకరు మరణించగా అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆధిపత్య కులాలకు, దళితులకు చోటు చేసుకుంటున్న అనేక వరుస ఘర్షణలలో ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన గరగపర్రు సంఘటనను తాజా ఉదాహరణగా భావించవచ్చు. పశ్చిమ గోదావరి జిల్లాలోని గరగపర్రు గ్రామ దళితులైన మాలలు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం, దానికి అక్కడి ఆధిపత్య కులస్తులు అభ్యంతరాలు పెట్టి చివరకు విగ్రహాన్ని మాయం చెయ్యడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలై అది మాలలను వెలి వేసే దాకా వెళ్ళింది. గ్రామంలో అత్యధిక శాతం భూములు, ఫ్యాక్టరీలు ఆధిపత్య కులాల చేతిలో వున్నాయి. పైగా వారికి కౌలుకిచ్చిన భూములను కూడా దళితుల నుంచి వెనక్కి తీసుకోవడంతో గరగపర్రు దళితులు సామాజికంగానూ, ఆర్థికంగానూ ఎంతో దుర్భర స్థితిని అనుభవించారు. మూడు నెలల తర్వాత దళితుల వెలి అంశం వెలుగు లోకి వచ్చింది. గరగపర్రు మాల బాధితులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాలు తరలి వచ్చి అంబేద్కర్ విగ్రహాన్ని వున్న చోటు నుంచి తొలగించడానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో పోలీసులు ఘటనకి బాధ్యులైన వారిని అరెస్ట్ చెయ్యక తప్పలేదు. అయితే దళితులైన మాలలకు వ్యతిరేకంగా గ్రామంలోని పద్నాలుగు అగ్రకులాలు ఏకమై ఆ గ్రామంలో అన్ని కులాల వారు ఎంతో సఖ్యంగా వుంటారని మీడియాలో చెప్పించారు. పెత్తందారీ కులస్థులైన దోషులకు వంత పాడిన వారిలో.... వెనుకపడిన కులాల వారూ, దళిత ఉప కులస్థులైన మాదిగలు కూడా చేరడం ... పెత్తందారీ కులస్థుల మనువాద ఎత్తుగడగా భావించాలి. తర్వాత గరగపర్రులో 'ఆందోళన సద్దుమణిగి శాంతి నెలకొంటుంది' అనుకునే సమయంలో 'అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం'లో ప్రధాన సాక్షిగా వున్న యాకోబు అనే దళితుడు రోడ్డు ప్రమాదంలో అనుమానాస్పద స్థితిలో మరణించడంతో మళ్ళీ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

గతంలో గ్రామీణ కులసమాజంలో పెత్తందారీ కులాల వారు దళితుల పెళ్ళి వూరేగింపులనూ, పండుగ రోజు జరుపుకునే దేవుడి వూరేగింపులనూ అడ్డుకుని వారిపై భౌతిక దాడులకు పాల్పడిన అనేక సంఘటనలు వున్నాయి. ఎంత సేపటికీ దళితులు తమ కాళ్ళ కింద చెప్పులా పడి వుండాలని భావించే పెత్తందారీ కులాలు... వారు తెల్ల బట్టలు కట్టుకున్నా, చెప్పులు వేసుకున్నా వారిపై దాడికి దిగేటటు వంటి క్రూరత్వాన్ని ప్రదర్శించిన సందర్భాలు ఎన్నో వున్నాయి. గ్రామాలలో దళితులకు అతి తక్కువ మొత్తంలో భూములు ఇతర ఆదాయ వనరులు వుండడం చూస్తాం. ఆ చిన్న పాటి పొలాలకు కూడా దళితులు యజమానులు కావడం ఇష్టంలేని అక్కడి పెత్తందారీ కులాలవారు... దళితులు తమ భూమిని సాగు చేసుకోనివ్వకుండా రకరకాలుగా అడ్డుకుంటారు. వారి పొలాల్లోకి దారి ఇవ్వకుండా, నీరు పారనివ్వకుండా, కొన్ని సార్లు వారి పంట పొలాల్లోకి గేదెలను తోలి చేతికొచ్చిన పంటను నాశనం చేస్తూ వుంటారు. అంతంత మాత్రంగా వుండే దళితుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడకుండా అడుగడుగునా అడ్డం పడి వారు ఎప్పటికీ సాంఘిక, ఆర్థిక పరాధీనత లోనే వుండాలని పెత్తందారీ కులాల వుద్దేశం. అయితే దళితులపై వారు గతంలో చేసిన దాడులకూ, అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా చేస్తున్న దాడులకూ స్పష్టమైన తేడా వుంది.

అంబేద్కర్ చూపుడు వేలు సమాజంలో వున్న అసమానతలను వేలెత్తి చూపుతూ ప్రజల మధ్య వుండవల్సిన సామాజిక ప్రజాస్వామ్యాన్ని, సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని గుర్తు చేస్తుంది. దళితులు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించు కోవడం వారి మనోభావాలు, వారి సామాజిక రాజకీయ ఆకాంక్షల వ్యక్తీకరణగా అంగీకరించడానికి సిద్ధంగా లేనివారు విగ్రహ ప్రతిష్ఠని ఒక సాంకేతిక సమస్యగా, ఘర్షణలకు దారి తీసే శాంతి భద్రతల అంశంగా కుదిస్తారు. గ్రామాలలో అనాయాసంగా పుట్టుకతో తమకు సంక్రమించిన ఆధిపత్యాన్ని అనుభవించే పెత్తందారీ కులాల వారు గతంలో గ్రామంలో వివిధ కులస్తులంతా అన్నదమ్ముల్లా పొరపొచ్చాలు లేకుండా కలిసి వున్నట్టు, ఇప్పుడీ విగ్రహం కారణంగా గ్రామంలో అనవసరమైన గొడవలు వస్తున్నట్టు సన్నాయి నొక్కులు నొక్కుతారు. అంతే కాకుండా కొన్నిసార్లు తమ చెప్పు చేతల్లో వుండే దళిత చెంచాలతో కూడా అదే మాట చెప్పిస్తారు. ఈ విషయంలో మీడియా కూడా అదే రకమైన సన్నాయి నొక్కులు నొక్కడం గమనార్హం. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు మాయావతి రాష్ట్రవ్యాప్తంగా గౌతమ బుద్ధుడు, మహాత్మా పూలే, అంబేద్కర్, సాహూ మహరాజ్, పెరియార్ వంటి బ్రాహ్మణేతర సామాజిక విప్లవకారుల విగ్రహాలు నిర్మించి వారి స్మృతి చిహ్నాలను ఏర్పాటు చేసినప్పుడు ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు దుమ్మెత్తిపోసింది. ఆ సందర్భంగా మనువాద పార్టీలను మొదలుకొని అందరూ మాయావతి చేపట్టిన విగ్రహ నిర్మాణం ప్రజాధనాన్ని వృథా చెయ్యడంగా, అవినీతికర చర్యగా విమర్శించారు తప్ప అది అణగారిన ప్రజల ఆత్మగౌరవ ప్రకటనగా భావించలేదు.

ఇప్పుడు అంబేద్కర్ విగ్రహాలు దేశవ్యాప్తంగా గ్రామాల్లోని దళిత వాడల్లోనే కాకుండా పట్టణాలలోని నాలుగు రోడ్ల కూడళ్ళలో, విశ్వవిద్యాలయాలలో, పార్లమెంట్, ఐక్యరాజ్య సమితి కార్యాలయాల లోకి కూడా వచ్చాయి. బహుశా! దేశంలో ఇతర నాయకుల విగ్రహాలతో పోలిస్తే అంబేద్కర్ విగ్రహాల సంఖ్యే ఎక్కువ కావచ్చు. ప్రస్తుతం అంబేద్కర్ కేవలం దళిత ఐకాన్ కాదు. ఆయన ఇండియన్ ఐకాన్ గానూ, అసమానతలపై ఎక్కుపెట్టిన విల్లుగానూ, మండే అగ్నిగానూ మారాడు. మూకీ భాషలకు నోరిచ్చిన ధీరుడు. తాను జీవించివున్నప్పుడు అణగారిన వర్గాలకు మానవ హక్కులు సాధించడానికి వ్యవస్థ తోనూ, అధికార పీఠాలతోనూ నిరంతరం పోరాడిన అంబేద్కర్ ఇప్పుడు కేవలం విగ్రహ మాత్రుడు కాడు. ఆయన వూరూ వాడల కూడలిలో, కరుడు కట్టిన గ్రామీణ కులసమాజపు తలవాకిట్లో నిలబడి ... భారత సమాజంలోని వైరుధ్యాల గురించి స్వయంగా మాట్లాడుతున్నాడు.

(రచయిత ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ప్రొఫెసర్), 9440362433.

డిటెన్షన్‌తో విద్యాహక్కుకు విఘాతం

నాగటి నారాయణ



సమీక్ష

ప్రాథమిక విద్యలో నాన్ డిటెన్షన్ విధానాన్ని ఎత్తి వేయాలని కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విద్యా హక్కు చట్టాన్ని సవరించే బిల్లును పార్లమెంట్‌లో పెట్టబో తున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు ప్రకాశ్ జవదేకర్ ప్రకటించారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ఏ ద్వారా ఎనిమిదవ తరగతి వరకు విద్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన విషయం తెలిసిందే. '6-14 సంవత్సరాల వయస్సులో బాలలు అందరూ నిర్బంధంగా బడుల్లో ఉండాలి. సెక్షన్ 16 ప్రకారం 'బడిలో చేరిన విద్యార్థులను ఎనిమిదవ తరగతి పూర్తయ్యే వరకు మధ్యలో ఏ తగరతి లోనూ ఆపకూడదు. లేదా బహిష్కరించకూడదు'. ఈ నిబంధనను సవరించి ఐదవ తరగతికి మరియు ఎనిమిదవ తరగతికి పరీక్షలు నిర్వహించి అందులో ఫెయిల్ అయిన వారిని అదే తరగతిలో ఆపేయాలి (డిటెయిన్) అని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రథమ్ సంస్థ సర్వేలు, విద్యాశాఖల నివేదికల ప్రకారం ప్రతి తరగతి లోనూ నిర్దేశిత కనీస అభ్యసన సామర్థ్యాలను సగం మంది విద్యార్థులు మాత్రమే సాధించగలుగు తున్నారు. జాతీయ విద్యా ప్రణాళిక మరియు పరిపాలన విశ్వవిద్యాలయం (ఎన్‌యుఇపిఎ) ప్రచురించిన 2015-16 యు-డైస్ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం పాఠశాల విద్యార్థులు 26.06 కోట్ల మంది ఉన్నారు. వారిలో 5వ తరగతిలో 2.50 కోట్లు మరియు 8వ తరగతిలో 2.20 కోట్లు వెరసి 4.70 కోట్ల మంది ఉన్నట్లు నివేదికలో పేర్కొనబడింది. ఇప్పుడు కూడా దాదాపు అదే సంఖ్యలో ఉండవచ్చు. వారిలో 98 శాతం మంది 'నో డిటెన్షన్' పాలసీతో ప్రమోట్ అవుతుంటారు. డిటెన్షన్ పాలసీ వస్తే దాదాపు సగం మంది ఫెయిలవుతారు. వీరిలో అత్యధికులు ప్రభుత్వ రంగ పాఠశాలల్లోని దళిత, గిరిజన, బహుజనుల విద్యార్థులే. బడిలో దక్కే అరకొర చదువే దిక్కయిన వారికి పాసయ్యే అవకాశం బహు తక్కువ.

పాఠశాల విద్యలో పాస్, ఫెయిల్ పరీక్షా విధానం సరైంది కాదని, అది బట్టీ చదువులకే పరిమితం చేసి విద్యార్థుల సృజనాత్మక శక్తిని చిదిమేస్తుందని చాలా కాలం చర్చ జరిగింది. ఏడాది చివరిలో ఒకేసారి జ్ఞాపకశక్తిని పరీక్షించడం కంటే విద్యార్థి సమగ్ర మూర్తిమత్వానికి తోడ్పడే నిరంతర మదింపు విధానం కావాలని అందరూ ఆశించారు. పరీక్షల సంస్కరణలో భాగంగానే నిరంతర సమగ్ర మూల్యాం కనం (సిసిఈ) విధానం వచ్చింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ను పాస్ ఫెయిల్‌గా కాకుండా గ్రేడ్‌లుగా ప్రకటి స్తారు. డి, సి, గ్రేడ్‌ల విద్యార్థుల అభ్యసనకు అదనపు అవకాశా లను కల్పించి బి, ఎ గ్రేడులకు ఎదగటానికి సహాయం చేయాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8 తరగతులకు నిరాటంకంగా విద్యను కొనసాగించేందుకు సిసిఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించబడింది. ఈ విధానం సరిగా అమలు చేయక పోవడమే అసలు



సమస్య. దానిని పట్టించు కోకుండా నో డిటెన్షన్ విధానం వలనే అభ్యసనా ప్రమాణాలు పడిపోతున్నా యని, అందుకే డిటెన్షన్ విధానం తేవాల్సి వస్తోందని ప్రభుత్వం చెబుతోంది. డిటెన్షన్ విధానంతో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు పెరుగుతాయని ఏ విద్యా కమిషన్ నివేదికలోనూ చెప్పలేదు. పరీక్షల వలన విద్యార్థులు ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురవుతారని, ఫెయిలైన వారు న్యూనతాభావంతో, అవమానాలతో కుంగి పోయి ఆత్మహత్యల పాలవుతారనే విషయం తెలియని దేమీ కాదు.

బడి పిల్లలు నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించలేక పోవడానికి ప్రధానంగా ఐదు కారణాలు ఉన్నాయి. విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న వసతులు, ప్రమాణాలతో పాఠశాలలు లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేక పోవడం, విద్యా సంవత్సరంలో 220 పని దినాలతో వేయి గంటల ఇన్‌స్ట్రక్షన్ అమలు జరగకపోవడం, ఇంట్లో తల్లిదండ్రులు బిడ్డల చదువు గురించి తెలుసుకుంటూ అవసరమైన మద్దతు అందించే పరిస్థితి పేద కుటుంబాల్లో లేకపోవడం. ఈ కారణాలకు బాధ్యుడు కాని విద్యార్థిని డిటెన్షన్‌తో శిక్షించడం న్యాయం కాదు. కారణాలుగా పేర్కొన్న లోపాలు అన్నింటికీ సర్కార్ బడులు నిలయాలు. అందువలన వాటిలో చదువుకునే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే డిటెన్షన్ ప్రయోగానికి బలవుతారు.

కేంద్రం లోని బిజెపి పరిపాలనలో ప్రభుత్వ విద్యను నియంత్రించి, ప్రయివేటు విద్యను ఎగదోయడం ఎక్కువైంది. అందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని తీసుకొస్తోంది. ఏ చట్టాన్నీ లెక్కచేయని ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు డిటెన్షన్ కోసం తెచ్చే సవరణ చట్టాన్నీ అమలు చేయవు. విద్యార్థులు ఫెయిలైతే విద్యా వ్యాపారానికి నష్టం. అందువల్ల ప్రయివేటు స్కూళ్ల విద్యార్థులను ఫెయిల్ కానివ్వవు. 'సర్కార్ బడుల్లో ఫెయిలవుతారు, ప్రయివేటు స్కూల్స్‌లో అయితేనే పాసవుతారు' అనే పబ్లిసిటీతో ప్రయివేటు విద్యా వ్యాపారం మరింత పెరిగిపోతుంది. ప్రభుత్వ పాఠశాలలు పతనమవు తుంటాయి. వెరసి పాఠశాల విద్యను ప్రయివేటు రంగానికి కట్టబెట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది.

అందరికీ కనీసం పాఠశాల విద్యను నిర్బంధంగా అందించాలనే రాజ్యాంగ ఆదేశాల అమలుకు నాన్ డిటెన్షన్ విధానాన్నే కొనసాగించాలి. పాస్, ఫెయిల్‌తో నిమిత్తం లేకుండా ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించగలిగే ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలి. ప్రతి పాఠశాలకూ తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉండాలి. దీర్ఘకాలిక సెలవుల్లో ఉండే ఉపాధ్యాయుల బాధ్యతల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ఉపాధ్యా యులకు శిక్షణ, సమావేశాలను పని దినాల్లో నిర్వహించ కూడదు. బడి పని దినాలు, టైమ్ టేబుల్, సిలబస్ కవరేజీ, మూల్యాంకన కర్తవ్యాలను సకాలంలో సమర్థవంతంగా అమలు చేయించే పర్యవేక్షణ, మోనిటరింగ్ వ్యవస్థను పటిష్టంగా పనిచేయించాలి. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, లెర్నింగ్ మెటీరియల్ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు అందరికీ ఉచితంగా అందించాలి. అభ్యసనలో వెనకబడే, మందకొడిగా ఉండే విద్యార్థులకు అదనపు బోధన ఏర్పాట్లు చేయాలి. నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని సరళతరం చేసి సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సాధనాలను సమకూర్చి ఉపాధ్యాయులను సంసిద్ధం చేయాలి. ఈ చర్యలతో విద్యార్థులను ఎనిమిదవ తరగతి వరకు ఏ తగరతిలోనూ డిటెయిన్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

డిటెన్షన్ విధానాన్ని తేవటానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు చెబుతున్న కారణాలు సమంజసంగా లేవు. అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ప్రథమ్, న్యూపా నివేదికల్లోనే కారణాలు, పరిష్కార మార్గాలు కూడా సూచించబడినవి. వాటి అమలుకు ప్రయత్నం చేయకపోగా గత మూడు సంవత్సరాల నుంచి కేంద్ర బడ్జెట్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసే సర్వశిక్షా అభియాన్‌కి 15 శాతం నిధులు తగ్గించడం జరిగింది. కేంద్రం నిర్బంధం చేసిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) వలన చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయ నియామకాలు స్థంభించిపోయాయి. కంటిన్యువస్ కాంప్రిహెన్సివ్ ఎవల్యూషన్ (సిసిఈ) విధానాన్ని చాలామంది ఉపాధ్యాయులే అర్థం చేసుకోలేదని నివేదికల్లో తేలింది. వారు అర్థం చేసుకునే ఏర్పాట్లను చేయకపోవడం వల్లనే ఆచరణలో అసంతృప్తి పాలయింది. 25 రాష్ట్రాలు కోరినందున డిటెన్షన్ విధానాన్ని తేవాల్సి వస్తోందని చెప్పడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాష్ట్రాలు ఎత్తి చూపే సమస్యలను పరిష్కరించాలే తప్ప చట్టాన్నే సవరించడం సరైంది కాదు. 'చట్టాన్ని సవరిస్తాం, దానిని అమలు చేయాలా లేదా అనేది రాష్ట్రాల ఇష్టం' అని జవదేకర్ చెప్పడం మరీ విడ్డూరం. అయితే అసలు విద్యా హక్కు చట్టమే అమల్లో లేదని కాగ్ నివేదిక కడిగేసింది. ఆ విషయాన్ని పరిశీలించ కుండా సవరణ చేయడం ఎందుకు? విద్యాహక్కును దెబ్బతీసే విధానాన్ని తెచ్చి పెట్టే డిటెన్షన్ బిల్లు సమర్థనీయం కాదు. దానిని ఉపసంహరింపజేసేందుకు విద్యారంగ శ్రేయోభిలాషులు తమ శక్తి మేరకు కృషి చేయాలి. పార్లమెంట్ సభ్యులు బిల్లును వ్యతిరేకించాలి. బడి ఈడు పిల్లలకు నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యకు భరోసా కల్పించాలి.

రచయిత విద్యావేత్త

నదీతీరాన్ని పెనవేసుకున్న బతుకుల బంధాలు ఈ కుటుంబాలు. అస్థిత్వం గొంతెత్తినప్పుడల్లా రాజ్యపు లాఠీల దెబ్బలకో, ఖాకీల ఇనుపపాదాల భయానికో ఆ అరుపులు సన్నగిల్లుతాయి. నేతలు పలికిన వాగ్దానాల ఆశలు ఒడ్డునపడ్డ చేపపిల్లల్లా గిలాగిలా కొట్టుకుంటాయి. ఏదో ఒకరోజు... వరద ముంచెత్తుతుందనీ తెలుసు... అభివృద్ధి చెరియలు తమ గుడిసెలపై విరుచుకుపడతాయనీ తెలుసు... కానీ నీటి ఆసరా తప్ప ఇంకోలా బతకడం మాత్రం తెలియదు. నదిలో అడుగుపెట్టాక వలలో నాలుగు చేపలు పడితేనే ఆ పూటకు అన్నం ముద్దలయ్యేది. లేదంటే ఇంకో పస్తులున్న రోజును లెక్కేసుకోవాల్సిందే. తరాలుగా నమ్ముకున్న వృత్తి ఆకలి సాక్షిగా ఓడిపోతోంది. బతుకు వలలో చిక్కుకున్న ఆ మత్స్యకారుల 'జీవన'చిత్రాన్ని చూసొద్దాం పదండి.



నీటి బతుకులు.. నీడ భయం

వీళ్లంతా కృష్ణానది ఒడ్డున ఉండే మత్స్యకారులు. వీరి బతుకులకు స్థిరమైన నివాసమంటూ ఏదీ లేదు. నదీతీరాన ఉన్న ఖాళీ భూముల పెత్తందార్లను బతిమాలుకుని పాకల్లాంటి ఇళ్లు నిర్మించుకుని బతుకుతున్నారు. పాకలు పీకేస్తున్న ప్రతిసారీ ఒకచోటు నుండి మరోచోటుకి తీరం వెంబడి నివాసం మార్చుకుంటూనే ఉన్నారు. అలా ఎన్నో ఏళ్లుగా కృష్ణానది ఒడ్డున నివాసముంటున్న వీళ్లకు తాత్కాలిక చిరునామాతో పాటు అన్ని గుర్తింపుకార్డులూ ఈ ప్రాంతానికి చెందినవే. అంతేకాదు రాజధాని పరిధిలోని కూలీలకు ప్రభుత్వం ద్వారా అందే నెలసరి నిరుద్యోగ పింఛనూ అందుతోంది. అయితే వీరి నివాసానికి ముప్పు తగ్గలేదు సరికదా.. రాజధాని పేరుతో భూముల స్వాధీనంతో ఇకపై నివాసమూ కరువయ్యే పరిస్థితీ ఏర్పడింది. "మీ నివాసానికి భరోసాగా మేమున్నాం" అని చెప్పే ప్రభుత్వం ఎక్కడో నదికి దూరంగా వీరిని పంపించేస్తే మత్స్యసంపదపై ఆధారపడిన వారి బతుకులకు ఆధారం ఏముంటుంది? వరదొచ్చినా పడవలతోపాటు నది ఒడ్డునే ఉండటానికి సిద్ధపడే వీళ్లకు అపార్టుమెంట్లు ఇస్తామంటున్నారు.. నేలపై పడవలు నడుస్తాయా? రోడ్లపై చేపలు పడతాయా? అనేది వీరి ప్రశ్న.



తరతరాల కష్టాలు

తరాలుగా ఇక్కడే ఉంటున్న మత్స్యకారులు కొందరు. వీరిని కృష్ణానది పాతరేవు నుండి ఖాళీ చేయించారు. అప్పుడు వివిధ ప్రాంతాల మత్స్యకారులంతా కలిసి 108 రోజులు ధర్నా కూడా చేశారు. అలాంటి పరిస్థితుల్లోనే మరో దిక్కులో 99 సెంట్ల స్థలాన్ని వీరికి కేటాయించి, దాన్లోనే వీరి కార్యకలాపాలు నిర్వహించుకోమని చెప్పారు. కానీ వానొచ్చిందంటే అక్కడ వాతావరణమే మారిపోతుంది. కాలేస్తే కూరుకుపోవడమో, సర్రున జారడమో ఖాయం. వాహనాలు తిరగాలంటే బురదలో రేసింగ్ చేసినట్లే. ఇక మహిళల పరిస్థితి చెప్పుకుంటే సిగ్గుచేటు. మలమూత్రాదులకు కనీస సౌకర్యాలూ లేవు. దీని సంగతి ఇలా ఉంటే.. పునరావాసం పొందిన కొన్ని కుటుంబాలు ప్రస్తుతం అనేక ఇబ్బందులు పడుతున్నాయి. పుష్కరాలకు మెట్లు కట్టడానికి వీరి గుడిసెల్ని ఖాళీ చేయించి, వీరిని నిరాశ్రయుల్ని చేశారు. పునరావాసం ఏర్పాటు చేస్తామని చెప్పి, కుటుంబానికి 30 గజాలు కేటాయించారు. ఆ ఇరుకు స్థలంలోనే లెట్రిన్, బాత్‌రూమ్‌లూ ఉండటంతో నానా అగచాట్లూ పడుతున్నారు. అక్కడే పందులూ వీరితో సహజీవనం చేస్తుంటాయి. కుటుంబమంతా ఒకే వృత్తి చేసుకు బతికే వీరి ఇంట్లో కనీసం పదిమంది వరకూ ఉంటారు. స్త్రీలు స్నానం చేస్తుంటే పురుషులు బయట కూర్చోవాల్సిన దయనీయ స్థితి.





గోదావరి నీళ్లు

గోదావరి నీళ్లు కృష్ణలో కలిసి పారుతుంటే పొలం పండించుకునే రైతులకు భరోసా వచ్చినమాటే నిజమే. కానీ కృష్ణానదిపై ఆధారపడిన మత్స్యకారులు పరిస్థితి గోదారే అయ్యింది. వీళ్లిప్పుడు సమస్యలలో ఈదుతున్నారు. "ఏరు తన నిజస్వరూపం కోల్పోయింది. సాగర్ నుంచి వచ్చే కృష్ణనీరుతో చేపలూ వచ్చేవి. కొన్ని కిందకు పోయినా పై నుండి వచ్చే మత్స్యసంపదకు లోటుండేది కాదు. గోదావరి కలిసిన తర్వాత ఆ వచ్చిన రెండు రోజులకు మించి బేరం ఉండట్లేదని" అంటున్నారు. "గోదావరి వచ్చిన మూడు నెలలపాటు మురికినీరే మిగులు తప్ప.. చేపల వేట చేసింది తక్కువే. మళ్లీ నీరంతా దాని అసలురంగు పులుముకునే వరకూ మత్స్యకారుల వలకు చేపలు చిక్కడం లేదు. పైపుల ద్వారా ఎత్తిపోస్తున్నా గోదావరి నీళ్లల్లో చేపల జాడ కరువయ్యింది!" అని వాపోతున్నారు.

వలసల వ్యథ

నాటి వైఎస్ఆర్ హయాంలో కొల్లేరు సరస్సున బతుకుతున్న చాలామంది పల్లెకారులు నిర్వాసితులుగా మారారు. వారంతా కృష్ణ ఒడ్డుకు బతుకుతెరువుకు వలసొచ్చి.. ఒడ్డున గుడిసెలు వేసుకుని కాలం వెళ్లదీస్తుంటే.. నేటి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నిర్మాణానికి అడ్డొచ్చాయంటూ కొన్ని కుటుంబాల్ని అక్కడ నుంచి పంపేశారు. పాలకులకు ఎదురు తిరగలేని వీరు మూటాముల్లె సర్దుకుని, కొద్ది దూరంలో రోడ్డు వెంబడి పాకలేసుకున్నారు. క్యాంపు కార్యాలయం నిర్మాణానికి అడ్డొచ్చిన పాకలు పీకేసినా, వేరేచోట ఇళ్లిస్తామని వాగ్దానం చేసిన పెద్దలు మాత్రం నోరు మెదపడంలేదు. ఏంటని ప్రశ్నిస్తే.. చివరికి వచ్చిన సమాధానం.. "మీరు ఎక్కడి నుంచో వచ్చారు? ఉన్నంతకాలం ఉండి వెళ్లిపోవడమేగానీ.. మీకు ఇళ్లు ఇవ్వడం కుదరదు" అని చెప్పేశారు. అదేంటని గొడవ చేయబోతే.. వీళ్ల పూర్వమున్న ఊరు నుండి ఆధారాలు తీసుకురమ్మంటున్నారు. బతుకుతెరువే కరువైన వీళ్లకి స్థిరనివాసం అక్కడా లేదు.. ఇక్కడ ఉంటుందో లేదో తెలియదు. మరి తమ భవిష్యత్తు ఏమిటనేది వారి ప్రశ్న.

రాజధాని అభివృద్ధిలో భాగంగా ఇక్కడ బోట్ షికార్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇక బోటులు తిరిగితే చేపలు పట్టుకునే అవకాశం ఉండదు. మత్స్యకారులు సాయంత్రం మూడు గంటలకు వలలేస్తారు. అదే సమయానికి టూరిస్టుల కోలాహలం మొదలవుతుంది. అది రాత్రికి ముగుస్తుంది. ఆ శబ్దానికీ, కాలుష్యానికీ చేపలు ఆ దరిదాపులకు కూడా వచ్చే అవకాశం ఉండదు. అప్పుడు మత్స్యకారుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వం ప్రకటించిన ప్రజా రాజధానిలో పల్లెకారులకు స్థానం ఎక్కడో...!?

- ప్రవీణ్ వెలువోలు

ఆడోళ్లకు మరీ ఇబ్బంది



ఇక్కడ మాకు రేవైతే ఇచ్చారు కానీ.. ఆడోళ్లకి సదుపాయం లేదు. మగోళ్లు బయటకి ఎల్లినట్టు ఆడోళ్లు ఎల్లలేం గదా..?! లెట్రిన్‌కీ, బాత్‌రూమ్‌కి వెళ్లాలంటే ఇబ్బంది. కడుపులోనొప్పితో వాళ్ల అవస్థ అవస్థగా ఉంది. గవర్నమెంటు దొడ్లు, ఇంకో షెడ్డు కడతామన్నారు. అయి కట్టి, ఇక్కడ కంకర చిప్స్, ఇసుక వేస్తే.. మాకూ.. బేరానికి వచ్చేవాళ్లకీ సౌకర్యంగా ఉంటుంది.

- పి. వెంకటేశ్వరమ్మ

అక్కడ చాలా కష్టం



సీతానగరంలో ఉన్న పల్లెకారులకు పునరావాసం కోసం ఉండవల్లి సెంటర్ పక్కన 30 గజాల స్థలం ఇచ్చారు. అక్కడే మారుపాకలు కట్టుకుని బతుకుతున్నాం. దాంట్లోనే దొడ్లకీ, స్నానాలకీ, ఉండటానికీ అన్నీ అక్కడే. ఇరుకుగా ఉన్న ఆ స్థలంలో ఉండటానికి మాకు చాలా ఇబ్బందిగా ఉంది. పందులొచ్చి ఆగం ఆగం చేస్తున్నాయి.

- సైకం వెంకటేశ్వరరావు

నీటిపై పనే కావాలి



టూరిజం అభివృద్ధికి మేము అడ్డం కాదు. మాకు నీటిలో చేసే ఏదో ఒక పని కల్పించమని అడుగుతున్నాం. చదువుకున్నోళ్లు కావాలంటున్నారు. నీటిమీద ఎలా బతకాలో మాకు తెలియదా? బోట్లు తిప్పమంటే తిప్పుతాం. అందులో డ్రైవర్ పోస్టులే అవసరంలేదు. ట్రైనింగ్ ఇచ్చి, లైసెన్స్‌లిస్తే అదీ చేయగలం. నీటికి సంబంధించిన ఏ పనైనా చేస్తాం.

- విజయ్‌కుమార్.

జీఎస్‌టీతో పెరిగిన భారం



పది రూపాయలొచ్చినా.. వంద రూపాయలొచ్చినా ఇదే మా పని. మాకు వేరే పని రాదు. ఒకప్పుడు వల రెండొందల యాభై ఉండేది. ఇయ్యాల కేజీ వల తయారుచేయడానికి రెండువేలు ఖర్చవుతోంది. దానికి తోడు జిఎస్‌టి వచ్చిన తర్వాత కేజీకి 80 రూపాయల ట్యాక్స్ కట్టాలి. ఒకప్పుడు పడవకి ముప్పై కేజీల వల ఏసేవాళ్ళు. ఇప్పుడు పది కేజీలే. ఇప్పుడు ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ.

- కోరిమల్లి రాజు

న్యాయ సూత్రం

హామీగా ఉన్నందుకు
డబ్బులు నేను కట్టాలా?

నా సహోద్యోగి సొసైటీ లోను తీసుకుంటూ నా చేత బలవంతంగా గ్యారంటీ సంతకం చేయించాడు. కొన్నాళ్లు వాయిదా చెల్లింపులు చేసి సడన్‌గా ఆపేశాడు. సొసైటీ వాళ్లు నాకు బాకీ తీర్చమని నోటీసులు ఇచ్చారు. నేను రూపాయి అప్పు తీసుకోలేదు. నేనెందుకు చెల్లించాలి? ఇదేమి న్యాయం? నేనేం చెయ్యాలి?

- రమేష్, కొత్తగూడెం


రుణాలు ఇచ్చేటప్పుడు ఆర్థిక సంస్థలు (బ్యాంకులు, సొసైటీలు, ఫైనాన్స్ కంపెనీలు) హామీదార్లు ఇద్దరు ఉండేలా షరతులు పెడతారు. లేకపోతే రుణం ఇవ్వరు.

'హామీ' అంటే అర్థం రుణగ్రహీత డబ్బులు కట్టకపోతే, హామీదారు కట్టడానికి సిద్ధమని తెలియజేయటం.

ఈ విషయాన్ని మభ్యపెట్టి, మొహమాటంతో పరిచయస్థులు, మిత్రుల చేత సంతకాలు పెట్టించుకుంటారు. రుణవాయిదాలు సరిగా కట్టకపోతే, హామీదార్లు బాధ్యత వహించి, బాకీ తీర్చాలి.

కాబట్టి, మీమీద చట్టరీత్యా బాధ్యత ఉంది. అయితే, రుణగ్రహీతకి ఆర్థిక స్తోమత ఉండి, కావాలని బాకీ తీర్చని పక్షంలో మీరు అతని మీద గట్టి వత్తిడి తీసుకొచ్చి బాకీ కట్టేలా చూడండి. మీ సమస్య తీరుతుంది.

ఇంకెప్పుడూ హామీ సంతకాలు చెయ్యకండి. మీరేకాదు. మీ మిత్రులకూ ఈ జాగ్రత్తలు చెప్పండి.



మా అమ్మాయికి ఏడాదిక్రితం పెళ్లైంది. కానీ, అల్లుడు సంసారానికి పనికిరాడని మా అమ్మాయి ఆలస్యంగా గ్రహించింది. మేము బాధపడతామని చాలాకాలం చెప్పలేదు. తనలో లోపం ఉంచుకుని ఎదురు మా అమ్మాయి మీదనే నిందలు వేస్తున్నాడు. కొట్టడం, తిట్టడం చేస్తున్నాడు. అతని తల్లిదండ్రులతో మాట్లాడితే తప్పంతా మా అమ్మాయిదే అన్నట్లు నిందిస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా కాస్త గట్టిగా మాట్లాడాము. రాజీకి వచ్చి మూడు లక్షలు నష్టపరిహారం ఇస్తామన్నారు. కానీ ఐదు నెలలు అవుతున్నా కదలిక లేదు. పరస్పర అంగీకారంతో విడాకులకు అంగీకరించీ ఇప్పుడు మిన్నకున్నారు. మేము ఏంచెయ్యాలో దయచేసి చెప్పండి.

- జయలక్ష్మీ, విజయవాడ.

పెళ్లిచూపుల సమయంలోనే ఇలాంటి లోపాలు గుర్తించగల పరీక్షలు జరిపించే సంప్రదాయం మనకు లేదు. అలా ఉంటే ఇలాంటి సమస్యలు రావు. మీ అమ్మాయి భర్తలోని లోపాల్ని ఆలస్యం లేకుండా మీకు తెలిపి ఉంటే, వెంటనే 'నపుంసకత్వ' కారణం మీద విడాకులు సులభంగా లభించేవి. వాస్తవాన్ని దాచిన కారణంగా వియ్యంకుల నుండీ మీకు నష్టపరిహారం కోరే హక్కు ఉంటుంది. మీరిచ్చిన వరకట్నాలు, కానుకలు (భూమి వగైరాలు) తిరిగి పొందవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో మీరు కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో లాయరు ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ఫ్యామిలీ కోర్టులో పిటిషను మీ అమ్మాయి దాఖలు చేయాలి. అందుకు సలహా, సూచనలు లాయరు ఇస్తారు. కేసు ముందుకు వెళ్తున్న దశలో లాయరు సహాయం పొందవచ్చు. ఏదైనా ఆలస్యం చేయవద్దు.

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్
katururavindratrivikram@gmailcom



కళ్లజోడు మచ్చలకు చెక్



ఈ రోజుల్లో చిన్నపిల్లల దగ్గర నుంచీ పెద్దవారి వరకూ కళ్లజోడు రావడం చాలా మామూలు విషయం అయిపోయింది. అంతేనా కళ్లజోడు వచ్చిందంటే దానితో పాటు ముక్కు మీద మచ్చలు కూడా వచ్చినట్టే. వీటిని పోగొట్టుకోవాలనీ, ఇవి లేకుండా తమ ముఖాన్ని చూసుకోవాలనీ అందరికీ ఉంటుంది. కానీ అవి ఎలా తొలగిపోతాయన్న దానిపై సరైన అవగాహన ఉండదు. అలాంటి వాళ్లకు ఈ సలహా బాగా ఉపయోగపడుతుంది. ఒకసారి ప్రయత్నించి చూడండి.

ఈ సమస్యను పరిష్కరించడంలో తేనె కొంతవరకూ ఉపయోగపడుతుంది. మచ్చలపై తేనెను రాసి, పావుగంట తర్వాత శుభ్రం చేయాలి. ఇలా మూడు వారాలు చేస్తే మీరే మంచి మార్పుని గమనిస్తారు.

నిమ్మరసం కళ్లజోడు మచ్చలను తగ్గించడంలో బాగా పనిచేస్తుంది. బ్లీచింగ్ లక్షణాలనూ కలిగి ఉండటంతో త్వరగా మార్పులని గమనించొచ్చు. మచ్చలపై నిమ్మరసాన్ని రాసి 20 నిమిషాల తర్వాత శుభ్రం చేయండి. ఇలా 20 రోజుల పాటు చేస్తే మీ కళ్లజోడు మచ్చల తీవ్రత తగ్గుతుంది. బంగాళదుంపలోనూ బ్లీచింగ్ లక్షణాలుంటాయి. దుంపను బాగా పేస్ట్ చేసి మచ్చలపై రాయండి. పదినిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయండి. ఇది మచ్చలను తగ్గించడంలో మంచి పాత్రను పోషిస్తుంది.

షూను ఇలా కాపాడుకోండి

వర్షాకాలం వచ్చిందంటే ఎవరికైనా సరే సంతోషంగానే ఉంటుంది. చిటపటచినుకులను అస్వాదిస్తూ, వేడిడేడిగా పొగలు కక్కే కాఫీని ఇష్టపడని వారు ఎవరుంటారు. ఇలా ఒకటేంటి వానాకాలంతో చాలా ఆనందాలూ, అనుబంధాలూ ప్రతిఒక్కరికీ ఉండే ఉంటాయి. అయితే వీటితో పాటు కొన్ని చిన్న చిన్న ఇబ్బందులూ ఉంటాయి. వాటిలో ఒకటి లెదర్ వస్తువులను కాపాడుకోవడం. కచ్చితంగా వర్షాకాలంలో షూస్, హ్యాండ్‌బ్యాగ్స్ వంటి వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఈ



సీజన్‌లో తేమ వల్ల తోలు వస్తువులపై ఫంగస్ ఎక్కువగా చేరుతుంది. ఇది షూలపై చేరితే వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అంతే కాకుండా వర్షంలో తడిస్తే ఎంతో రేటు పెట్టి ఇష్టంతో కొన్న వస్తువులూ పాడైపోతాయి. వీలైనంత వరకూ వీటిని వాన నీటికి తడవకుండా చూడాలి. తడిస్తే ఇంటికి రాగానే షూస్ లోపల న్యూస్ పేపర్‌ను చుట్టి ఉంచండి. అవి తేమను పీల్చడంలో ఉపయోగపడతాయి. ఏ మాత్రం తేమ అనిపించినా ఆ సాక్సులను వాడకండి. ఒక వేళ వర్షంలో తడిచి వస్తే షూను ఏటవాలుగా గోడకు ఆనించి ఉంచండి. పూర్తిగా తేమ, తడి పోయే వరకూ వాటిని ఉపయోగించకండి.

జీవన సౌరభం

మన ప్రవర్తన, చేతలే గొప్పవారిగా మారుస్తాయి.

మీ కోసం

అరకప్పు కలబంద గుజ్జులో రెండు టేబుల్ స్పూన్ల మందార పువ్వుల పేస్టును కలిపి తలకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేస్తే జుట్టు నిగనిగలాడుతుంది.



సెన్సెక్స్ ▼ 267	నిఫ్టీ ▼ 88	రూపాయి ▼ 24 పైసలు
31,531	9,820	ఒక అమెరికా డాలరుకు రూ. 64.08



యుఃః! యన్ బ్యాంకుకు
మొండి బాకీల దెబ్బ

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్ :

ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యుబిఐ) 2017 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో మొండి బాకీల దెబ్బతో బ్యాంకు లాభాలు 30 శాతం పడిపోయి రూ.117 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.166 కోట్ల లాభాలు సాధించింది. క్యూ1లో యుబిఐ లాభాలు రూ.195 కోట్లుగా చోటు చేసుకోవచ్చని థామ్సన్ రాయిటర్స్ తొలుత అంచనా వేసింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 12.63 శాతానికి ఎగిశాయి. గతేడాది ఇదే త్రైమాసికం నాటికి జిఎన్‌పిఎ 11.7 శాతంగా చోటు చేసుకుంది. గురువారం బిఎస్ఇలో యుబిఐ షేర్ 5.15 శాతం తగ్గి రూ.134.45 వద్ద ముగిసింది.

అంచనాలు చేరిన గెయిల్ ఇండియా

ప్రభుత్వ రంగంలోని గ్యాస్ ఉత్పత్తి కంపెనీ గెయిల్ ఇండియా 2017-18 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.1,026 కోట్ల (10.26 బిలియన్ డాలర్ల)లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,335 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గత క్యూ1 లాభాల్లో 23 శాతం క్షీణత చోటు చేసుకుంది. అయినప్పటికీ మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఫలితాలు ప్రకటించింది. క్రితం క్యూ1లో 10.18 బిలియన్ డాలర్ల లాభాలు నమోదు చేయొచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. ఇదే సమయంలో కంపెనీ సహజ వాయువు సరఫరా వ్యాపారం 10 శాతం పెరిగి రూ.1,134 కోట్లకు చేరింది.

భెల్ బోనస్ షేర్

ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల తయారీ కంపెనీ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) 2017-18 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 3.92 శాతం వృద్ధితో రూ.80.82 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.77.77 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,070.21 కోట్ల నుంచి రూ.6,194.21 కోట్లకు చేరింది. గత జూన్ 30 నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.1,01,380 కోట్లుగా ఉంది. 2016-17 సానుకూల అంశాలను కొనసాగిస్తామని భెల్ పేర్కొంది. గురువారం జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో రూ.2 ముఖ విలువ కలిగిన రెండు ఈక్విటీ షేర్లపై ఒక్క బోనస్ షేర్ అందించడానికి వారు ఆమోదం తెలిపారు. వ్యయాలు తగ్గించుకోవడంతో పాటు ఎత్తుగడల ప్రోత్సాహంతో వృద్ధి రేటు సానుకూలతను కొనసాగిస్తామని భెల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ సోబ్తి విశ్వాసం వ్యక్తం చేశారు. భెల్ ధర్మలేతర విద్యుత్ రంగంపై దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. గురువారం బిఎస్ఇలో భెల్ షేర్ 5.03 శాతం తగ్గి రూ.126.45 వద్ద ముగిసింది.

స్పైస్‌జెట్ లాభాలు 18% వృద్ధి

చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 18 శాతం వృద్ధితో రూ.175 కోట్ల లాభాలు ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.149 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. ప్రయాణికుల్లో 9 శాతం పెరుగుదల, రవాణ సామర్థ్యంలో 94.07 శాతం వినియోగించుకోవడంతో మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. వచ్చే మూడు, నాలుగు త్రైమాసికాల్లో స్పైస్‌జెట్ ఆరు బోయింగ్ 737 విమానాలు కొనుగులు చేయడం ద్వారా సేవలు విస్తరించాలని నిర్దేశించుకుంది. గురువారం బిఎస్ఇలో 5.18 శాతం తగ్గి రూ.119.05 వద్ద ముగిసింది.

5 లక్షల కోట్లు హాంఫట్

- మూడు రోజుల్లో కరిగిన సంపద మదుపరి విలవిల
- సెన్సెక్స్ మరో 267 పాయింట్ల పతనం



ముంబయి : మూడు సెషన్లలో మదుపర్లు దాదాపుగా రూ.5 లక్షల కోట్ల విలువ నష్టపోయారు. వివిధ పరిణామాలతో బిఎస్ఇ సెన్సెక్స్ ఈ రోజుల్లో 700 పాయింట్లు మేర కోల్పోవడంతో మదుపరి తీవ్ర ఒత్తిడికి గురి అయ్యారు. గురువారం బిఎస్ఇ మరో 267 పాయింట్లు నష్టపోయింది. క్రితం సోమవారం రూ.1,33,28,547 కోట్లుగా ఉన్న బిఎస్ఇ మార్కెట్ విలువ గురువారం ముగింపు నాటికి ఇది రూ.1,27,98, 957 కోట్లకు పడిపోయింది. దీంతో మదుపర్లు రూ.5,29,590 కోట్లు నష్టపోయారు. టాటా మోటార్స్, ఎస్‌బిఐ, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) సూచీలు రూ.10,000 కోట్ల పైగా నష్టపోయాయి. ఐటిసి, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, కోల్ ఇండియా, మారుతి సుజుకి ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, కాడిల్లా హెల్త్‌కేర్ సూచీలు రూ.7,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల మేర విలువ కోల్పోయాయి.

వీడని యుద్ధ భయాలు..

అమెరికాపై ఉత్తర కొరియా యుద్ధ హెచ్చరికలు, పలు కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు పేలవంగా నమోదు కావడంతో గురువారం కూడా భారత మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 266.51 పాయింట్లు లేదా 0.84 శాతం నష్టపోయి 31,531.33కు పడిపోయింది.

ప్రస్తుత నెలలో ఇదే కనిష్టం. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 87.8 పాయింట్లు లేదా 0.89 శాతం పతనమై 9,820.25 వద్ద ముగిసింది. బిఎస్ఇలో రంగాల వారిగా రియాల్టీ సూచీ అత్యధికంగా 5.12 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో వైద్య సూచీ 3.15 శాతం, ఆటో 2.79 శాతం, విద్యుత్ 2.78శాతం చొప్పున విలువ కోల్పోయాయి. మరోవైపు ఐటి సూచీ 0.63 శాతం, టెక్ 0.13 శాతం చొప్పున రాణించాయి. సెన్సెక్స్-30లో టాటా మోటార్స్ 8.6 శాతం, డాక్టర్ రెడ్డీస్ 4.77 శాతం, సన్ ఫార్మా 3.08 శాతం, అదానీ పోర్ట్సు 2.66 శాతం, సిప్లా 2.47 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. మరోవైపు ఇన్ఫోసిస్ 1.35 శాతం, విప్రో 0.44 శాతం, టిసిఎస్ 0.37 శాతం, ఎల్‌అండ్‌టి 0.3 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 0.26 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు కొంత మద్దతుగా నిలిచాయి.

బిఎస్ఇలో ధరలు రూ.

కంపెనీ	07-08-2017	10-08-2017	తేడా
టాటా మోటార్స్	430.45	380.90	-11.5
ఎస్‌బిఐ	311.10	296.55	-4.7
సన్ ఫార్మా	505.95	460.15	-9.1
రిలయన్స్ ఇండస్ట్రీస్	1616.60	1584.05	-2.0
ఐఒసిఎల్	431.30	410.60	-4.8
బిపిసిఎల్	527.45	481.45	-8.7
బజాజ్ ఫినాన్స్	1794.45	1638.40	-8.7
ఐటిసి	280.00	273.10	-2.5
కోల్ ఇండియా	251.30	239.05	-4.9
మారుతి సుజుకి	7839.45	7591.00	-3.2

దలాల్ స్ట్రీట్‌కు 'ఆధార్' తప్పనిసరి..!

ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు, బ్యాంక్ ఖాతాలు, పాన్ కార్డులకు ఆధార్ కార్డును ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. తాజాగా దలాల్ స్ట్రీట్‌లోనూ ప్రవేశించాలంటే అధార్ కార్డును తప్పనిసరి చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. స్టాక్‌మార్కెట్‌లో షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలుకు దీన్ని సమర్పించాల్సి ఉంటుంది. మార్కెట్లలో అవకతవకలని, పన్ను ఎగవేతలను, బ్లాక్ మనీని వైట్‌గా చేసుకునే ప్రక్రియను నిర్మూలించడానికి త్వరలోనే సరికొత్త నిబంధనలు రాబోతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. దీనికోసం ప్రభుత్వం, సెక్యురిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) ప్లాన్ చేస్తున్నట్టు వెల్లడైంది. ఆధార్‌తో స్టాక్ మార్కెట్ ద్వారా బ్లాక్‌మనీని వైట్ మనీగా మార్చుకునే ప్రక్రియకు కళ్లెం వేయొచ్చని ప్రభు త్వం, సెబీ భావిస్తోంది. కేవలం పాన్ మాత్రమే పన్ను లీక్‌ను అరికట్టలేదని ప్రభుత్వం గుర్తించినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టాక్ మార్కెట్ లావాదేవీల కోసం తాము తీసుకునే చర్యలతో తప్పుడు కార్యక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఫైనాన్సియల్ మార్కెట్ లావాదేవీలకు ఏకైక గుర్తింపు సంఖ్య లాగా పాన్‌ను ఆధార్ భర్తీ చేస్తుందో లేదో ఇంకా స్పష్టంకాలేదు.

అయితే అవినీతి రహిత దేశంగా భారత్‌ను మార్చడానికి ఫైనాన్సియల్ మార్కెట్ లావాదేవీలతో ఆధార్‌ను లింక్ చేయడం ఎంతో ముఖ్యమైన అంశమని ఐఐఎఫ్ఎల్ గ్రూప్ ఛైర్మన్ నిర్మల్ జైన్ తెలిపారు. ఇటీవలే ప్రభుత్వం పాన్‌కు, బ్యాంకు అకౌంట్లకు, మొబైల్ ఫోన్ నెంబర్లకు ఆధార్‌ను తప్పనిసరి చేసింది. బ్యాంకు ఖాతాదారులు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకునే గడువును ప్రభుత్వం డిసెంబర్ 31 వరకు విధించింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్లలో ఆన్‌లైన్ కెవైసిలకు ప్రస్తుతం దీన్ని వాడుతున్నారు. అయితే ఎప్పుడన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అంతేగాక ప్రస్తుతం ఉన్న పాన్ కార్డుకు బదులుగా ఆధార్‌ను తీసుకొస్తారో లేదా ఆధార్, పాన్ కార్డులు రెండింటిని తప్పనిసరి చేస్తారో ఇంకా నిర్ణయం తీసుకోలేదని సదరు అధికారి వెల్లడించారు.

మెడిలైట్ నుంచి 'హైడ్రోజన్' నీటి అయొనైజర్

ఎండి శ్రీనివాస యాదవ్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మెడిలైట్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ హైడ్రోజెన్ రిచ్ యాంటీ ఆక్సిడెంట్ అయొనైజర్ హెచ్‌రిచ్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దేశంలోనే తొలిసారి పూర్తి స్థాయిలో హైడ్రోజన్ పూరిత వాటర్ అయొనైజర్ ఇదని మెడిలైట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్ కందుల తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి నెల నుంచి టెస్ట్ మార్కెట్ నిర్వహించిన తాము అధికారికంగా భారత మార్కెట్లో హెచ్.రిచ్ ఆల్కలైన్ వాటర్ అయొనైజర్ ను అమ్మనున్నామని తెలిపారు. అయితే వచ్చే మాసంలో వీటిని వాణిజ్య అమ్మకాల్లోకి తీసుకొస్తామన్నారు. వీటిని తైవాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీని ధర రూ.1,40,000 నిర్ణయించినట్టుగా చెప్పారు. రెండేళ్లకోసారి మార్చే పిల్టర్ వ్యయం రూ.4000గా ఉంటుందన్నారు.

ఈ ఏడాది రూ.25 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెడిలైట్ జిఎం ఎస్.ఎస్.శ్రీనివాస శర్మ, కంపెనీ ప్రతినిధులు రవి, ప్రసాద్, సంతోష్, అమిత్ కుమార్ నర్సోలి తదితరులు పాల్గొన్నారు.

ఓయసిస్



జి.సుబ్బారావు, పాలిటీ,
గుంటూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటీషన్స్
సెల్ : 94405 25635

పట్టును మొదట ఏ దేశంలో కనుగొన్నారు ?

పోటీ పరీక్షల ప్రత్యేకం



★ దేశంలో పశు సంపద వివరాల సేకరణ ఎప్పటి నుంచి ప్రారంభమైంది ? – **1920**

★ పశు సంపద వివరాల సేకరణ ఎన్ని సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది ? – **ఐదు సంవత్సరాలు**

★ 1950లో సేకరించిన పశు గణాంకాల ప్రకారం దేశంలో ఎన్ని మిలియన్ల పాలు ఇచ్చే గేదెలు ఉన్నాయి ? – **43 మిలియన్లు**

★ 1951- 52లో ఎన్ని కీలక గ్రామాల్లో 94 కృత్రిమ గర్భధారణ కేంద్రాలను స్థాపించారు ? – **196**

★ మొదటి పంచవర్ష ప్రణాళిక(1951-56) ఆఖరుకు దేశంలో ఎన్ని పశువైద్యశాలలు ఉన్నాయి ? – **2,400**

★ పాడి పరిశ్రమ అభివృద్ధికి మొదటి పంచవర్ష ప్రణాళికలో కేటాయించిన మొత్తం ఎంత ? – **రూ. 1,553 లక్షలు**

★ మొదటి పంచవర్ష ప్రణాళికలో చేపల పెంపకానికి చేసిన వ్యయం ఎంత ? – **రూ.271 లక్షలు**

★ పశువధ నివారణ కమిటీని కేంద్రప్రభుత్వం ఏ సంవత్సరంలో ఏర్పాటు చేసింది ? – **1954**

★ రెండో పంచవర్ష ప్రణాళిక (1956-61)లో పాడి పరిశ్రమాభివృద్ధికి కేటాయించిన మొత్తం ఎంత ? – **రూ.3,347 లక్షలు**

★ దేశంలో వ్యవసాయ అనుబంధ వృత్తుల ఆదాయం ఎంత ? – **15 శాతం**

★ నూతన పశుపోషణ విధానం ఎప్పుడు అమలులోకి వచ్చింది ? – **1966-69 మధ్యకాలంలో**

★ ఆరో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఎన్ని పశువైద్యశాలలు స్థాపించారు ? – **14,849**

★ కేంద్ర పశు దాణా, గింజల ఉత్పత్తి కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు ? – **హిస్సార్ ఘట**

★ పదో పంచవర్ష ప్రణాళిక కాలంలో పశుగణాల వార్షిక వృద్ధి రేటు ఎంత ? – **3.6 శాతం**

★ 2007లో దేశంలో పశుగణన జరిగిన నాటికి వాటి సంఖ్య ఎంత ? – **5,29,698**

★ 2012 నాటికి దేశంలో ఎన్ని మిలియన్ల పశువులు ఉన్నాయి ? – **83.15 మిలియన్లు**

★ దేశంలో ప్రతి ఆవు సగటున ఇచ్చే పాలు ఎన్ని పౌండ్లు ? – **413 పౌండ్లు**

★ దేశంలో ప్రస్తుతం తలసరి ఆహారంలో ఎన్ని గ్రాముల మాంసకృత్తులు ఉన్నాయి ? – **10 శాతం**

★ దేశంలో మొదట ఏ ఏ రాష్ట్రాల్లో అంటువ్యాధుల నియంత్రణ చట్టాన్ని అమలు చేశారు ? - **అస్సాం, మహారాష్ట్ర (బాంబే), మధ్యప్రదేశ్, మద్రాసు, ఒరిస్సా, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మైసూరు, హిమాచల్‌ప్రదేశ్**

★ దేశంలో ఎన్ని మిలియన్ల గొర్రెలు మాంసం, ఉన్నిని సమకూర్చుతున్నాయి ? – **తొమ్మిది మిలియన్లు**

★ 'పేదవారి ఆవు' అని దేనిని పిలుస్తారు ? – **మేక**

★ 1956లో జరిపిన పశు గణన ప్రకారం దేశంలో ఎన్ని మిలియన్ మేకలు ఉన్నాయి ? – **తొమ్మిది మిలియన్లు**

★ దేశంలో చేపల తలసరి వార్షిక లభ్యత ఎంత ? – **3.4 పౌండ్లు**

★ సెంట్రల్ ఫిషరీస్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉన్నది ? - **కొచ్చిన్**

★ 1950-51 సంవత్సరాల్లో దేశంలో ఎన్ని లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరిగింది ? – **7.52 లక్షల మిలియన్ టన్నులు**

★ 1950- 51లో చేపల ఉత్పత్తుల విలువ ఎంత ? – **రూ.2 కోట్లు**

★ దేశంలో చేపల అభివృద్ధికి మొదటి పంచవర్ష ప్రణాళికలో ఎంత మొత్తం కేటాయించారు ? – **రూ.4 కోట్లు**

★ ఐదో పంచవర్ష ప్రణాళికాంతానికి(1979-80) చేపల మొత్తం ఉత్పత్తి ఎంత ? – **2,336 వేల టన్నులు**

★ తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక(1999-2000) కాలంలో దేశంలో చేపల ఉత్పత్తి ఎన్ని మిలియన్ టన్నులకు పెరిగింది ? - **5.67 మిలియన్ టన్నులు**

★ పదో పంచవర్ష ప్రణాళిక కాలంలో ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో భారతదేశం ఏ స్థానంలో ఉంది ? – **ప్రథమ స్థానం**

★ 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో చేపలు, రొయ్యల పెంపకం ద్వారా మొత్తం ఆదాయంలో ఎంత సమకూరింది ? – **5.4 శాతం**

★ 2011- 12 సంవత్సరాల నాటికి దేశంలో చేపల ఉత్పత్తి ఎన్ని మిలియన్ టన్నులకు పెరిగింది ? – **8.7 మిలియన్ టన్నులు**

★ 2011-12 నాటికి దేశ జాతీయ ఆదాయంలో చేపల ద్వారా లభించే ఆదాయం ఎంత ? – **0.4 శాతం**

★ 2013-14లో చేపల ఉత్పత్తి ఎన్ని మిలియన్ టన్నులకు పెరిగింది ? - **9.45 మిలియన్ టన్నులు**

★ 2013- 14 నాటికి దేశంలో మత్స్యసంపద వాటా ఎంత ? – **0.5 శాతం**

★ 2014-15 నాటికి దేశంలో ఎన్నివేల టన్నుల చేపల ఉత్పత్తి జరిగిందని అంచనా ? - **4.37 మిలియన్ లక్షల టన్నులు**

★ గ్రామీణ ప్రాంతాల్లో కోడి సంవత్సరంలో ఎన్ని గుడ్లను మాత్రమే పెడుతుంది ? – **50 గుడ్లు**

★ దేశంలో రెండో పంచవర్ష ప్రణాళిక చివరకు కోళ్ల పెంపక విస్తరణ కేంద్రాలు ఎన్నింటిని స్థాపించారు ? – **269**

★ 2013 నాటికి దేశంలో తలసరి సగటు కోడిగుడ్ల లభ్యత ఎంత ? – **60.73 బిలియన్లు**

★ 1949-50లో జరిగిన అడవుల గణాంకాల ప్రకారం మొదటి పంచవర్ష ప్రణాళిక ఆరంభంలో ఎన్ని మిలియన్ ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయని అంచనా వేశారు ? - **147.7 మిలియన్ టన్నులు**

★ కేంద్ర అడవుల బోర్డును ఏ సంవత్సరంలో స్థాపించారు ? – **1950**

★ కేంద్రప్రభుత్వం ఏ సంవత్సరంలో అటవీ విధానాన్ని ప్రకటించింది ? – **1952 మే 22**

★ దేశ భూభాగంలో 2013లో అడవుల శాతం ఎంత ? – **23.34 శాతం**

★ 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో దేశంలో తలసరి అడవుల విస్తీర్ణం ఎంత ? – **0.0064 హెక్టార్లు**

★ పట్టును మొదట ఏ దేశంలో కనుగొన్నారు ? - **చైనాలో (2640 బి.సి)**

★ 2005-06లో సిల్కు ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా దేశం ఎన్ని కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది ? – **రూ.3,338 కోట్లు**

★ దేశంలో ఎన్ని మిలియన్ టన్నుల పండ్ల ఉత్పత్తి జరుగుతోంది ? – **66 మిలియన్ టన్నులు**

★ జాతీయ హార్టీకల్చర్ మిషన్ ఏ సంవత్సరం నుంచి పనిచేస్తోంది ? – **2005-06**

★ 2014-15 జనవరి 15 నాటికి ఆహార సబ్సిడీ పరిమాణం ఎంత ? – **రూ. 107823.75 కోట్లు**

★ ఐసీడీ పూర్తి పేరు ఏమిటి ? – **అధిక పశుగణాభివృద్ధి (ఇంటెన్సివ్ కెటిల్ డెవలప్‌మెంట్)**

★ డెవలప్‌మెంట్ ఐసీఏఆర్ పూర్తి పేరు ? – **ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్**

★

నమూనా ప్రశ్నలు

1. దేశంలో నూతన పశుపోషణ విధానాన్ని ఎప్పటినుంచి ప్రవేశపెట్టారు ?
ఎ. 1956-61 బి. 1960-63
సి. 1961-64 డి. 1966-69

2. 1950 నాటికి దేశంలో ఎన్ని మిలియన్ల పాలిచ్చే గేదెలు ఉన్నాయి ?
ఎ. 43 మిలియన్లు బి. 42 మిలియన్లు
సి. 40 మిలియన్లు డి. 45 మిలియన్లు

3. దేశంలో పశు మరణాలకు కారణమైన వ్యాధి ఏది ?
ఎ. రాఖీఖేత్ బి. రిండర్‌పెస్ట్
సి. రాణిశీల్ డి. ఇవి ఏవీ కాదు

4. మొదటి పంచవర్ష ప్రణాళిక (1951-56) కాలానికి దేశంలో ఎన్ని పశు వైద్యశాలలు ఉన్నాయి ?
ఎ. 2,200 బి. 2,300 సి. 2,400 డి. 2,500

5. దేశంలో ఎప్పటినుంచి ఐదేళ్లకొకసారి పశుగణనను నిర్వహిస్తున్నారు ?
ఎ. 1935 బి. 1930 సి. 1925 డి. 1920

6. 1945లో దేశంలో పశుగణాంక వివరాల ప్రకారం ఎన్ని మిలియన్ల పశువులు ఉన్నాయి ?
ఎ. 144.5 మిలియన్లు బి. 147.5 మిలియన్లు
సి. 153.5 మిలియన్లు డి. 154.5 మిలియన్లు

7. పశువధ నివారణ కమిటీని ఏ సంవత్సరంలో నియమించారు ?
ఎ. 1954 బి. 1953 సి. 1955 డి. 1956

8. వ్యవసాయానికి ఉపయోగపడని పశువులను ఎక్కడికి పంపాలని నిర్ణయించారు ?
ఎ. కేసద్ బి. గోసదన్
సి. గోమరియ కౌసదన్ డి. ఇవి ఏవీ కావు

9. 2012లో నిర్వహించిన పశుగణన ప్రకారం దేశంలో ఎన్ని మిలియన్ల పశువులు ఉన్నాయి ?
ఎ. 83.15 మిలియన్లు బి. 100 మిలియన్లు
సి. 70 మిలియన్లు డి. 120 మిలియన్లు

10. ఆరో పంచవర్ష ప్రణాళిక కాలంలో గ్రామీణ యాజమాన్య సంస్థను ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు ?
ఎ. మహారాష్ట్ర బి. గుజరాత్
సి. తమిళనాడు డి. ఆంధ్రప్రదేశ్

11. 'పేదవారి ఆవు'గా దేనిని అభివర్ణిస్తారు ?
ఎ. ఆవు బి. బర్రె
సి. మేక డి. పైన పేర్కొన్నవన్నీ

12. 1956లో నిర్వహించిన పశుగణన ప్రకారం దేశంలో ఎన్ని మిలియన్ల మేకలు ఉన్నాయి?
ఎ. 52 మిలియన్లు బి. 53 మిలియన్లు
సి. 54 మిలియన్లు డి. 55 మిలియన్లు

13. కోళ్లకు ఏ వ్యాధి కారణంగా సాధారణంగా ప్రమాదం సోకుతుంది ?
ఎ. రాణిఖేత్ బి. రిండర్‌పెస్ట్
సి. రాశిఖేత్ డి. ఇవి ఏమీ కావు

14. సెంట్రల్ ఫిషరీస్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉన్నది ?
ఎ. తిరువనంతపురం బి. కొచ్చిన్
సి. కొట్టాయం డి. ట్యూటికోరన్

15. 1951లో దేశంలో చేపల ఉత్పత్తి ఎంత ?
ఎ. 6.42 లక్షల మిలియన్ టన్నులు
బి. 7.52 లక్షల మిలియన్ టన్నులు
సి. 6.32 లక్షల మిలియన్ టన్నులు
డి. 7.32 లక్షల మిలియన్ టన్నులు

16. 2011- 12 సంవత్సర కాలంలో దేశంలో చేపల ఉత్పత్తి ఎన్ని లక్షల మిలియన్ టన్నులకు పెరిగింది ?
ఎ. 18.7 లక్షల టన్నులు
బి. 8.7 మిలియన్ టన్నులు
సి. 3.751 లక్షల టన్నులు
డి. 13.7 లక్షల టన్నులు

17. 1949-50లో నిర్వహించిన అడవుల గణాంకాల ప్రకారం దేశంలో ఎన్ని మిలియన్ ఎకరాలలో అడవులు విస్తరించి ఉన్నాయి ?
ఎ. 137.7 మిలియన్ ఎకరాలు
బి. 147.7 మిలియన్ ఎకరాలు
సి. 157.4 మిలియన్ ఎకరాలు
డి. 127.4 మిలియన్ ఎకరాలు

18. కేంద్రీయ అడవుల బోర్డును ఏ సంవత్సరంలో స్థాపించారు ?
ఎ. 1948 బి. 1949 సి. 1950 డి. 1951

19. జాతీయ అటవీ విధానంపై మొదట ఏ సంవత్సరంలో తీర్మానం చేశారు ?
ఎ. 1951 మే 22 బి. 1952 మే 22
సి. 1953 జూన్ 22 డి. 1953 మే 22

20. ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో జాతీయ అడవుల పర్యావరణ అభివృద్ధి బోర్డు(1992)ను ఏర్పాటు చేశారు ?
ఎ. ఏడో పంచవర్ష ప్రణాళిక
బి. ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక
సి. తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక
డి. పదో పంచవర్ష ప్రణాళిక

21. తొమ్మిదో పంచవర్ష ప్రణాళికారంభంలో విడుదల చేసిన స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-1997 ప్రకారం దేశంలో ఎంత శాతంలో అడవులు విస్తరించి ఉన్నాయి ?
ఎ. 18.27 శాతం బి. 21.27 శాతం
సి. 19.27 శాతం డి. 22.27 శాతం

22. మొదటిసారిగా పట్టును ఏ దేశంలో కనుగొన్నారు ?
ఎ. భారత్ బి. చైనా
సి. పర్షియా డి. మెసపొటామియా

23. జాతీయ హార్టీకల్చర్ మిషన్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు ?
ఎ. 2007-08 బి. 2004-05
సి. 2005-06 డి. 2008-09

24. ప్రపంచంలో పట్టును అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం ఏది ?
ఎ. చైనా బి. భారత్ సి. అమెరికా డి. కెనడా

సమాధానాలు : 1.డి, 2.ఎ, 3.బి, 4.సి, 5.డి, 6.ఎ, 7.ఎ, 8.బి, 9.ఎ, 10.బి, 11.సి, 12.డి, 13.ఎ, 14.బి, 15.బి, 16.బి, 17.బి, 18.సి, 19.బి, 20.బి, 21.సి, 22.బి, 23.సి, 24.ఎ.

ఉద్యమించిన విద్యార్థి లోకం

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం

- విజయనగరం, ఆత్మకూరు, గుంటూరుల్లో అరెస్టులు
- గుంటూరులో విద్యార్థి సంఘాల నాయకులపై కేసు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఐక్యంగా ఉద్యమించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్‌ఒ, పిడిఎస్‌యు ఆధ్వర్యాన తరగతులను స్వచ్ఛందంగా బహిష్కరించి బంద్ పాటించారు. అనేక జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయి. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు మూతబడ్డాయి. అన్ని జిల్లాల్లోనూ విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. బంద్‌లో భాగంగా విద్యార్థులు పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీని ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

విజయనగరంలో ఎంఆర్ కాలేజి వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను, విద్యార్థులను 24 మందిని పోలీసులు బలవంతంగా ఈడ్చుకుపోయి ఆటోల్లో పడేశారు. వీరిని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు నిరసనగా విద్యార్థులు కోట వద్ద రాస్తారోకో చేశారు.

విజయవాడ నగరంలోని పాఠశాలలు, కళాశాలలకు ముందుగానే సెలవు ప్రకటించారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయంతో పాటు, అన్ని విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి. గుంటూరులో లాడ్జి సెంటర్, చుట్టగుంట సెంటర్ల వద్ద ఉదయాన్నే ఇంజినీరింగ్ కాలేజీల బస్సులను విద్యార్థి సంఘ నాయకులు అడ్డుకున్నారు. బంద్‌కు సహకరించాలని చుట్టుగుంట సెంటర్‌లో కాలేజీ బస్సుల్లోని విద్యార్థులను నాయకులు కోరుతున్న క్రమంలో పోలీసులు వారిని అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. బంద్ పోస్టర్లు కలెక్టరేట్ గేటుపై అంటించారనే నెపంతో కలెక్టర్ ఆదేశాలతో విద్యార్థి సంఘాల నాయకులపై కలెక్టరేట్ ఎఒ ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి.భగవాన్‌దాస్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట కార్యదర్శి సుబ్బారావు, పిడిఎస్‌ఒ నాయకులు గురులింగం, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు గనిరాజుపై కేసు నమోదు చేశారు.



విజయనగరంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిని అరెస్టు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం నగరంలో విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ (ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్‌యు) ఆధ్వర్యాన మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలల వద్ద విద్యార్థులు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. కర్నూలులో కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. అనంతపురం జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు ముందస్తుగానే సెలవు ప్రకటించాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో విద్యార్థులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కావలిలో బిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో పాఠశాలలు మూతబడ్డాయి. విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యాన తూర్పు గోదావరి జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కాకినాడలో జెఎన్‌టియుకె విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులు బహిష్కరించి బంద్‌కు మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు మూతబడ్డాయి. మరికొన్ని విద్యాసంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూయించారు.

విశాఖ నగరంలోని జివిఎంసి విగ్రహం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, ఎఎస్‌ఎఫ్, పిడిఎస్‌ఒ విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ధర్నా జరిగింది. గాజువాకలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కడప నగరంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బంద్ జరిగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులను బహిష్కరించి బంద్ పాటించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి. మధు

కరువు నుంచి గట్టెక్కించేందుకు చట్టం

- కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వరుస కరువులు, పంటలకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని, ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరముందని, ఇందుకు టిడిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు అనంతపురంలో జరుగుతున్న నేపథ్యంలో జిఆర్‌పి హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటిలాగే ఈ ఏడాదీ రాయలసీమ జిల్లాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సక్రమంగా అమలు జరపడం లేదని తెలిపారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, గరగపర్రులో ఇప్పటికీ సాంఘిక బహిష్కరణ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవరపల్లిలో దళితుల భూములను పెత్తందారులు నీరు-ప్రగతి పేరుతో అక్రమంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటిపై ఆందోళన చేస్తున్న వారిపై ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఉన్నత చదువులు చదివి ఉపాధి అవకాశాల్లేక యువత నిరాశా నిస్పృహల్లో ఉందన్నారు.

కేరళ, కర్నాటక, ఒడిశా తరహాలో ఏపిలోనూ యూత్ పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వంశధార, గండికోట ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇంత వరకు పరిహారం చెల్లించలేదని అన్నారు. వంశధార పనులు చేపట్టే కాంట్రాక్టర్లకేమో ప్రస్తుత ధరలకు అనుగుణంగా పనులు అప్పగించారని, నిర్వాసితులకేమో 2005లో నిర్ణయించిన ప్రకారం ఇంటికి రూ.53 వేలు, భూమికి ఎకరాకు రూ.1.25 లక్షలు చొప్పున ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలపై చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యలపై ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు.

పవన్‌కళ్యాన్ పార్టీతో పొత్తులుంటాయా అని మీడియా ప్రతినిధులు అడిగిన దానికి ఆయన స్పందిస్తూ ఎన్నికలకు ఇంకా సమయమున్నందున ఇప్పుడు ఆ అంశాలను చర్చించడం లేదని అన్నారు. ప్రజా సమస్యలపై కలిసొచ్చే వారితో పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-నందిగామ

వేతన చట్టం సవరించాలని, గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల తపాలా ఉద్యోగులు నందిగామ పోస్టాఫీసు కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పోస్టాఫీసు కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి నందిగామ ఎమ్మెల్యే కార్యాలయంలో తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు. పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వసంతరావు, బి.వెంకటేశ్వరరావు, బిక్కి రామారావు, రాము, వెంకటరెడ్డి, రాధాకృష్ణ తదితరులు మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను, చేసుకున్న ఒప్పందాలను పూర్తిగా విస్మరించిందన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలని ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్ (విశాఖ)

విశాఖ జిల్లా అనకాపల్లి ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆసుపత్రి ఆవరణలో సిపిఐ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు వైఎన్ భద్రం మాట్లాడుతూ 250 పడకలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించినా అందుకు సరిపడా వైద్యులను, నర్సింగ్ స్టాఫ్‌ను, క్లాస్-4 సిబ్బందిని నియమించకపోవడం అన్యాయమన్నారు. ఇఎన్‌టి, పిల్లల వైద్యుల నిపుణులు, రేడియాలజిస్టు, గైనకాలజిస్టు పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి డిసిహెచ్‌ఎస్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఐదుగురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్‌పి సుబ్బరాయుడు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. నగర శివారు గోరంట్లలోని సంస్మిత అపార్టుమెంట్‌లో బెట్టింగ్ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి నల్లపాడు, పెదకాకాని, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, బంగారపు చైన్, ఉంగరం, ఎల్‌ఇడి టివి, ల్యాప్‌టాప్, రూ.30,700 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మిగిలిన బెట్టింగ్‌ల నిర్వాహకుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపటినట్లు అదనపు ఎస్‌పి సుబ్బరాయుడు తెలిపారు.

న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం

గరగపర్రు ఉద్యమ సంఘీభావ కమిటీ

ప్రజాశక్తి-భీమవరం రూరల్

గరగపర్రు దళితులు ఐక్యంగా ఉండాలని, వారికి న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని గరగపర్రు ఉద్యమ సంఘీభావ కమిటీ తెలిపింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సిఐటియు కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన గురువారం సంఘీభావ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ మిగిలిన 88 కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సాంఘిక బహిష్కరణకు గురికాని సర్పంచికి ఇచ్చిన పరిహారంను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన పది హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. దళితులకు కౌలు భూములు ఇవ్వాలని, వ్యవసాయ పనులు కల్పించాలని, దళితవాడలో రక్షిత తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మణ్, దళిత ఐక్య వేదిక కన్వీనర్ గంటా సుందరకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, కెఎన్‌పిఎస్ జిల్లా నాయకులు ఎం.జాన్‌బాబు, సిఐటియు డివిజన్ అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, ఐఎఫ్‌టియు నాయకులు కె.రాములు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తుందో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎరిచర్ల రాజేష్, ప్రసాద్, రాజు, జోగయ్య, గరగపర్రు దళితులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు బస్సు డ్రైవర్ల నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

ఎపిఎస్‌ఆర్‌టిసి విశాఖ రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఉన్న సుమారు 300 అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం వాల్తేర్ డిపో ఎదుట నిరాహారదీక్షలు నిర్వహించారు. ఎపిఎస్‌ఆర్‌టిసి హైర్ బస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వాల్తేర్ డిపో కార్యదర్శి ఒ.రాజు, ఉపాధ్యక్షులు రవిశంకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం నెలకు రూ. 15 వేలు జీతం చెల్లించాలన్నారు. జీతాలు ప్రతి నెలా 1న చెల్లించాలన్నారు. శ్రీకాకుళం, నర్సీపట్నం (నాన్‌స్టాప్), తిరుపతి, కడప, కర్నూలు బస్ డ్రైవర్లకు రూ. 20 వేలు జీతం చెల్లించాలన్నారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నర్సీపట్నం డిపోలో తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. జివిఎంసి పరిధిలో కార్మికులకు బస్‌పాసులు ఇవ్వాలన్నారు. యాక్సిడెంట్ జరిగినప్పుడు డ్రైవర్‌ను బెయిల్‌పై బయటికి తీసుకు రావాల్సిన బాధ్యత యజమానులదేనని అన్నారు. చట్ట ప్రకారం వారాంతపు, యర్న్ లీవులు, ప్రతి ఏటా 2 జతల యూనిఫారాలు ఇవ్వాలని కోరారు.

పాలేరు హత్య క్రూరత్వానికి పరాకాష్ట

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రెండెకరాల పొలం ఇవ్వాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో పనికి ఆలస్యంగా వచ్చాడని పెత్తందారు బొబ్బా బోసు పాలేరు గోపిని దారుణంగా హత్య చేయడాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటన విడుదల చేశారు. పాలేరును కొట్టి, విద్యుత్తు షాక్ ఇచ్చి, చావడిలో ఉరివేసి చంపడం అత్యంత పాశవిక చర్యని పేర్కొన్నారు. పైశాచికంగా హత్య చేయడమేగాక, పైగా నీ కుమారుడిని చంపా. మా ఇంటి వద్ద చావిడికి వేళ్లాడుతున్నాడు' అని పాలేరు ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల చెప్పడం పెత్తందారు క్రూరత్వానికి పరాకాష్ట అన్నారు. పెత్తందారుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలేరు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను, రెండెకరాల పొలాన్ని ఇవ్వాలని ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

నవ్య జ్యూట్ కార్మికుల చర్చలు సఫలం

నూతన వేతన ఒప్పందానికి యాజమాన్యం అంగీకారం



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు సత్యారావు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

నూతన వేతన ఒప్పందం విషయమై విజయనగరం జిల్లా బొబ్బిలిలోని 'నవ్య జ్యూట్' కార్మికులకూ, యాజమాన్యానికీ గురువారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులకు మొదటి రెండేళ్లు రోజుకు ఐదు రూపాయలు, మూడో ఏడాది రోజుకు ఆరు రూపాయలు చొప్పున కూలీ పెంచేందుకు యాజమాన్యం అంగీకరించింది. పండగ అడ్వాన్స్ రూ.ఐదు వేలు ఇచ్చేందుకు, ఎనిమిది నెలల పిఎఫ్ బకాయి మూడు వాయిదాల్లో చెల్లించేందుకు, బీమా, గ్రాట్యూటీ కొనసాగించేందుకు, బకాయిలను చెల్లించేందుకు ఒప్పుకుంది. మిల్లులోని సమస్యలను పరిష్కరించేందుకు కూడా అంగీకరించింది. సిఐటియు కార్యాలయంలో నవ్య జ్యూట్ మిల్లు యునైటెడ్ వర్కర్స్ యూని యన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఇందులో యూనియన్ అధ్యక్షులు తెంటు సత్యారావు, సిఐటి యు జిల్లా నాయకులు రెడ్డి వేణు, పి.శంకరరావు మాట్లాడుతూ కార్మికు లంతా ఐక్యంగా ఉండడం వల్ల యాజమాన్యం నూతన వేతన ఒప్పందానికి అంగీకరించి ందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. యూని యన్ నాయకులు బిహెచ్.చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

ముస్లింల అభ్యున్నతికి దోహదపడేందుకు జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూక్ షుబ్లీ డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భాష, మతపరమైన మైనార్టీల వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని రంగనాథ్ మిశ్రా ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. ఈ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తే ముస్లిం సమాజంతోపాటు అణగారిన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

279 జిఒ టెండర్ల రద్దుకు మున్సిపల్ వర్కర్స్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేసేందుకు జారీ చేసిన 279 జిఒలోని 'వర్క్ ఔట్ సోర్సింగ్' టెండర్లను రద్దు చేయాలని ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. జెఎసి నాయకులు ఎం.డేవిడ్, ఎ.రంగనాయకులు, జ్యోతిబసులతో కలిసి విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు నగర పాలక సంస్థ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. 279 జిఒ వల్ల మున్సిపల్ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారటమే కాకుండా ప్రజారోగ్యం, పౌరసేవలు వ్యాపార సరుకులుగా మార్చబడి మున్సిపాలిటీలన్నీ మురికి కూపాలుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకుని 279 జిఒకు సంబంధించిన అన్ని టెండర్లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చేపట్టిన చలో అమరావతి పాదయాత్రకు అనుమతించేవరకూ చలో కిర్లంపూడి నిర్వహిస్తామని కాపు జెఎసి ప్రకటించింది. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టదలచిన ముద్రగడ పద్మనాభాన్ని గృహనిర్బంధం చేసి అడ్డుకోవడాన్ని కాపు జెఎసి తీవ్రంగా ఖండించింది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో గురువారం నిర్వహించిన కాపు జెఎసి సమావేశానికి 13 జిల్లాల కాపు నేతలు హాజరై ప్రభుత్వ తీరును ఖండించారు.15 రోజులుగా పాదయాత్రను అడ్డుకుని కాపులపై చంద్రబాబు నిర్బంధం విధించడాన్ని హేయమైన చర్యగా నేతలు పేర్కొన్నారు.

- ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఖాకీ నీడలో 'వంశధార' పనులు

- డ్రోన్ సహాయంతో నిర్వాసితుల కదలికలపై నిఘా
- పనులు అడ్డుకునేందుకు వచ్చిన 40 మంది నిర్వాసితులు అరెస్టు

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)



నిర్వాసితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో వంశధార రిజర్వాయర్ పనులు పోలీసుల నీడలో సాగుతున్నాయి. ఎస్‌పి త్రివిక్రమవర్మ ఆధ్వర్యంలో గురువారం ఉదయం భారీగా పోలీసులు మోహరించారు. పోలీసుల సమక్షంలో ఆర్‌డిఒ ఆర్.గున్నయ్య, వంశధార, ఇంజినీరింగ్ అధికారులు గార్లపాడు, చిన్నకొల్లివలస నిర్వాసిత గ్రామాలతో పాటు 11 గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారిని తొలగించి, వంశధార పనులు ప్రారంభించారు. ఏ క్షణంలోనైనా వంశధార నిర్వాసితులు వచ్చి పనులను అడ్డుకుంటారేమోనని డ్రోన్ల సహాయంతో వారి కదలికలను పోలీసులు గమనించారు. ఉదయం 11 గంటల సమయంలో గార్లపాడు, చిన్నకొల్లి వలసకు చెందిన వందలాది మంది నిర్వాసితులు పనులు జరుగుతున్న చోటుకు వచ్చారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ, పునరా వాసం, యూత్ ప్యాకేజీ వంటి సమస్యలు పరిష్కరించకుండా పనులెలా చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, నిర్వాసితులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గార్లపాడు సర్పంచ్ నార అరుణ, గవర గోవిందరావు, తొత్తడి మురళీకృష్ణ, పి.రజని, చిన్నకొల్లివలస గ్రామానికి చెందిన చిన్నారావు, ప్రసాద్ సహా 40 మంది నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేశారు.

వారిలో కొందరిని ఆమదాల వలస పోలీస్ స్టేషన్‌కు, మరికొందరిని పాతపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిగిలిన వారిని భయపెట్టి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టిలో పెట్టి, పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అరెస్టు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్‌పి త్రివిక్రమవర్మ తెలిపారు.

సిపిఎం ఖండన

సమస్యలు పరిష్కరించకుండా వంశధార పనులు పూర్తి చేయాల నుకోవడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కమిటీ విమర్శిం చింది. రోడ్డును కొట్టివేసి, నిర్వాసితులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని, నిర్వాసితులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది.

ప్రజ్ఞ

జవాబులు

1. రాయ్‌పూర్
2. భోపాల్
3. భారత్
4. టావు సెటి
5. కృష్ణా జిల్లా

తమిళనాట రసవత్తర రాజకీయం



- దినకరన్ నియామకం చెల్లదని తీర్మానించిన పళని వర్గం
- శశికళ కుటుంబం మొత్తాన్ని పార్టీ నుంచి తొలగించాలన్న పన్నీర్ వర్గం
- నేడు మోడీని కలవనున్న పన్నీర్, పళని

చెన్నై : తమిళనాట అన్నాడిఎంకె విలీనానికి సంబంధించి రాజకీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. రాష్ట్రంలో అన్నా డిఎంకె లోని రెండు వర్గాలు తిరిగి ఏకమయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. అయితే తమ వ ర్గం తిరిగి విలీనం కావాలంటే దినకరన్‌ను, శశికళ కుటుంబ సభ్యులను పార్టీ నుంచి బహిష్కరించాలని సెల్వం వర్గం తొలి నుంచి డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో అన్నా డిఎంకె డిప్యూటి జనరల్ సెక్రటరీగా టిటివి దినకరన్ నియామకం చెల్లదంటూ గురువారం సమావేశమైన ఎడప్పాడి కె. పళనిసామి వర్గం తీర్మానం చేసింది . దినకరన్ కొత్తగా నియమించిన ఆఫీస్ బేరర్ల నియామకం కూడా చెల్లదని పేర్కొంది. ఎఐఎడిఎంకెలోని రెండు చీలిక వర్గాలు తిరిగి ఏకమయ్యేందుకు ఈ నిర్ణయం ఒక ముందడుగని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రెండు వర్గాలు ఇప్పటికే సమావే శమై చర్చించుకుని పళనిసామి ముఖ్యమంత్రిగాను, పన్నీర్ సెల్వం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగేందుకు అంగీకారాన్ని కుదుర్చుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో పళని సామి శుక్రవారం ఢిల్లీ వెళ్ళి ప్రధాని మోడీని కలవనున్నారు. పన్నీర్ సెల్వం కూడా అదే రోజున ఢిల్లీ బయలుదేరి వెళ్ళనున్నారు. తమిళనాట స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలంటే రెండు వర్గాలు ఒకటవ్వాలన్న ఆకాంక్షను మోడీ వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అన్నా డిఎంకె బైలా ప్రకారం మధ్యలో ఎటువంటి విరామం లేకుండా పార్టీ సభ్యుడిగా ఐదేళ్ళపాటు కొనసాగిన వారే పార్టీ పదవులకు అర్హులు. దినకరన్, శశికళతో పాటు ఇతర కుటుంబ సభ్యులను డిసెంబరు 2011లో జయలలిత పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. అవినీతి కేసుకు సంబంధించి బెంగళూరు కోర్టులో శశికళ ఫిబ్రవరి 15 లొంగి పోతూ పార్టీ డిప్యూటి సెక్రటరీగా దినకరన్‌ను నియమించారు.

పార్టీ నుంచి శశికళ కుటుంబాన్ని తొలగించాలి : పన్నీర్ సెల్వం వర్గం

దినకరన్‌ను పార్టీ నుంచి తొలగిస్తూ పళని సామి వర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇప్పుడు శశికళ కుటుంబాన్ని కూడా పార్టీ నుంచి తొలగించాలని పన్నీర్ సెల్వం వర్గ సభ్యుడు, మాజీ మంత్రి కె.పి. మునుస్వామి డిమాండ్ చేశారు. తాము న్యాయపోరాటాన్ని ప్రారంభించిన నాటి నుంచి జయలలిత మృతిపై విచారణ జరపాలని, శశికళ కుటుంబాన్ని పార్టీ నుంచి బహిష్కరించాలన్న రెండు ప్రధాన డిమాండ్లు చేస్తున్నామని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి జయలలిత దినకరన్‌ను పార్టీ నుంచి తొలగించగా, పళనిసామి వర్గం తిరిగి ఆయన నియమకాన్ని ఆమోదించిందని చెప్పారు. పార్టీ బైలా ఇందుకు అంగీకరించదన్నారు. ఇప్పుడు వాళ్ళు నిద్ర మేల్కొని దినకరన్‌ను తొలగిస్తామంటున్నారని, శశికళ కుటుంబమంతటినీ బహిష్కరించినప్పుడే విలీనం అంశాన్ని పరిశీలిస్తామని మునుసామి తెలిపారు. పార్టీలోని రెండు వర్గాల మధ్య రహస్య చర్చలు జరిగాయన్న విషయాన్ని ఆయన తోసిపుచ్చారు.

అన్ని భాషల్లోనూ ఒక్కటే ప్రశ్నాపత్రం

నీట్‌పై సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: 'నీట్' మెడికల్ పరీక్షలో అభ్యర్థులందరికీ అన్ని భాషల్లో ఒక్కటే ప్రశ్నాపత్రాన్ని అమలుజేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. పలువురు విద్యార్థులు దాఖలు చేసిన పిల్‌పై సుప్రీం కోర్టు స్పందించింది. నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షలు నిర్వహించడానికి వచ్చే ఏడాది ఏ విధమైన నియమ నిబంధనలు అమలు చేస్తున్నారో తెలియజేయాలని సిబిఎస్ఇని కోరింది. కఠినమైన ఈ ప్రశ్నాపత్రం ఎనిమిది మాతృభాషల్లో ఉందనీ, ఇది ఇంగ్లీష్, హిందీలతో పోల్చుకుంటే అర్థం చేసుకోవడం కష్టతరంగా ఉంటుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అయితే గతంలో స్థానిక భాషలో పరీక్షలు రాసిన వారి వివరాలను అందజేయాల్సిందిగా సిబిఎస్ఇని సుప్రీం కోర్టు కోరింది. దీనిపై సిబిఎస్ఇ ఒక వివరణ పత్రాన్ని అందజేసింది. నీట్-2017లో మొత్తం 100512 మంది విద్యార్థులు మాతృభాషల్లో పరీక్షలు రాశారని సిబిఎస్ఇ తెలియజేసింది. వీరిలో 30,817 మంది క్వాలిఫై అయ్యారని పేర్కొంది. వీరిలో ఒక విద్యార్థి మాత్రమే 720 మార్కులకు గాను 600 మార్కులు సాధించినట్లు తెలిపింది. 501-600 మధ్య 84 మంది విద్యార్థులు క్వాలిఫై పేర్కొంది. ఇక 2013లో 21,778 మంది మెడికల్ సీటు కోసం మాతృభాషలో పరీక్షల రాయగా వారిలో ఒక్క విద్యార్థి మాత్రమే 501-600 మధ్య మార్కులు సాధించినట్లు తెలిపారు. మే 7న నీట్ నిర్వహించిన పరీక్షల్లో గుజారాతీ, తమిళం, బెంగాలీ భాషల్లో మొత్తం 11.35 లక్షల మంది ఆశావాహుల్లో 6.11 లక్షల మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు.

పాక్ తరహా దర్యాప్తు ఉండదు

పనామా పత్రాల కేసుపై జైట్లీ

న్యూఢిల్లీ: పనామా పత్రాల కేసులో పాకిస్థాన్ తరహా దర్యాప్తు ఉండబోదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం రాజ్యసభలో తెలిపారు. పనామా పత్రాల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నవాజ్ షరీఫ్ పాక్ సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ప్రధాని పదవి నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పనామా పత్రాల కేసు విచారణపై జైట్లీ వివరణ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్క వ్యక్తినీ విచారిస్తామని, సరైన దర్యాప్తు లేకుండా ఎవర్నీ శిక్షించబోమని అన్నారు. బ్యాంకింగ్ నియంత్రణ(సవరణ) బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు జైట్లీ పైవిధంగా సమాధానమిచ్చారు. "మనకి కొన్ని చట్టాలు, పద్ధతులు ఉన్నాయి. పొరుగు దేశంలోలాగా ముందు తొలగింపు, తరువాత దర్యాప్తు చేయడం జరగదు" అని చెప్పారు. ఆరు సంస్థలు దర్యాప్తు ప్రారంభించాయని, కేసుకు సంబంధించిన పత్రాలను సేకరించాయని పేర్కొన్నారు. విచారణ పూర్తయ్యాక ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి పేర్లు ప్రకటించడంపై ఎటువంటి ఆంక్షలు ఉండబోవన్నారు.

నాపై ఛార్జిషీటు దాఖలు చేయలేరు

రాజద్రోహ కేసుపై కన్నయ్య కుమార్

సరైన ఆధారాలు లేవని వ్యాఖ్య

న్యూఢిల్లీ: జెఎన్‌యు వివాదానికి సంబంధించి రాజద్రోహం ఆరోపణల కింద తనపై ఛార్జిషీటు దాఖలు చేయలేరని విద్యార్థి సంఘం నాయకుడు కన్నయ్య కుమార్ కుమార్ అన్నారు. గతేడాది జెఎన్‌యు క్యాంపస్‌లో నిర్వహించిన ఓ విద్యార్థి సమావేశంలో జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన ఆరోపణలను నిరూపించే ఆధారాలు పోలీసుల వద్ద లేవన్నారు. ఈ కేసు అంత ముఖ్యమైనదైతే పోలీసులు తనపై ఇంకా ఎందుకు ఛార్జిషీటు నమోదు చేయలేదని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. మరణశిక్షకు గురైన ఉగ్రవాది అఫ్జల్ గురు వర్ధంతిని నిర్వహించినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. అలా తాను చేసి ఉంటే రాజద్రోహం కేసులో బెయిలుపై విడుదలయ్యేవాడిని కాదని చెప్పారు. "నేను జాతి వ్యతిరేక నినాదాలు చేయలేదు. అదంతా కల్పిత ప్రచారం. హైదరాబాద్ యూనివర్శిటీలో దళిత స్కాలర్ రోహిత్ వేములకు జరిగిన అన్యాయాన్ని తొలుత జెఎన్‌యు విద్యార్థులే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఏకమవ్వడంతో ఆందోళన చెందిన కొంతమంది మమ్మల్ని తప్పుడు కేసులో ఇరికించాలని ప్రయత్నించారు" అని చెప్పారు. మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ "లోక్‌సభ ఎన్నికల ముందు మంచి రోజులు(అచ్ఛే దిన్) వస్తాయని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో సర్దార్ సరోవర్ డ్యామ్ ప్రాజెక్టు నిర్వాసితులు చేస్తున్న ఉద్యమానికి కన్నయ్య కుమార్ సంఘీభావం తెలిపారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వం వారికి సరైన పునరావాసం కల్పించలేదని, చిన్న చిన్న షెడ్డుల్లోకి నిర్వాసితులను తరలిస్తున్నారని చెప్పారు. భారత సంస్కృతి, హిందూయిజం అనే అంశాలపై చర్చకు రావాలని ఆరెస్సెస్‌కు ఆయన సవాలు విసిరారు.

682 టెక్స్‌టైల్ మిల్లులు మూత

న్యూఢిల్లీ: దేశంలో గత జులై మాసాంతానికి 682 నూలుమిల్లులు మూత పడినట్లు ప్రభుత్వం గురువారం లోక్‌సభలో వెల్లడిచింది. వీటిలో 232 తమిళనాడులోనే ఉన్నాయనీ, జూన్ 30 నాటికి 1,399 మిల్లులు క్రియాశీలకంగా ఉన్నాయనీ కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. ఆమె ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె సమాధానమిస్తూ జూన్ మాసం ముగిసే నాటికి తమిళనాడులో 232, మహారాష్ట్ర 85, ఉత్తరప్రదేశ్‌లో 60, హర్యానాలో 42 మిల్లులు మూతపడినట్లు వివరించారు. ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న 1399 మిల్లులో తమిళనాడులో 752, మహారాష్ట్రలో 135, ఆంధ్రప్రదేశ్‌లో 112 ఉన్నాయనీ, ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయనీ ఆమె వివరించారు. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి), కార్మిక సంస్కరణలు ఈ రంగానికి ఊతమిచ్చాయన్నారు. టెక్స్‌టైల్ మిల్లులను గాడిలో పెట్టడానికి తీసుకుంటున్న చర్యలపై లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. ఆధునికీకరణ సాంకేతిక పరిజ్ఞానం (ఎటియుఎఫ్ఎస్) అభివృద్ధి ద్వారా 15 శాతం మూలధనం వృద్ధి చేసినట్లు చెప్పారు. తద్వారా ఆ రంగానికి రూ.30 కోట్లు ఆదా అయిందన్నారు. జూటు, సిల్క్, చేనేత రంగాల్లో ప్రాసెసింగ్‌లో 10 రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. కొత్త వస్త్ర పరిశ్రమల కోసం రూ.20 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. మహారాష్ట్రలో వస్త్ర పరిశ్రమలు మూత పడడంపై స్పందిస్తూ వాటి సమస్యల పరిష్కారాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని మంత్రి వెల్లడించారు.



స్కూల్‌లో అసభ్య నృత్యాలు

రాఖీ పౌర్ణమి రోజున దారుణం

లక్నో : పవిత్రంగా భావించే పాఠశాలలో అసభ్య నృత్యాలు చేశారు. చిన్నారులకు విద్యాబుద్ధులు బోధించాల్సిన పాఠశాలను బార్‌గా మార్చివేశారు. అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధానికి గుర్తుగా జరుపుకొనే రాఖీ పౌర్ణమి రోజు రాత్రి ఈ దారుణం జరగడం గమనార్హం. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలో యువతులు అసభ్య నృత్యాలు చేస్తుంటే, వారిపైకి కొందరు వ్యక్తులు నోట్లు విసరడం వీడియోల్లో కనిపిస్తోంది. మిర్జాపూర్ జిల్లాలోని టెటెరి యా గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి చూసేసరికి పాఠశాల అవరణ అంతా చిందరవందగా ఉండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామపెద్ద తన వద్దకు వచ్చి పాఠశాల తాళాలు తీసుకున్నారని, కానీ ఎందుకో చెప్పలేదన్నారు. గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్ద రామ్‌కేశ్ యాదవ్ ఆధ్వర్యంలో పాఠశాలలో పుట్టిన రోజు వేడుకలు జరిగాయంటూ ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్ ప్రాథమిక శిక్షణా అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయాలని ఆయన బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి (బిఈఓ)ను ఆదేశించారు.

అంబీ వ్యాలీని వేలం వేయాల్సిందే : సుప్రీం

న్యూఢిల్లీ : సహారా గ్రూపునకు చెందిన అత్యంత ఖరీదైన అంబీ వ్యాలీని వేలం వేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వేలం ప్రక్రియపై స్టే విధించాల్సిందిగా సహారా గ్రూపు అధినేత సుబ్రతా రాయ్ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. వేలం ప్రక్రియను నిలిపివేయడం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది. బుధవారం వేసిన పిటిషన్‌ను గురువారం కోర్టు విచారించింది. సెప్టెంబరు 7వ తేదీలోగా సహారా గ్రూపు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి రూ. 1500 కోట్లు డిపాజిట్ చేయాల్సిందిగా న్యాయస్థానం గతంలోనే ఆదేశించింది. పూణేకు సమీపంలో దాదాపు 8,900 ఎకరాల విస్తీర్ణంలో ఈ అంబీ వ్యాలీ ఉంది. దీని విలువ సుమారు రూ. 39 వేల కోట్లు వుంటుందని అంచనా.



కార్తీ 'లుకవుట్ నోటీస్'పై చెన్నయ్ హైకోర్టు స్టే

చెన్నయ్: కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై సిబిఐ జారీ చేసిన 'లుకవుట్' నోటీసుపై స్టే విధిస్తూ చెన్నయ్ హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. పాస్‌పోర్ట్ చట్టం కింద కార్తీ చిదంబరంతో పాటు మరో నలుగురిపై సిబిఐ అవినీతి కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. కార్తీ చిదంబరం, తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన న్యాయమూర్తి ఎం దురైస్వామి వారికి స్టే మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై కౌంటర్ అఫిడవిట్‌ను సెప్టెంబర్ 4 నాటికి దాఖలు చేయాలని ఆయన కేంద్రాన్ని ఆదేశించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఫారినర్ రీజినల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కార్తీ చిదంబరం, మరో నలుగురు నిందితులపై గత ఏడాది జూన్ 16న ఈ లుకవుట్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. తనపై జారీ చేసిన లుకవుట్ నోటీసు కేంద్ర ప్రభుత్వ 'రాజకీయ ప్రతీకారం'లో భాగమేనని కార్తీ తన పిటిషన్‌లో కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం మద్యం వ్యాపారి విజయ్ మాల్యా దేశం విడిచి వెళ్లిన ఉదంతం అనంతరం కార్తీ చిదంబరంపై లుకవుట్ నోటీసు జారీ చేయటం అనివార్యమైందని కోర్టుకు వివరించింది.




త్రిపురలో సిపిఎం కార్యాలయానికి నిప్పు

- నలుగురు కార్యకర్తలకు గాయాలు
- పదులసంఖ్యలో తగలబడిన మోటార్ బైక్‌లు

అగర్తలా: సిపిఎం పార్టీ కార్యాలయాలపై దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. తాజాగా త్రిపురలోని ఖుముల్వాంగ్‌లో వున్న పార్టీ కార్యాలయంపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి నిప్పటించారు. పదుల సంఖ్యలో మోటార్ బైక్‌లను తగలబెట్టారు. ఈ ఘటనలో నలుగురు కార్యకర్తలు గాయపడ్డారు. ఇండిజీనస్ పీపుల్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)కు చెందిన దుండగులు ఈ దాడికి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంత పెట్రోలింగ్ ఎస్‌పి హర్‌కుమార్ దెబ్బరమ మాట్లాడుతూ "పార్టీ కార్యాలయానికి సమీపంలో కార్యకర్తలకు చెందిన బైక్‌లకు ఐపిఎఫ్‌టికి చెందిన దుండగులు నిప్పు అంటించారు. మంటలు సమీపంలోవున్న కార్యాలయానికి వ్యాపించాయి" అని చెప్పారు. సుమారు పదిహేను బైక్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ ఈ ఘటనపై మాట్లాడుతూ సమీపంలోవున్న కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమౌతుండగా ఐపిఎఫ్‌టి కార్యకర్తలు వాహనాలకు నిప్పు పెట్టారని అన్నారు. ఈ ఘటనలో ఏడుగురు కార్యకర్తలు గాయపడ్డారని, 25 నుంచి 27 బైక్‌లు తగలబడి ఉంటాయని చెప్పారు. బిజెపి, ఐపిఎఫ్‌టిలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని బిజన్ విమర్శించారు.

వర్ణిక కేసులో వికాస్‌కు రెండు రోజులు పోలీసు కస్టడీ



న్యూఢిల్లీ : వర్ణిక కుందు వేధింపుల కేసులో నిందితులైన వికాస్, అతని మిత్రుడు అశిష్‌లకు కోర్టు రెండు రోజులు పోలీసు కస్టడీ విధించింది. హర్యానాకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి కుమార్తె వర్ణిక కుందును కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారన్న అభియోగాలపై వారిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో వికాస్ హర్యానా బిజెపి అధ్యక్షులు సుభాష్ బరాల కుమారుడన్న సంగతి తెలిసిందే. నిందితులిద్దరిని పోలీసులు గురువారం కోర్టులో హాజరు పరిచారు. దాదాపు మూడు గంటల పాటు పోలీసులు ఇద్దరిని ప్రశ్నించారు. ఆ తరువాత ఇద్దరిపైన ఐపిసిలోని సెక్షన్ 365, 511 కింద నాన్ బెయిలబుల్ అభియోగాలను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఇప్పటికే వేధింపులు, అక్రమంగా నిర్బంధించేందుకు ప్రయత్నించడం, ఆల్కహాల్ సేవించి డ్రైవ్ చేయడం తదితర అభియోగాలపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. కాగా వికాస్ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు నిరాకరించారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చండీఘడ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికలోపేర్కొంది. రక్తపరీక్ష, యూరిన్‌పరీక్షలకు సహకరించలేదని పేర్కొంది. అయితే నిందితులలో ఒకడైన అశిష్ కుమార్ ఒక స్టోర్ వద్ద ఆల్కహాల్ కొనుగోలు చేసినట్లు ఒక సిసిటివి ఫుటేజ్‌లో ప్రత్యేకంగా రికార్డై ఉంది. అంతకుముందు ఈ వారారంభంలో వికాస్ తండ్రి సుభాష్ బరాల మాట్లాడుతూ వర్ణిక తనకు కూతురు లాంటిదని, తన కుమారుడిపై పోలీసులు తగిన చర్య తీసుకుంటారన్నారు. పోలీసులకు కట్టుబడి ఉండాలని తాను వికాస్‌కు చెప్పినట్లు తెలిపారు. వికాస్ చండీఘడ్‌లో లేనందువలన ఎక్కడున్నా తిరిగొచ్చి పోలీసులకు లొంగిపోవాలని కోరానన్నారు. అంతకుముందు కూడా పోలీసులు వికాస్‌ను పిలిపించిన సమయంలో వెళ్ళి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చాడని చెప్పారు.

కేరళలో ఆరెస్సెస్ పన్నాగాలు పారవు

పీపుల్స్ డెమొక్రసీ స్పష్టీకరణ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

కేరళలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ఆరెస్సెస్ పన్నుతున్న పన్నాగాలు ఏ మాత్రం ఫలించబోవని సిపిఎం అధికార పత్రిక పీపుల్స్ డెమొక్రసీ (పి.డి) స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో విఫలమైన ఆరెస్సెస్-బిజెపి కూటమి కేరళ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం కార్యకర్తలపై హింసాత్మక దాడులు ప్రారంభించిందని పి.డి తన తాజా సంచిక సంపాదకీయంలో విమర్శించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే పినరయి విజయన్ నియోజకవర్గంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న రవీంద్రన్ అనే సిపిఎం కార్యకర్తను ఆరెస్సెస్ గూండాలు హత్య చేశారు. సిపిఎంను ఇరుకున పెట్టి, లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచే ప్రయత్నాలలో విఫలమైన ఆరెస్సెస్-బిజెపి కూటమి రాష్ట్రంలో తమ కార్యకర్తలపై మార్క్సిస్టుల హింస పెరిగిపోతోందంటూ జాతీయ స్థాయిలో గగ్గోలు పెట్టటం విడ్డూరంగా వుంది. తిరువనంతపురం హింసాకాండ జ్ఞాపకాల తెరమరుగు కాకముందే బిజెపి రాష్ట్ర విభాగాన్ని చుట్టుముట్టిన అవినీతి ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. భారతీయ వైద్య మండలి నుండి క్లియరెన్స్ ఇప్పించేందుకు ఒక వైద్య కళాశాల యాజమాన్యం నుండి బిజెపి రాష్ట్ర నేత ఒకరు భారీ మొత్తంలో ముడుపులు అందుకున్న వ్యవహారం చిలవలు పలవలై బిజెపిలోనే ఆరోపణలు-ప్రత్యారోపణల పర్వానికి తెరతీసింది. తమ పరువు తీసిన ఈ కుంభకోణం నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరెస్సెస్-బిజెపి కూటమి సిపిఎం నేతల ఇళ్ళ, పార్టీ కార్యాలయాలపై దాడులకు తెరతీసింది. ఆరెస్సెస్ కార్యకర్త హత్యకు సిపిఎం కారణమని ఆరోపించటం కేవలం రాజకీయమే తప్ప మరొకటి కాదు. స్థానిక మార్కెట్ అదుపు చేసే విషయం జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ హత్య జరిగింది తప్ప సిపిఎంకు దీనితో ఎటువంటి సంబంధమూ లేదు. అయితే తన మాతృసంస్థ ఆదేశాలతో బిజెపి సిపిఎం పై అసత్య ప్రచారం ప్రారంభించి ఆరెస్సెస్ కార్యకర్తలను హత్య చేస్తున్నారంటూ గగ్గోలు పెడుతోంది. వీరు ఎంత గగ్గోలు పెట్టినా వాస్తవాలను మరుగుపర్చలేరు. కేరళ పోలీసు విభాగం అధికారిక లెక్కల ప్రకారం 2000, 2017 సంవత్సరాల మధ్య కాలంలో జరిగిన ఘర్షణల్లో 85 మంది సిపిఎం కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా 65 మంది ఆరెస్సెస్-బిజెపి కార్యకర్తలు మరణించారు. ఎవరు ఎవరిపై దాడులు చేస్తున్నారో, ఎవరు ఎవరిని హత్య చేస్తున్నారన్న విషయాన్ని ఈ లెక్కలే మన కళ్లకు కడుతున్నాయి. గత ఆదివారం కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తిరువనంతపురం సందర్శించటం ఆరెస్సెస్ దూకుడుకు వంతపాడేందుకు ఉద్దేశించినదే. కేంద్ర ప్రభుత్వంలోని ఒక సీనియర్ మంత్రి ఈ విధంగా వ్యవహరించటం రాష్ట్రంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు అద్దం పడుతోంది. రాష్ట్రంలో ఘర్షణలకు తెరదించి, శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వానికి పూర్తి అవగాహన వుండటమే ఇందుకు కారణం. వాస్తవానికి జైట్లీ రాష్ట్రంలో పర్యటించిన రోజే రాజకీయ ఘర్షణలకు తెరదించేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ నెల 6న అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశారు. దీనికి ముందు ఇటీవల ఘర్షణలు జరిగిన మూడు జిల్లాల్లో ఇరుపార్టీల మధ్య చర్చలు జరిగిన తరువాత రాష్ట్ర స్థాయిలో సైతం ముఖ్యమంత్రి చొరవతో ఇరుపార్టీల మధ్య చర్చలు జరిగాయి. కేరళలో, ముఖ్యంగా కన్నూర్ జిల్లాలో ఆరెస్సెస్ మూకలు దేశంలోని ఇతర ప్రాంతాల్లో హిందుత్వ శక్తులు మునుపెన్నడూ చేపట్టని రీతిలో హింసాత్మక చర్యలు ఎందుకు చేపడుతున్నాయన్న విషయాన్ని దేశం తెలుసుకోవాల్సిన అవసరం వుంది. కన్నూర్ జిల్లా గత నాలుగు దశాబ్దాలుగా ఆరెస్సెస్ దాడులతో అట్టుడుకుతోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ తరహా వాతావరణం గత మూడేళ్ల నుండే కన్పిస్తోంది. కల్బుర్గి, పన్సారే వంటి మేధావుల హత్యలు, గోగూండాల హత్యాకాండ ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఇప్పుడు కన్పిస్తున్న వ్యత్యాసం అంతా కేరళలోనూ, కన్నూర్‌లోనూ సిపిఎం, ఇతర వామపక్ష శక్తులనుండి ఎదురవుతున్న వ్యవస్థీకృత ప్రతిఘటనను ఆరెస్సెస్-బిజెపి కూటమి ఎదుర్కోవాల్సి రావటమే. ఇటువంటి హింసాత్మక పన్నాగాలు కేరళలో పారవన్న విషయాన్ని ఆరెస్సెస్ తెలుసుకోవాల్సిన అవసరం వుందని, కేరళ ప్రజలు ఇటువంటి కుట్రలను తిప్పికొడతారని పీపుల్స్ డెమొక్రసీ తన సంపాదకీయంలో స్పష్టం చేసింది.

ఆత్మవిమర్శ అవసరం

కాంగ్రెస్ నేత మణి శంకర్ అయ్యర్

న్యూఢిల్లీ: ప్రస్తుత పరిస్థితిపై కాంగ్రెస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి మణి శంకర్ అయ్యర్ అన్నారు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. ఇటీవల మరో సీనియర్ నేత జైరాం రమేష్ కూడా ఇదే సూచన చేసిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య 44కు పడిపోయిందని, ఇటీవల కాలంలో చాలా ఓటములు ఎదుర్కొన్నామని మణి శంకర్ పేర్కొన్నారు. కొత్త ఆలోచనలు, పనిచేసే విధానాలు అవలంభించాలని పిలుపునిచ్చారు.

కేరళ మున్సిపాలిటీలో ఎల్‌డిఎఫ్ గెలుపు

వరసగా ఐదోసారి కైవసం

కన్నూర్ : కేరళలోని మత్తన్నూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) విజయ కేతనం ఎగరవేసింది. వరుసగా ఐదోసారి ఈ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. మొత్తం 35 వార్డులకుగానూ 28 వార్డులను ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)కు ఏడు వార్డులు మాత్రమే దక్కాయి. గత ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ 21 స్థానాల్లోనూ, యుడిఎఫ్ 13 స్థానాల్లోనూ విజయం సాధించాయి. ఈ సారి ఎన్నికల్లో మొత్తం 112 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 82.91 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం వార్డులు 35కు ప్రకటించిన ఫలితాల్లో ఎల్‌డిఎఫ్ 28 స్థానాలు గెలుచుకుంది. ఈ కూటమిలో సిపిఎం- 24, సిపిఐ-1, సిఎంపి-1, ఐఎన్ఎల్-1, జనతాదళ్(ఎస్)-1 వార్డులు సాధించాయి. యుడిఎఫ్ కూటమిలో కాంగ్రెస్‌కు 4, ముస్లిం లీగ్‌కు 3 వార్డులు లభించాయి.

పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా బీమా చేయొద్దు

ఇన్సూరెన్స్ కంపెనీలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పియుసి) సర్టిఫికెట్ లేకుండా వాహనాలకు బీమాను పునరుద్ధరించవద్దని ఇన్సూరెన్స్ కంపెనీలకు సుప్రీంకోర్టు ఆదేశాల్చింది. నేషనల్ కాపిటల్ రీజన్ (ఎన్‌సిఆర్) పరిధిలోని అన్ని ఇంధన రీఫిల్లింగ్ కేంద్రాల వద్ద పియుసి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖను జస్టిస్ మదన్ బి లకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఈ పియుసి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి నాలుగు వారాల గడువును ఇచ్చింది. కాలుష్య నివారణ కోసం ప్రముఖ పర్యావరణ వేత్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ కాలుష్య నియంత్రణ సంస్థ (ఈపిసిఎ) సూచనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

పెండింగ్‌లో 6,400కు పైగా అవినీతి కేసులు

న్యూఢిల్లీ : దేశంలో వివిధ కోర్టుల్లో 6,400కు పైగా అవినీతి కేసులు పెండింగ్‌లో వున్నాయని, సిబిఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసుల్లో 115 కేసులు రాజకీయ నాయకులపై వున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ ఏడాదిలో జూన్ వరకూ 339 అవినీతి కేసులను సిబిఐ నమోదు చేసింది. ఇందులో 487 కేసులు ప్రభుత్వ ఉద్యోగులపైనా, 660 కేసులు ప్రైవేటు వ్యక్తులపైనా, 14 కేసులు రాజకీయ నాయకులపైనా వున్నట్లు మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభలో లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. 2016లో మొత్తం 2,842 మందిపై 673 అవినీతి కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇందులో ఆరుగురు రాజకీయ నేతలు వున్నారు. 2015లో 5,957 మందిపై 617 అవినీతి కేసులు నమోదు చేయగా, అందులో 21 మంది రాజకీయ నాయకులు వున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి మొత్తం 6,414 కేసులు పెండింగ్‌లో వున్నాయన్నారు. ఈ కేసుల్లో 16,875 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 18,780 మంది ప్రైవేటు వ్యక్తులు, 115 మంది రాజకీయ నాయకులు నిందితులుగా వున్నారని మంత్రి తెలిపారు. గత రెండేళ్లల్లో 1,800 అవి నీతి కేసుల్లో ఫలితం వచ్చిందన్నారు. 2015లో 878, 2016లో 1,005 కేసుల్లో విచారణ పూర్తయింది. ఈ ఏడాదిలో జూన్ 30 నాటికి 199 కేసులో విచారణ పూర్తయిందని, ఇందులో మొత్తం 420 మంది దోషులుగా తేలారన్నారు. ఇందులో 228 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 192 మంది ప్రైవేటు ఉద్యోగులు వున్నారు.

ఆశలు రేపుతున్న 'సింధు జలాల' చర్చలు

ఇస్లామాబాద్: భారత్ పాకిస్తాన్ మధ్య అమలులో వున్న సింధునదీ జలాల ఒప్పందంపై తలెత్తిన వివాదాల పరిష్కారానికి ఇటీవల వాషింగ్టన్‌లో ప్రారంభమైన చర్చలు ఆశలు రేపుతున్నాయని పాక్ మీడియా తన వార్తా కథనాలలో పేర్కొంది. ఇరుదేశాల ప్రతినిధి వర్గాలు కేవలం తమ ప్రభుత్వాల వైఖరిని చెప్పటానికి బదులు నిర్మాణాత్మక చర్చలు జరిపాయని ఈ చర్చలను నిశితంగా గమనిస్తున్న నిపుణులను ఉటంకిస్తూ 'డాన్ న్యూస్' తన వార్తా కథనాలలో పేర్కొంది. గతంలో చర్చలు జరిగిన సందర్భాలలో ఇరువర్గాలూ కనీసం పరస్పర అభివాదాలు కూడా చేసుకోకుండా కేవలం తమవెంట తెచ్చిన ప్రకటనలను చదివి వెళ్లిపోయేవారని, ఇప్పుడు మాత్రం పరిస్థితి భిన్నంగా వుందని ఆ నిపుణులు వివరిస్తున్నారు. భారత్-పాక్ మధ్య ఇటీవల వాషింగ్టన్‌లో నిర్మాణాత్మకంగా జరిగిన చర్చలు ఇరుదేశాల మధ్య తలెత్తిన వివాదానికి సామరస్య పూర్వక పరిష్కారం లభిస్తుందన్న ఆశలు రేకెత్తించాయని కొందరు దౌత్యవేత్తలను ఉటంకిస్తూ ఈ కథనంలో పేర్కొన్నారు. సింధు నదీ జలాల ఒప్పంద వివాదంపై వాషింగ్టన్‌లో భారత్-పాక్ దేశాల కార్యదర్శుల స్థాయి భేటీ గత వారం జరిగిన విషయం తెలిసిందే. భారత్ జమ్మూ కాశ్మీర్‌లో నిర్మిస్తున్న కిషన్ గంగా (330మె.వా) రాట్లే (850 మె.వా) జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పాకిస్తాన్ వ్యతిరేకిస్తోందని ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

ఉత్తర కొరియాపై అమెరికాకు మద్దతిస్తాం

బ్రిటన్ ప్రకటన

లండన్ : ఉత్తర కొరియాపై ఒత్తిడిని కొనసాగించేందుకు అమెరికా, ఇతర అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేస్తామని బ్రిటన్ బుధవారం ప్రకటించింది. ఈమేరకు బ్రిటన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రకటన చేస్తూ, ఉత్తర కొరియా వ్యవహార శైలిని ఇప్పటికే తాము నిర్ద్వంద్వంగా ఖండించామని తెలిపింది. ఉత్తర కొరియా తన అణ్వాయుధ కార్యక్రమంతో ముందుకు సాగకుండా ఆంక్షలు విధించేందుకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాల ద్వారా కూడా మద్దతిచ్చామని ఆ ప్రకటన పేర్కొంది. ఉత్తర కొరియాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడుతూ హెచ్చరికలు జారీ చేసిన వెంటనే బ్రిటన్ ప్రభుత్వ ప్రకటన వెలువడింది. ట్రంప్ బెదిరింపులను, వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇవి అమెరికా, ఉత్తర కొరియాల మధ్య తరుచుగా సాగేవేనని జర్మనీ వ్యాఖ్యానించింది. ఇయు కూడా ఇదే తరహాలో వ్యాఖ్యలు చేసింది. దానికి భిన్నంగా బ్రిటన్ మాత్రం తన మద్దతును ట్రంప్‌కి ప్రకటించింది.

ట్రంప్ ప్రచార బృందం మాజీ చైర్మన్ ఇంటిపై ఎఫ్‌బిఐ దాడి



వాషింగ్టన్ : అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ ప్రచార బృందం చైర్మన్ పాల్ మాన్‌ఫోర్ట్ ఇంటిపై గత జులైలో ఎఫ్‌బిఐ ఏజెంట్లు దాడి చేశారని మంగళవారం వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. సెనెట్ ఇంటెలిజెన్స్ కమిటీ సిబ్బందితో మాన్‌ఫోర్ట్ స్వచ్ఛందంగా సమావేశమైన కొద్ది సేపటికే జులై 26వ తేదీ బుధవారం తెల్లవారు జామున ఈ దాడి జరిగిందని పత్రిక తెలిపింది. న్యాయ శాఖకి చెందిన ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లర్ నుండి తీసుకున్న సెర్చ్ వారంట్‌తో ఈ దాడి చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై జరుగుతున్న ఫెడరల్ దర్యాప్తుకు ముల్లర్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ దాడిలో కొన్ని ముఖ్యమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నారని, వాటిని వెంటనే కాంగ్రెస్ దర్యాప్తు అధికారులకు అప్పగించారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఈ దాడికి కచ్చితమైన కారణం స్పష్టంగా తెలియ రాలేదు. అయితే సెనెట్ సిబ్బందితో సమావేశం నిర్వహించడం ద్వారా మాన్‌ఫోర్ట్ అప్రమత్తమై వుంటారని ముల్లర్ భావిస్తున్నారు. రష్యా జోక్యంపై దర్యాప్తులో మాన్‌ఫోర్ట్, ఇతర సాక్షులను నిలువరించేందుకు ఈ దాడి ఉద్దేశించిందనడానికి కూడా అవకాశాలు వున్నాయని భావిస్తున్నారు. కాగా మాన్‌ఫోర్ట్ ఇప్పటికే తన వద్ద గల సంబంధిత పత్రాలను సెనెట్ జ్యుడీషియరీ కమిటీకి, ఇంటెలిజెన్స్ కమిటీకి అందచేశారు.

అమెరికాలో పెరుగుతున్న డ్రగ్స్ మరణాలు

- ఐదేళ్ళలో ఐదు లక్షలమంది మృత్యువాత
- మారణాయుధాలు, రోడ్డు ప్రమాదాల కన్నా ఇవే ఎక్కువ
- జాతీయ ఆరోగ్య గణాంకాల కేంద్ర నివేదిక వెల్లడి



వాషింగ్టన్ : అమెరికాలో మాదకద్రవ్యాలను అతిగా వాడడం వల్ల సంభవిస్తున్న మరణాల సంఖ్య తీవ్రంగా పెరుగుతోందని జాతీయ ఆరోగ్య గణాంకాల కేంద్రం ఒక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది జనవరితో ముగిసే ఏడాది కాలానికి ఈ కారణం వల్ల దేశంలో 64,070 మరణాలు సంభవించాయని తెలిపింది. అంతకుముందు ఏడాది 52,898 మరణాలు సంభవించగా ఈ ఏడాది 21శాతం పెరిగాయని పేర్కొంది. అంటే రోజుకు 175మంది మరణిస్తున్నారని తెలిపింది. 2వేల సంవత్సరం నుండి 2015 మధ్య కాలంలో 5లక్షల మందికి పైగా అమెరికన్లు మాదకద్రవ్యాలను అతిగా తీసుకోవడం వల్ల మరణించినట్లు వివిధ వ్యాధుల నియంత్రణా కేంద్రాల నుండి అందిన డేటా ఆధారంగా రూపొందించిన నివేదిక పేర్కొంది. అంటే ఈ సంఖ్య, కాలిఫోర్నియాలోని శాక్రామెంటో జనాభాతో దాదాపు సమానం. 20, 21వ శతాబ్దాల్లో అమెరికా జరిపిన అన్ని యుద్ధాల్లో (అంటే మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు, కొరియా, వియత్నాం, గల్ఫ్ యుద్ధాలు, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలను కలుపుకుని) మరణించిన వారితో పోల్చుకుంటే 21వ శతాబ్దంలో మాదకద్రవ్యాలు అతిగా సేవించడంతో మృతి చెందిన వారి సంఖ్యే ఎక్కువ అని ఆ నివేదిక తెలిపింది. ఇంతటి మానవ వినాశనానికి కారణం నివారించలేని, ఊహించనలవి కాని వ్యాధి కాదు, అలా అని ఇవన్నీ సహజ సిద్ధమైన మరణాలూ కాదు, కేవలం సామాజిక అంటువ్యాధి, జీవన ప్రమాణాలు కుప్పకూలడం వల్ల తలెత్తిన పరిస్థితుల ప్రభావం, లక్షలాది మంది కార్మికుల ఉద్యోగాలు ఊడిపోవడం. ఫ్యాక్టరీలు, మిల్లులు మూతపడడం, పట్టణాలకు పట్టణాలు నిర్మానుష్యంగా మారడం, స్కూళ్ళు, ఆస్పత్రులు మూసేయడం, నిరుద్యోగం విశృంఖలంగా పెరిగిపోవడం, దొరికిన చిరు ఉద్యోగం కూడా కనీస అవసరాలను తీర్చలేకపోవడం, దాంతో బతకడం కోసం రెండు, మూడు ఉద్యోగాలు చూసుకోవడం ఇదీ ప్రస్తుతం అమెరికా పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితి. 2008లో ఆర్థిక మాంద్యం అనంతర దశాబ్ద కాలంలో సామాజిక అసమానతలు ఊహించని స్థాయికి ఎదిగిపోయాయి. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాల ప్రభావాన్ని అర్థం చేసుకోవాల్సి వుంది. గతంలో మాదకద్రవ్యాల బారిన పడేవారు వయస్సు మళ్ళినవారో, లేక సామాజికంగా ఏకాకులైన వారికో పరిమితమయ్యేది. కానీ ప్రస్తుతం 25నుండి 44 ఏళ్ళ మధ్యలోని వారే మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. ఐదేళ్ళ కాల వ్యవధిలో అమెరికన్ కార్మికుల్లో గణనీయమైన సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారని నివేదిక పేర్కొంది. మారణాయుధాలు, రోడ్డు ప్రమాదాల కన్నా మాదకద్రవ్యాల బారినపడే ఎక్కువ మంది మరణిస్తున్నారు.



వెనిజులా సంక్షోభానికి పరిష్కారాలపై వర్క్‌షాప్

కారకస్ : వెనిజులా ఎదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనేందుకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు, దేశ ఆర్థిక మండలి సభ్యులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఉత్పత్తుల ధరల విధానాలను, సేవలను మరింత పటిష్టపరిచేందుకు, మారకపు రేట్లు, ఇతర సంబంధిత అంశాలను చర్చించేందుకు చర్యలు తీసుకోవాలంటూ అధ్యక్షుడు మదురో ఇచ్చిన పిలుపు మేరకు ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేసినట్లు జాతీయ రాజ్యాంగ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అరిస్టుబులో ఇస్తూరిజ్ తెలిపారు. దీంతో పాటు ఈ వర్క్‌షాపులో మరో రెండు ప్రతిపాదనలను కూడా ఆమోదించినట్లు చెప్పారు. ఇందులో వెనిజులాలో శాంతి పునరుద్ధరణకు హామీ కల్పించే రాజ్యాంగ బిల్లు వుందని తెలిపారు. వాస్తవం, న్యాయం, శాంతి కమిషన్‌కు సంబంధించిన బిల్లు – లా ఆఫ్ కమిషన్ ఆఫ్ ది ట్రూత్, జస్టిస్‌కు అసెంబ్లీ సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతిచ్చారని ఉపాధ్యక్షుడు చెప్పారు. రాజకీయ హింసాకాండ బాధితులకు రక్షణ కల్పించడం, వారికి న్యాయం జరిగేలా చూడడం ఈ చట్టం విధి. దేశం లోపల, వెలుపల పలు శక్తుల నుండి దాడులను ఎదుర్కొంటున్న అధ్యక్షుడు మదురోకి మద్దతును, సంఘీభావాన్ని తెలుపుతూ తీర్మానం కూడా ఆమోదించినట్లు తెలిపారు. వెనిజులా ప్రజల ప్రయోజనాలకు మద్దతుగా బొలీవియా జాతీయ సాయుధ బలగాల (ఎఫ్‌ఎఎన్‌బి) తోడ్పాటును వ్యవస్థీకృతం చేస్తూ రెండో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు.

మానవాళిపైనే దాడి ఇది

ఉత్తరకొరియాపై ట్రంప్ వైఖరికి బొలీవియా ఖండన

లాపాజ్ : ఉత్తర కొరియాపై దాడికి సిద్ధమని ట్రంప్ చేస్తున్న బెదిరింపులు మొత్తంగా మానవాళిపై జరుగుతున్న దాడిగా బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్ బుధవారం హెచ్చరించారు. ఇటువంటి వైఖరిని తిరస్కరించాల్సిందిగా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ట్రంప్ వైఖరి మొత్తంగా మానవాళినే అవమానించేలా వుందని మొరేల్స్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇటువంటి యుద్ధాల్లో సామ్రాజ్యవాదులే గెలుపొందుతారని, ప్రజలెప్పుడూ నష్టపోతూనే వుంటారని మొరేల్స్ వ్యాఖ్యానించారు. ట్రంప్ తీసుకున్న ఈ దూకుడు వైఖరికి ప్రపంచ దేశాలు కళ్ళెం వేయాలని కోరారు. అమెరికా బెదిరింపులను ప్రస్తావిస్తూ ఆయన, శాంతి, సామాజిక న్యాయం కోసం ముందుగా చర్చలు జరపాలని అన్నారు. మంగళవారం ట్రంప్ విలేకర్లతో మాట్లాడుతూ, అమెరికాను బెదిరించడాన్ని ఉత్తర కొరియా వెంటనే విరమించడం మంచిది, లేనిపక్షంలో ప్రపంచ దేశాలు ఇంతకుముందె న్నడూ చూడని తీవ్ర పర్యవసానాలు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

సౌదీ ఆరోపణలను ఖండించిన ఇరాన్

టెహరాన్ : తాలిబాన్ తీవ్రవాదులతో, ఆఫ్ఘనిస్తాన్‌లోని సాయుధ గ్రూపులతో ఇరాన్‌కు సంబంధాలు వున్నాయని సౌదీ దౌత్యవేత్త చేసిన ఆరోపణలను కాబూల్‌లోని ఇరాన్ ఎంబసీ కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలని పేర్కొంది. సౌదీ దౌత్యవేత్త మిషారి అల్ హర్బి చేసిన విచ్ఛిన్నకర మైన ఈ వ్యాఖ్యలకు ఎలాంటి ప్రాతిపదిక లేదని, వాటిని తాము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తీవ్రవాదానికి, హింసాకాండకు తమ దౌత్యవేత్తలే బాధితులుగా మారుతున్నారని ఆ ప్రకటన తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి, సుస్థిరతలకు మద్దతివ్వడమే తమ ప్రధాన విధానమని ఇరాన్ ఇప్పటికే స్పష్టం చేసిందని పేర్కొంది.


వెనిజులాపై మరిన్ని ఆంక్షలు

- చావెజ్ సోదరుడితో సహా రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులపై కఠిన చర్యలు
- మదురోపై అదనపు ఆంక్షలు

కారకస్ : ఇటీవల ఏర్పడిన వెనిజులా రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఆర్థిక శాఖ బుధవారం కొత్త ఆంక్షలను విధించింది. ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో వెనిజులా మాజీ అధ్యక్షుడు హ్యుగో ఛావెజ్ సోదరుడు, అసెంబ్లీ భద్రతా వ్యవహారాల ఇన్‌చార్జి అయిన సైనికాధికారి, జాతీయ ఎన్నికల సంస్థకి చెందిన అధికారి వున్నారు. చావెజ్ సోదరుడు అడన్ ఛావెజ్ కొత్తగా ఏర్పడిన అసెంబ్లీ కార్యదర్శిగా వున్నారు. కాగా, వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై అమెరికా ఇప్పటికే ఆంక్షలు విధించింది. అమెరికాలోని ఆయన ఆస్తులను స్తంభింప చేయడం, ఆ దేశానికి ప్రయాణించడంపై నిషేధం విధించింది. వెనిజులాతో అమెరికన్లు ఎవరూ వాణిజ్య సంబంధాలు పెట్టుకోరాదని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జులై 30న రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందుగా 13మంది మాజీ, ప్రస్తుత అధికారులపై ఆంక్షలు విధించింది. బుధవారం అమెరికా ఆర్థిక శాఖ మదురోపై అదనపు ఆంక్షలను విధించింది. ఈ దేశంపై తన పట్టును మరింత బిగించడానికి మదురో చర్యలు తీసుకుంటున్నారని అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ నుచిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనిజులా ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆమోదయోగ్యం కానివని ఆ ప్రకటన పేర్కొంది. దేశంలో శాంతిని పునరుద్ధరించేందుకు, దేశ ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు కొత్త రాజ్యాంగం అవసరమని పేర్కొంటూ మదురో రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. తమ దేశ వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని మదురో పదే పదే ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా తమ దేశంపై విధించిన ఆంక్షలపై వెనిజులా విదేశాంగ మంత్రి జార్జి అరెజా తీవ్రంగా స్పందించారు. ప్రపంచ దేశాల ముందు అమెరికా తనను తాను ఫూల్‌ని చేసుకుంటోందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాల మౌలిక సూత్రాలను, ప్రామాణికాలను అమెరికా గౌరవించదని అరెజా టెలివిజన్‌లో ప్రసంగిస్తూ పేర్కొన్నారు.

విశ్వాస పరీక్షలో నెగ్గిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు

ప్రతిపక్షంతో చేతులు కలిపిన 21మంది పాలక పక్ష సభ్యులు



ప్రిటోరియా : దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా పార్లమెంట్‌లో జరిగిన మరో విశ్వాస పరీక్షలో నెగ్గారు. అయితే మొట్ట మొదటిసారిగా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి)కి చెందిన 20మందికి పైగా పార్లమెంట్ సభ్యులు జుమాకు వ్యతిరేకంగా ఓటు వేశారని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. రహస్య ఓటును ఉపయోగించుకుని 249మంది ఎఎన్‌సి పార్లమెంట్ సభ్యులు కొందరు ప్రతిపక్షం ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు తెలిపారు. అధికారికంగా వెలువరించిన నివేదిక ప్రకారం మొత్తంగా 384మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా 177మంది జుమా పదవీచ్యుతుడిని చేయడానికి అనుకూలంగా ఓటు వేశారు. 198మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. 9మంది గైర్హాజరయ్యారు.

మొదటి పేజీ తరువాయి

మెడికల్ హబ్‌గా అమరావతి

కేంద్రం ఏర్పాటు అవుతాయన్నారు. త్వరలో రాష్ట్రంలో 13 వైద్య కళాశాలలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. గల్ఫ్ దేశాలు, దుబాయ్‌తోపాటు పలు దేశాల్లో 13 వైద్య సంస్థలను ప్రారంభించిన ఘనత బిఆర్ శెట్టి సంస్థకు ఉందన్నారు. అమరావతిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని సాయంత్రానికి గుంటూరు, విజయవాడ వెళ్లిపోతే ఈ ప్రాంతం దయ్యాల నగరంగా మారుతుందన్నారు. అందుకు భిన్నంగా అన్ని విధాలా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసి ఇక్కడ వారు ఎక్కడికీ వెళ్లకుండా అన్ని ప్రాంతాల వారినీ ఇక్కడికి రప్పిస్తామని స్పష్టం చేశారు. ప్రపంచమంతా ఇక్కడికి రావాలని, అన్ని ప్రాంతాలతో అమరావతి అనుసంధానం చేస్తామని చెప్పారు. అమరావతి నుంచి నేరుగా విమానం నడిపేలా కృషి చేస్తున్నామన్నారు. దీని వల్ల ప్రపంచంతో సంబంధాలు పెరుగుతాయన్నారు. ఇక్కడ నుంచి ఎవ్వరూ విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, అన్ని దేశాల్లో ఉన్న తెలివైన వారే ఇక్కడికి వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని వివరించారు. గన్నవరం ఎయిర్‌పోర్టు ఇప్పటికే అభివృద్ధి చెందిందని ఇంకా విస్తరించాల్సి ఉందని చెప్పారు. ఇదిలా ఉండగా సభలో ప్రసంగిస్తుండగా చంద్రబాబునాయుడు స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో ఆయన ప్రసంగాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. కేవలం 21 నిమిషాలు మాత్రమే మాట్లాడి ముగించారు. ఐదు నిమిషాలు వేదికపై ఏర్పాటుచేసిన కుర్చీలో అలాగే కూర్చొండిపోయారు. తరువాత క్రమంగా తేరుకుని మెమెంటోల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సచివాలయానికి చేరుకున్నారు. ఈ సభలో పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, పద్మశ్రీ బిఆర్ శెట్టి, సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

జెడియులో చీలిక!

నితీశ్ కుమార్ ఇప్పటివరకూ స్పందించకపోయినా, జెడి(యు) అధికార ప్రతినిధి కెసి త్యాగి స్పందించారు. ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, పార్టీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెడుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో శరద్‌పవార్‌పై వేటు పడే అవకాశముందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాగట్‌బంధన్'కు ఐదేళ్ల అధికారాన్ని ఇస్తూ ఓటు వేసిన 11 కోట్ల మంది ప్రజల నమ్మకానికి తూట్లు పొడిచారని జెడి(యు) వ్యవస్థాపకుడు శరద్ యాదవ్ విమర్శలు చేశారు. మహా కూటమిలో చీలికలు అనంతరం బిజెపితో మరోసారి చేతులు కలిపి సిఎం పీఠాన్ని చేజిక్కించుకున్న నితీశ్ కుమార్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల మద్దతు కూడగట్టే లక్ష్యంతో గురువారం నుంచి 'జన్ సంవాద్' అనే యాత్రను ప్రారంభించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మూడు రోజుల పాటు సాగనున్న ఈ యాత్రలో భాగంగా తొలి రోజు సోనేపూర్, హజిపూర్ జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించారు. పది జిల్లాల్లో ఈ యాత్ర నిర్వహిస్తామని, జెడి(యు)–బిజెపి ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామని శరద్‌యాదవ్ చెప్పారు. మరోవైపు ఈ యాత్రకు నితీశ్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీనిపై స్పందించిన శరద్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ "మహాగట్‌బంధన్ విజయం..ప్రజలతో కుదుర్చుకున్న ఐదేళ్ల ఒప్పందం లాంటిది. దానికి కొంతమంది తూట్లు పొడిచారు. ఇప్పుడు ఏం చెయ్యాలన్నదానిపై తెలుసుకునేందుకే ప్రజల్లోకి వెళుతున్నాం" అని అన్నారు. 'సమాజ్‌వాది జన్ మోర్చా' అనే రాజకీయేతర సంస్థ ఈ యాత్రను నిర్వహించడం విశేషం. అయితే శరద్‌యాదవ్ యాత్ర, వ్యాఖ్యలపై కెసి త్యాగి స్పందించారు. బహిరంగ వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేసే బదులు పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సమావేశంలో తన వాదన తెలిపితే బాగుంటుందని చెప్పారు. జెడి(యు) ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాస్థాయి నేతలందరూ నితీశ్ కుమార్‌తోనే ఉన్నారని, జన్ సంవాద్ కార్యక్రమానికి ఆర్జేడీనే సహాయం చేసిందని చెప్పారు.

యాత్రకు అనుమతి నిరాకరించిన నితీశ్ ప్రభుత్వం

మరోవైపు శరద్‌యాదవ్‌ను అడ్డుకోవడానికి నితీశ్ కుమార్ వర్గం ప్రయత్నిస్తోంది. అనుమతి నిరాకరించడంతో పాటు మరోవైపు యాత్రకు దూరంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు ఆదేశించింది. "ఇది ఆయన వ్యక్తిగత యాత్ర. దీనికి పార్టీతో సంబంధం లేదు. గత కొద్ది రోజులుగా ఆయన వ్యవహరిస్తున్న తీరు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉంది" అని జెడి(యు) రాష్ట్ర చీఫ్ వశిష్ట నరైన్ సింగ్ వ్యాఖ్యానించారు. అయితే పార్టీలో అసమ్మతివాదులు శరద్‌యాదవ్‌కు దన్నుగా నిలుస్తున్నారు. మరోవైపు ఆర్జేడీ కూడా యాదవ్‌కు పరోక్షంగా మద్దతుగా నిలిచింది. తాజా పరిణామాలపై అసంతృప్తిగావున్న జెడి(యు) చీఫ్ నితీశ్ కుమార్..శరద్ యాదవ్‌పై వేటు వేసేందుకు పావులు కదుపుతున్నారు. ఆగస్టు 19న జరగనున్న జెడి(యు) జాతీయ కార్యదర్శివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. శరద్‌యాదవ్ వ్యాఖ్యలపై ఇటీవల మీడియా అడిగిన ప్రశ్నకు నితీశ్ కుమార్ బదులిస్తూ 'త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అంటూ చేసిన వ్యాఖ్యలు దీన్ని సమర్థించేలా ఉన్నాయి.

వణికిస్తున్న మలేరియా

(మొదటి పేజీ తరువాయి)

మలేరియా కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నా గణాంకాల్లో తక్కువ చేసి చూపించడంతో మలేరియా నివారణకు కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా తగ్గుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధుల నివారణకు ప్రభుత్వం దోమలపై దండయాత్ర వంటి ప్రచార ఆర్భాటాలే తప్ప రోగాల సంఖ్య మాత్రం తగ్గుముఖం పట్టడంలేదు. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా వరకు దోమతెరలు పంపిణీ చేయలేదని గిరిజన సంఘం నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అలాగే దోమల నివారణకు ప్రభుత్వం తరపున మే నుండి అక్టోబర్ వరకు రెండు విడతలుగా ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే (ఆర్ఎస్) చేయాల్సి ఉంది. ఇప్పటికి కేవలం ఒక విడత మాత్రమే స్ప్రే చేశారు. మలేరియా కేసుల విషయంలో స్క్రీనింగ్ సరిగా చేయడంలేదన్న విమర్శలు కూడా లేకపోలేదు.

డయాగ్నస్టిక్ కిట్లకూ కొరతే

డెంగ్యూ , మలేరియా వంటి కేసుల్లో రోగనిర్ధారణ చేసేందుకు క్షేత్రస్థాయిలో డయాగ్నస్టిక్ కిట్ల కొరత ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో డెంగ్యూ నిర్ధారణకు 91 కిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 7, విజయనగరంలో 6, విశాఖలో 10, తూర్పుగోదావరిలో 9, పశ్చిమగోదావరిలో 3, కృష్ణాలో 8, గుంటూరులో 8, ప్రకాశంలో 7, నెల్లూరులో 3, చిత్తూరులో 10, కడపలో 4, అనంతపురంలో 10, కర్నూలులో 6 డెంగ్యూ డయాగ్నస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.

విమర్శ లేకపోతే నిరంకుశత్వమే

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకునేందుకు ఆ హక్కును సభ్యులు ఉపయోగించుకోకూడదన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు, బృందాలకు వారి వారి హక్కులు, బాధ్యతలు ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యం ప్రత్యేకంగా మైనార్టీలకు రక్షణ కల్పిస్తే, అదే సమయంలో మైనార్టీలకు కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయన్నారు. గందరగోళాల మధ్య చట్టాలు చేయకూడదని, త్వరిత గతిన చట్టం చేయాలనుకున్నప్పుడు క్రమానుగతమైన నియంత్రణ ఉండాలని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభ ఛైర్మన్ పదవి క్రికెట్‌లో ఒక అంపైర్, హాకీలో రిఫరీలాంటిదన్నారు. అంపైర్ ఆటను, ఆటగాళ్ళను పరిశీలిస్తాడే గాని ఆటగాడు కాలేడని ఉదహరించారు. రిఫరెన్స్‌కు ఒకే ఒక ఆధారం నిబంధనావళి అన్నారు. సభలోని అన్ని విభాగాలు ప్రశంసనీయమైన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. పదేళ్ళంటే ఒక వ్యక్తి జీవితంలో ఎంతో సుదీర్ఘమైన కాలమన్నారు. సభలో ఒక ప్రముఖ సభ్యుడిచ్చిన సలహాలు తనకు ఎంతో ప్రయోజనాన్ని కలిగించాయన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా అన్సారీ వ్యవహరించిన తీరు, పోషించిన పాత్రను అంతకుముందు పలువురు సభ్యులు ప్రశంసించారు.

అన్సారీ సేవలు ప్రశంసనీయం : ప్రధాని మోడీ

రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీలో రాజకీయ వేత్త కన్నా దౌత్యవేత్త లక్షణాలే తనకు ఎక్కువగా గోచరించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. హమీద్ అన్సారీ పదవీకాలం గురువారం ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ అన్సారీ సేవలను కొనియాడారు. హమీద్ అన్సారీ ఎన్నో తీపి గురుతులను మనకు మిగిల్చారన్నారు. ఎంతో ప్రాధాన్యత గల సేవలను మనకందించారన్నారు. ఆయనలోని రాజకీయవేత్త కన్నా దౌత్యవేత్త లక్షణాలే తనను ఎంతగానో ఆకర్షించాయని మోడీ తెలిపారు. అంతకుముందు తాను ఆయనతో పలు అంశాలపై చర్చించిన సందర్భంలోనూ, ఆయనతో కలిసి పర్యటనలు జరిపిన సమయంలోనూ ఆయనలో నిబిడీకృతమై ఉన్న దౌత్య వేత్త దృష్టి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. అన్సారీ పలు దేశాలలో భారత్ దౌత్యాధికారిగా పనిచేశారు. ఐక్యరాజ్య సమితిలో భారత్ తరుపున శాశ్వత ప్రతినిధిగా వ్యవహరించారు. అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా కూడా ఆయన సేవలు అందించారు.

మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడుల నివారణకు ప్రత్యేక చట్టం

(మొదటి పేజీ తరువాయి)

నుండి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా మత విద్వేషాలు, ప్రాంతీయ వైషమ్యాలను పెంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు దేశంలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉందని తెలిపారు. దీంతో చాలా రాష్ట్రాల్లో రైతులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారి రక్షణకు ప్రత్యకమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎన్‌డిఎ అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న 70 లక్షల ఉద్యోగులను తొలగించారన్నారు. బ్యాంకింగ్, విమానయాన తదితర ప్రభు త్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేసే చర్యలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేగవంతంగా చేపట్టిందన్నారు. జిఎస్‌టి అమలుతో చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పై సమస్యలన్నింటిపైనా ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధన రాజకీయాలతో ప్రజాస్వామిక విలువలు పతనమవుతున్న తరుణంలో ఎన్నికల సంస్కరణలు అవసరమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. దామాషా పద్ధతి ఎన్నికల ద్వారా ధన రాజకీయాలకు అడ్డుకట్టవేయవచ్చునని సూచించారు. ఎన్నికల సంస్కరణల కోసం తాము పోరాటం చేయడానికి సన్నద్ధమవుతున్నామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ. రాష్ట్రంలో సమస్యలపై నిలదీసే వారిని పోలీసుల చేత అణచివేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. రాష్ట్రంలో తాము ఎక్కడికెళ్లినా పోలీసులతో ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. 'మేమేమన్నా మాఫియాలమా?' అని ఆయన ప్రశ్నించారు. పోలీసులతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేసేవి వామపక్ష పార్టీలేనని చెప్పారు. కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ పాలనను చూపించామని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల్లో ఏ ఒక్క ప్రజాప్రతినిధి పైనైనా ఆరోపణలొచ్చాయా అని చెప్పారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజాసమస్యల కంటే నంద్యాల ఉప ఎన్నికలే ఎక్కువయ్యాయన్నారు. ఈ ఎన్నికల కోసం రోజుకు రెండు గంటల సమయం వెచ్చించి సమీక్షలు చేస్తున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో తీవ్రమైన కరువుతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటి గురించి ఒక్క రోజు కూడా సమీక్ష చేయలేదని పేర్కొన్నారు.



అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న హాజరైన ప్రజలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ.. మద్యం నియంత్రణ చేపట్టమంటే అమ్మకాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీని ద్వారా మహిళలు హింసకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, దడాల సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, మిడియం బాబురావు, సిహెచ్.నరసింగరావు, రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబుళు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో భారీ ప్రదర్శన

బహిరంగసభకు ముందు అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబట్టుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాయలసీమ సబ్‌కమిటీ కన్వీనర్ జి.ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తదితరులు ప్రదర్శనకు అగ్రభాగాన నడిచారు.



నందు, ప్రగ్యాజైశ్వాల్, రకుల్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, బోయపాటి శ్రీను, మిర్యాల రవీందర్‌రెడ్డి

నిజమైన ప్రేమకు నిర్వచనమే ఈ చిత్రం

బోయపాటి శ్రీను దర్శకత్వంలో యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయ జానకి నాయక'. రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్. ఈ సినిమా శుక్రవారమే విడుదలవుతుంది. చిత్రం గురించి చిత్ర యూనిట్ అన్నపూర్ణ ఏడెకరాల స్టూడియోలో వివరాలను తెలియజేసింది.

మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటి వరకు బోయపాటి చేసిన సినిమాలన్నింటిలో 'జయజానకినాయక' బెస్ట్ మూవీ అని చెప్పగలను. ఈ మాట వినడానికి కాస్తా ఎక్కువగానే అనిపిస్తుంది. ఇప్పటి వరకు ఆయన ఆరు సినిమాలు చేశారు. అన్నింటిలోనూ ఏదో ఒక కంటెంట్ మనకు కనపడుతుంది. అలాగే ఈ సినిమాలో మంచి లవ్‌స్టోరీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఆడియెన్స్‌కు కావాల్సిన యాక్షన్ ఉన్నాయి.

సినిమాకు మంచి కథ కుదరడమే తొలి సక్సెస్. ఈ సినిమా తర్వాత రకుల్‌ప్రీత్‌ని ప్రతి ఇంటిలోని మహిళ ఓన్ చేసుకుంటారు. నిజమైన లవ్ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారు. సినిమాను తప్పకుండా ప్రేక్షకులు సూపర్‌హిట్ చేయాలని కోరుకుంటున్నాను" అన్నారు.

ప్రగ్యా జైశ్వాల్ : బోయపాటిగారి నుండి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో గ్లామరస్ రోల్ చేశాను. రిషి పంజాబ్ సినిమాను ఎంతో గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కించారు. సినిమా అందరినీ మెప్పిస్తుంది" అన్నారు.

రకుల్ ప్రీత్ సింగ్ : జానకి క్యారెక్టర్ దొరకడం అదృష్టం. సినిమా చూసిన దర్శకులు చాలా బాగా చేశానని చెప్పారు. సినిమా చూసిన వారందరికీ ఈ సినిమాలో నా క్యారెక్టర్, స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ అవుతుంది. వీటన్నింటితో పాటు ప్యూర్ లవ్‌స్టోరీ ఉంటుంది. నిజమైన లవ్, కేర్, ఎమోషన్ ఎలా ఉంటుందో ఆయన తెరపై చూపించారు. పాటలు, ఫైట్స్ అన్ని కథలో భాగంగా ఉంటుందని' అన్నారు.

బెల్లంకొండ శ్రీనివాస్ : ఇది నా సినిమా అని గర్వంగా చెప్పుకుంటాం. కెరీర్ ప్రారంభంలో ఇది నా సినిమా అని జీవితాంతం చెప్పుకునేలా ఉంటుంది. ఇలాంటి సినిమాను రీచ్ కావడమే నా తదుపరి టార్గెట్. నిర్మాత కష్టమేంటో నాకు తెలుసు. జగపతిబాబు, శరత్‌కుమార్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం ఆనందంగా ఉందని అన్నారు.

బోయపాటి శ్రీను : అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమా ఇది. లవ్, ఎమోషన్స్, యాక్షన్ అన్ని కలగలిసిన స్క్రిప్ట్ దొరకడం చాలా అరుదు. ఎ,బి, సి సెక్షన్ ఆడియెన్స్ ఒకే వరుసలో కూర్చుని చూసే సినిమా ఇది. నేను చేసిన నిర్మాతలందరితో హ్యాపీనే. అల్లు అరవింద్‌గారితో సరైనోడు సినిమా చేశాను. ఎంతో కంఫర్టబుల్ నిర్మాత. ఆ రేంజ్‌లో మిర్యాల రవీందర్‌రెడ్డి సినిమా చేశాడు. పరిశ్రమకు ఇలాంటి నిర్మాతలు ఎంతో అవసరమని అన్నారు.

ఇలాంటి సినిమా ఎవరూ తీయలేరు

రానా



ప్రపంచస్థాయిలో సినిమా సక్సెస్ రేటు ఐదు శాతంకంటే ఎక్కువేమీలేదు. ఇక మన దక్షిణాదిలో తీసుకుంటే వృద్ధిరేటును తెలుగు సినిమాద్వారానే అధిగమించాం. అది కూడా 'బాహుబలి' తర్వాత ఫోకస్ అంతా మనపైనే వుంది. భిన్నమైన కథల్ని ఎంచుకోవడంలో నాన్నగారి ప్రోత్సాహంకూడా వుంది. 'బాహుబలి', 'ఘాజీ' తర్వాత అంత విభిన్నమైన కథ 'నేనే రాజు నేనే మంత్రి' అని కథానాయకుడు రానా తెలియజేశారు. నేడే విడుదలకానున్న ఈ చిత్రం గురించి ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.

సినిమా కోసం ఎందుకింత ప్రమోషన్లు చేస్తున్నారు?

ప్రజలకు నా సినిమా ఈ రోజు వస్తుందని తెలియాలి. విడుదల తేదీ ప్రేక్షకులు ఎప్పుడూ గుర్తుండాలి. అందుకే ఇంతలా ప్రమోషన్లు చేస్తున్నాను.

సినిమా ఎలా ఉండబోతోంది ?

కొత్త తరహాలో వుండే కథ. తత్త్వం కూడా కొత్తగానే ఉంటుంది. వాటితో పాటే కమర్షియల్ అంశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి.

సినిమాకు టెక్నాలజీ ఎంతవరకు వుపయోగం?

టెక్నాలజీ వల్ల సినిమా ఆడదు. కథను బెటర్‌గా చెప్పడమనేది టెక్నాలజీ.. ఓ కథను పిక్చర్, సౌండ్‌తో చెప్పడమే సినిమా.

మీ పాత్ర ఎలా వుంటుంది?

నాది రాయలసీమలోని ఓ ప్రాంతం. వడ్డీ వ్యాపారం చేసుకునే వ్యక్తి పాత్ర. అతనికో భార్య, మావయ్య. అదే అతని లోకం. అలాంటి వ్యక్తి కొన్ని కారణాల వలన కోపంతో రాజకీయాల్లోకి వస్తాడు. రాజకీయం అంటే ఏంటో సరిగా తెలియని అతను ఎలాంటి తప్పులు చేశాడు, ఎలాంటి ఒప్పులు చేశాడు అనేదే సినిమా.

కాజల్ ఎంపికకు కారణం?

ఫస్ట్ పాయింట్ నా ఎత్తుకు తగిన నటి కావడం. అందుకే సినిమా చేద్దామని అనుకోగానే మా ఫస్ట్ చాయిస్ ఆమే. ఆమె పాత్ర చాలా బలంగా ఉంటుంది. ఆమె చుట్టూనే కథ తిరుగుతుంది. సినిమాలో జోగేంద్ర ఎలాంటి పనిచేసినా రాధ కోసమే చేస్తాడు.

మీ ఇద్దరి ట్రాక్ ఎలా ఉంటుంది?

సినిమాలో పాలిటిక్స్ అనేవి సెకండాఫ్లో వస్తాయి. మిగతా అంతా నాకు, కాజల్ కు మధ్యే జరుగుతుంది.

తేజ దర్శకత్వం ఎలా అనిపించింది?

ఈ కథని, పాత్రల్ని ఆయనకన్నా ఎవరూ గొప్పగా రాయలేరు. ఎందుకంటే ఆయన నిజ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగానే ఆయన కథని రాశారు కాబట్టి.


తక్కువకాలంలో బరువు పెరగడం, తగ్గడం జరిగింది. ఏమైనా మందులు వాడారా?

పాత్రలో రెండు షేడ్స్ వుంటాయి. ఒకటి.. కండలు పెంచేయడం.. ఆ తర్వాత పాలిటిక్స్‌లో వెళ్ళాక.. తగ్గిపోవడం.. ఇది కథలోని భాగం. దీనికోసం తక్కువ కాలంలో బాడీని తగ్గించాను. అందుకే నిక్సన్ అనే ప్రత్యేక ట్రైనర్ ఆధ్వర్యంలో తీసుకున్న జాగ్రత్తలు. మీరు సినిమాలో చూస్తే ఆరేడు సంవత్సరాల తర్వాత అనేట్లుగా ఆ పాత్రల బాడీ లాంగ్వేజ్ వుంటుంది.

మూడు సినిమా పోటీ గురించి ఏమంటారు?

ఇలాంటి సినిమా అయితే ఎవరూ తీయరు. కాబట్టి నాకెలాంటి భయం లేదు. అలాగే ఈ మూడు సినిమాలు భిన్నమైన అంశాలకు చెందినవి. కాబట్టి అన్నీ ఆడుతాయి. పైగా లాంగ్ వీకెండ్ కూడా ఉంది. వసూళ్లు కూడా బాగుంటాయి.

పొల్లాచ్చిలో శర్వానంద్



'రాధ' సినిమా తర్వాత శర్వానంద్ నటిస్తున్న చిత్రం 'మహానుభావుడు'. మారుతి దర్శకత్వంలో రూపొందుతోంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా చిత్రీకరిస్తున్న ఈ చిత్రాన్ని అందమైన లొకేషన్‌లో పాటలను టాకీని చిత్రించడానికి దర్శకుడు సిద్ధమయ్యాడు. కథ ప్రకారమే అక్కడ చిత్రిస్తున్నట్లు చెబుతున్న దర్శకుడు అందుకోసమే ప్రస్తుతం పొల్లాచ్చిలో అందమైన లొకేషన్లలో షూటింగ్ జరుపుతున్నారు. ఇంతకు ముందు యూరప్‌లోని మిలాన్, ఇటలీ వంటి ఖరీదైన లొకేషనల్లో చిత్రించారు. 'కృష్ణగాడి వీర ప్రేమగాధ'లో పరిచయమై మెహ్రీన్ శర్వానంద్‌కు జోడీగా నటిస్తుండగా ప్రముఖ కమెడియన్ వెన్నెల కిశోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. దీన్ని యువీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్-2 బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



పోస్ట్‌ప్రొడక్షన్‌కు ఎక్కువకాలం


హీరో ప్రభాస్ ప్రస్తుతం 'సాహో' చిత్రీకరణలో ఉన్న విషయం తెలిసిందే. బాహుబలి తర్వాత ప్రభాస్ కెరీర్లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాను సుజీత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. చాలా ఏళ్ల తర్వాత ప్రభాస్ తెర మీద మోడరన్ గెటప్‌తో కనిపించనుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ ఆశలు, అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమా వివరాల కోసం కూడా వాళ్లు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్న మది తమిళ మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు 7 రోజుల షూటింగ్ ముగిసిందని ఇంకా 180 రోజుల పాటు షూటింగ్ జరగాల్సి ఉందని అన్నారు. హీరోయిన్ ప్రస్తావన రాగానే ఆ విషయాన్ని దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటిస్తారని అన్నారు. అలాగే ఇందులో ఎక్కువ సీజీ వర్క్ ఉంటుందని అందుకే పోస్ట్ ప్రొడక్షన్‌కు కూడా ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు.

చైతు, సమంతల వివాహ పత్రం



దక్షిణాది చలన చిత్రరంగంలో నాగ చైతన్య, సమంతల ప్రేమ, పెళ్లి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. చాలా మంది సినీ ప్రియులు వీరి వివాహ మహోత్సవం ఎప్పుడెప్పుడు జరుగుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో వీరి వివాహ ఆహ్వాన పత్రిక అంటూ ఒక వెడ్డింగ్ ఇన్విటేషన్ ఆన్ లైన్లో తెగ హడావుడి చేస్తోంది. ఆ పత్రికలో వివాహం అక్టోబర్ 7వ తేదీన గోవాలోని వాఘటోర్ బీచిలోని బీచ్‌లోని డెబ్ల్యూ హోటల్‌లో జరుగుతుందని, అంతకు ముందు అక్టోబర్ 6న ప్రీ వెడ్డింగ్ వేడుక కూడా అక్కడే జరుగుతుందని ఉంది. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సివుంది.



'టెంపర్' రీమేక్‌కు సిద్ధం



ఎన్టీఆర్ కెరీర్లో ఒక భిన్నమైన సినిమాగా నిలిచి, నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఆవిష్కరించిన చిత్రం 'టెంపర్'. అప్పటి వరకు వరుస పరాజయాల్లో ఉన్న ఆయనకు మంచి బ్రేక్ ఇచ్చిన సినిమా కూడా ఇదే. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు హిందీలో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నటుడు, నిర్మాత అయిన సచిన్ జోషి ఈ చిత్ర రీమేక్ హక్కుల్ని దక్కించుకోగా రణ్వీర్ సింగ్ ఇందులో ఎన్టీఆర్ పాత్రను పోషిస్తారని, దర్శకుడు రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తారని బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలో దీనిపై మరిన్ని వివరాలు తెలియనున్నాయి.

'రోబో2' తెలుగు హక్కులు

దక్షిణాది ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'రోబో 2'. సూపర్ స్టార్ రజనీకాంత్, శంకర్ కలయికలో రూపొందుతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ భారీ అంచనాలున్నాయి. ఈ క్రేజ్ వలనే సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా తారా స్థాయిలో జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర తెలుగు హక్కులు కూడా మంచి ధరకు అమ్ముడైనట్టు తెలుస్తోంది. గ్లోబల్ సినిమా ఏపి, తెలంగాణా హక్కుల్ని సొంతం చేసుకుందని చిత్ర నిర్మాతల్లో ఒకరైన రాజు మహాలింగం తెలిపారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ కుమార్ నెగెటివ్ రోల్ చేస్తుండగా అమీ జాక్సన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని 2018 జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నారు.



అగ్రి ప్లస్

అనంతపురము జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితికి ఎనిమిది లక్షల హెక్టార్లకు గాను కేవలం 2.5 లక్షల హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. ఇంకా విత్తనాలు వేయాల్సిన 6.5 లక్షల హెక్టార్లలో 4.40 లక్షల హెక్టార్లు వేరుశనగ సాధారణ విస్తీర్ణం ఉంది. జులైలో పదును వర్షం పడక వేరుశనగ సాగు వీలుపడలేదు. జులై తరువాత వేరుశనగ విత్తుకున్నా పంట రాదు. అందువల్ల ప్రస్తుతం ఖాళీగా వున్నా 6.50 లక్షల హెక్టార్లలో వేరుశనగ కాకుండా వేరే ఇతర పంటలను సాగు చేయాల్సిన అవసరముంది. ఈ ఆగస్టులోనూ రాయలసీమలో ఇంకా సరైన వర్షాలు కురవడం లేదు. వాతావరణ సంస్థ అందించిన తాజా సమాచారం మేరకు ఆగస్టు రెండో పక్షం సాధారణ వర్షపాతం నమోదయ్యే వీలుంది. రాబోవు సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో కూడా సాధారణ వర్షం ఉండొచ్చని అంచనా. అందువల్ల అనంతపురము జిల్లా రైతాంగం పొలాలను బీళ్లుగా వదిలేసే కంటే, ఈ దిగువ సూచించిన పంటల సరళి పాటిస్తే లాభసాటిగా ఉంటుంది.



కంది + కొర్ర = లాభం
సీమ రైతులకు ఏరువాక సలహాలు

ఈ నెలాఖరులోగా మంచి పదును వర్షం పడితే కంది, ఆముదం, సజ్జ, కొర్ర, పెసర పంటలను సాగుచేసుకోవచ్చు. అయితే ఏదో ఒక పంటను ఏక పంటగా వేసుకునే కంటే, కొంత విస్తీర్ణంలో కంది, కొంత విస్తీర్ణంలో ఆముదం, కొంత సజ్జ, కొంత కొర్ర ఇలా వేసుకుంటే చాల సురక్షితంగా ఉంటుంది. నికరలాభమూ లభిస్తుంది.






- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మంచి వర్షాలు కురిస్తే కచ్చింతంగా కంది, ఆముదం మంచి ఆదాయాన్ని ఇస్తాయి. కనీసం ఎకరాకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలైనా మిగులుతాయి.
- కంది, ఆముదం పంటలను ఏక పంటలు వేసుకుంటే లాభమే. కానీ, ఇవి దీర్ఘకాలిక పంటలు కాబట్టి, ఆదాయం కోసం 4–5 నెలలు ఆగాల్సి ఉంటుంది. ఇది సన్నకారు రైతులకు ఇబ్బందికరమవుతుంది. అందువల్ల స్వల్ప కాలిక పంటలైన కొర్ర, సజ్జ, పెసర వేసుకోవచ్చు. వీటిలో పెసర, అలసంద పంటలు దెబ్బ తీసే ప్రమాదముంది. సజ్జ, కొర్ర మాత్రం శ్రేయస్కరం.
- ఈ విధంగా దీర్ఘకాలిక, స్వల్ప కాలిక పంటలను ఏక పంటలుగా వేసుకునేకంటే, రెండూ కలిపి అంతర పంటలుగా సాగు చేసుకుంటే శ్రేయస్కరం. ఈ పద్ధతి మరింత లాభసాటిగా ఉంటుంది.
- వీటిలో ప్రధానమై కంది, కొర్ర 1: 7 నిష్పత్తి అంతర పంట సరళి.
- ఈ సరళి వల్ల రైతుకు రెండు దఫాలుగా 3 నెలలకు, 5 నెలలకు ఆదాయం వస్తుంది. ఎర్ర నేలలో కూడా ఇది మంచి ఫలితాల్ని ఇస్తుంది.
- కొర్ర పంట నుండి 2–3 నెలల్లో కనీసం ఎకరాకు 3–4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కిలో రూ. 20కి అమ్మినా కూడా రూ. 6–8 వేలు ఆదాయం వస్తుంది. పశువులకు మేతా లభిస్తుంది.
- తరువాత కంది పంట నుండి కూడా కనీసం 2–3 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటా రూ 4 వేలు అమ్మినా, మరో రూ. 8–10 వేలు ఆదాయం వస్తుంది.
- అంటే.. ఈ సరళి వల్ల ఎకరాకు మొత్తం మీద రూ. 14వేల నుంచి రూ. 18 వేల వరకు లభించే వీలుంది. సాగు ఖర్చులు పోనూ కనీసం రూ. 7వేల నుంచి రూ. 10 వేల వరకు మిగులు ఉంటుంది.
- కందిలో మధ్య కాలిక రకాలైన పిఆర్‌జి–158, 176, ఐసిపిఎల్–161 వంటి రకాలను మాత్రమే సాగు చేయాలి. కొర్రలో సూర్యనంది, ఎస్ఐఎ– 3221, 3222, 3085, 3156 రకాలను సాగు చేయాలి.
- కంది ఎకరాకు 2 కిలోలు, కొర్ర సుమారు 2 కిలోలు విత్తనం అవసరమవుతుంది. ఎకరాకు 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 50 కిలోల యూరియా, 25 కిలోల పోటాష్‌ను దుక్కిలో వేయాలి. లేదా ఒక బస్తా డి.ఏ.పి. తో పాటు 25 కిలోల పొటాష్‌ను వేయాలి. కొర్ర పిలక తొడుగు దశ, గింజ పట్టు దశలో వర్షం పడినప్పుడు మరో 10 కిలోల యూరియా వేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఈ పద్ధతిలో కందికి ఇతర ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు.
- అనంత రైతాంగం వేరుశనగ సాగు చేయలేకపోయామని నిరాశ చెందకుండా ప్రతి 7 వరుసల కొర్రకి ఒక వరుస కంది అంతర పంటగా సాగు చేసి ప్రత్యామ్నాయ దిశగా ప్రయత్నం చేయాలి.
- నల్ల రేగడి నేలల్లో కూడా పత్తికీ బదులుగా ఈ పంట సరళి చాల లాభదాయకంగా ఉంటుంది. ఈ సరళిలో కొర్రకు బదులుగా సజ్జ పంటను కూడా సాగు చేయవచ్చు. ప్రతి నాలుగు వరసల సజ్జకు ఒక వరుస కందిని సాగు చేయాల్సి ఉంటుంది.



- డాక్టర్ డి.సంపత్ కుమార్,
ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక. అనంతపురము.





పత్తికి దశల వారీ రక్షణ ఇలా..



రాష్ట్రంలో పత్తి పైరు వివిధ దశల్లో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి సాధారణ విస్తీర్ణం 6,40,784 హెక్టార్లుండగా దీంట్లో సింహ భాగం కర్నూలు, గుంటూరు జిల్లాలదే. కర్నూలులో 2,08,222 హెక్టార్ల పత్తి సాధారణ విస్తీర్ణం ఉండగా, గుంటూరులో 1,85,411 హెకార్లలో ఈ పంట వేస్తుంటారు. మొత్తం సాధారణ విస్తీర్ణంలో అధికారుల అంచనాల మేరకే ఇంతవరకు 4,04,816 హెక్టార్లలో పత్తి వేయగా, ముందు కర్నూలు వంటి జిల్లాల్లో విత్తిన పత్తి పైరు వర్షాభావంతో బెట్టకు గురవుతోంది. అక్కడ ప్రమాదకరమైన పింక్‌బోల్ వార్మ్ (గులాబీ రంగు పురుగు) పత్తి కాయల్లోకి చొచ్చు కెళుతున్నట్లు గుర్తించారు. కృష్ణా వంటి ఆలస్యంగా పత్తి విత్తిన జిల్లాల్లో యథావిధిగా పత్తిని రసం పీల్చే పురుగులు ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పత్తి పైరును కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కె రాజారెడ్డి, అలాగే గరికపాడులోని డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. రాజశ్రీ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు..

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ ఏడాది ముందస్తుగా విత్తిన పత్తి పంట నీటి ఎద్దడికి గురవుతోంది. ఇందువల్ల మొక్కల్లో ఎదుగుదల వయసుకు తగిన విధంగా ఉండదు. రంగు కూడా ముందు పసుపు, తర్వాత ఎరుపు రంగులోకి మారుతుంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తే పత్తి పంటను బెట్ట నుంచి రక్షించుకోవడానికి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. మొక్క వయసు, ఎదుగుదలను బట్టి 1–2% శాతం యూరియా+ 1% మెగ్నీషియం సల్ఫేట్ లేదా 1–2% పొటాషియం నైట్రేట్ లేదా 1% మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణాన్ని 5–7 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

పంట తొలిదశ 1-60 రోజుల్లో

బిటి పత్తికి తొలిదశలో రసం పీల్చే పచ్చదోమ, పేనుబంక, తామరపురుగులు ఆశిస్తుంటాయి. వీటిని అదుపు చేయడానికి కాండం మీద మందుపూసే పద్ధతిని అనుసరించాలి. మోనోక్రోటోఫాస్ ఒక భాగం, నాలుగు భాగాల నీరు (1: 4) కలిపి 30, 45 రోజుల్లోగా మూడుసార్లు కాండానికి పూతగా పూయాలి. 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ ఒక భాగం, 20 భాగాలు నీరు (1: 20) కలిపి కాండం మీద పూయాలి.

60-90 రోజుల దశలో..

పత్తిలో సాధారణంగా పూత ఏర్పడినప్పటి నుంచీ కాయతొలుచు పురుగులు ఆశిస్తుంటాయి. వీటిలో తలనత్త, శనగపచ్చ, పొగాకు లద్దె పురుగు ముఖ్యమైనవి. బిటి సంబంధిత పురుగు మందులను బిటి పత్తి వంగడాలకు వాడకూడదు. వేపగింజల కషాయం 5% లేదా 0.5% వేప నూనె సంబంధిత మందులను వాడవచ్చు. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 1.0 మి.లీ. నొవల్యూరాన్ లేదా 1.0 మి.లీ. లూఫెన్యూరాన్, లేదా 1.0 మి.లీ. ఇమామెక్టిన్ బెంజోయోట్‌ను 0.5 మి.లీ. పిచికారీ చేయాలి.

100-120 రోజులు దాటాక..

ఎక్కువ నష్టం కల్గించే కీలకమైన గులాబీ రంగు పురుగు దశ ఇది. ఈ పురుగు కాయలోపలి నుంచీ తొలచుకుని వస్తుంది. అందువల్ల మందులు పైన పిచికారీ చేసినా ఫలితం కనిపించదు. పది కాయలకు ఒక లార్వా ఉంటే (కాయ కోసి చూడాలి) అవసరం మేరకు పంట చివరి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను వాడొచ్చు. పెద్ద గొంగళి పురుగులుంటే ఏరి నాశనం చేయాలి. గులాబీ రంగు పురుగును పొలం తయారీ, విత్తనం దశల నుంచి సరైన సమగ్ర సస్యరక్షణ చర్యలతో మాత్రమే నివారించుకునే వీలుంటుంది.




- డాక్టర్ కె.రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ, గుంటూరు.



డాక్టర్ ఎం.రాజశ్రీ
ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, డాక్టర్ కెఎల్‌రావు కెవికె, గరికపాడు.

ఔదార్యం-3

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్: 94410 75750)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98498 87500)



పొడుపు కథ

ఆకాశంలో 60 గదులు,
గదిగదికో సిపాయి,
సిపాయికో
తుపాకీ..ఏమిటది ?

జోక్ :

టీచర్ : ఒరేయ్ రాముూ ! నీకు బాగా నచ్చిన ఓ పుస్తకం పేరు చెప్పరా?!
రాముూ : మా నాన్న చెక్కు బుక్కు టీచర్ !
టీచర్ : ఆ..!



చిన్నారి

వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు?



ఆకాశం నుంచి వర్షం నీటి రూపంలోనే కాకుండా మంచు గడ్డల రూపంలో ఎంత మొత్తం కురుస్తుందనే విషయాన్ని కొలవడానికి ఒక ప్రత్యేకమైన వర్షమాపకం ఉపయోగిస్తారు. ఈ పరికరం ఒక నిర్ణీతమైన ఘన పరిమాణం కలిగి నీరు వెలుపలికి వెళ్లే మార్గం లేకుండా నిర్మితమై ఉంటుంది. వర్షపాతాన్ని మిల్లీమీటర్ల ప్రమాణంలో కొలుస్తారు. వర్షమాపకం ద్వారా 25 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని కొలిస్తే ఆ పరికరం అమర్చిన పరిసర ప్రాంతంలో నీరు ఇంకకుండా ఉంటే అక్కడి నేలపై 25 మిల్లీమీటర్ల లోతు వర్షం కురిసిందని అర్థం. ఇక భూమిని తాకక ముందు ఆకాశం నుంచి ఎంత వర్షం కురిసిందనే సమాచారాన్ని ప్రత్యేకమైన వాతావరణ సంబంధిత 'రాడార్లు' రికార్డు చేస్తాయి. రాడారు నుంచి వెలువడే రేడియో తరంగాలు ఆకాశంలోని వాతావరణంలో ఉండే నీటి బిందువులపైబడి పరావర్తనం చెంది, తిరిగి రాడారును చేరడం ద్వారా అక్కడి మేఘాల నుంచి ఎంత మేర ఎంత తీవ్రంగా వర్షం కురుస్తుందనే విషయం తెలుస్తుంది. ఈ సమాచారం విమానయానంలో పైలట్లకు ఎక్కువ వర్షం కురుస్తూ ప్రయాణానికి అనుకూలం కాని ప్రాంతాలను పసిగట్టి, ప్రయాణం సుగమంగా సాగడానికి ఉపకరిస్తుంది. వాతావరణ శాస్త్రజ్ఞులు ఈ రాడార్లు అందించే సమాచారాన్ని బట్టి వరదలు, మంచుతుపాన్లు సంభవించే ప్రాంతాలను, ఆ ప్రమాదాలు సంభవించక ముందే తెలుసుకోగలుగుతారు. ★





రంగులు వేయండి!



పిల్లలూ..! పైనున్న చిన్నారి బొమ్మకు ఆకర్షణీయమైన రంగులు వేయండి!

జైపూర్, తమిళ్ జట్లు బోణి

పుణేరి, బుల్స్‌కు తప్పని ఓటమి

నాగపూర్: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ్ తలైవాస్ జట్లు తొలి విజయంతో బోణి కొట్టాయి. తమ ప్రత్యర్థులైన పుణేరి పల్టన్, బెంగళూరు బుల్స్‌ను ఓడించి తమ సత్తా చాటాయి. పాయింట్ల పట్టికల్లో ఎ, బి జోన్‌ల్లో ఈ జట్లు అత్యధిక పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం. ఆడిన రెండో మ్యాచ్‌లో జయకేతనం పాంథర్స్ ఎగుర వేసి తొలి బోణి చేసింది. హైదరాబాద్‌లో తొలి ఓటమికి పుణేరి పల్టన్‌పై 30-28 పాయింట్లతో ప్రతీకారం తీర్చుకుంది. ఆరు పాయింట్లతో జోన్ ఎలో చివరి స్థానంలో కొనసాగుతోంది. పుణేరి పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్ల మధ్య గురువారం పోరు హోరుగా సాగింది. పుణేరి ఆల్‌రౌండర్ సందీప్ నర్వాల్ బరిలో దుమ్మురేపాడు. 7 రైడ్‌ల ద్వారా 9 పాయింట్లను జట్టుకు సమ కూర్చాడు. హుడా 3, మండెల్ 1 పాయింట్‌తో పేలవమైన ప్రదర్శన చేశారు. రైడింగ్ పాయింట్లలో ఆరు పాయింట్ల తేడా మినహా, టాకిల్, ఆలౌట్, ఎక్స్‌ట్రా పాయింట్లలో పాంథర్స్ ఆటగాళ్లు చెలరేగి ఆడి తొలి విజయంతో మెరిశారు. జైపూర్ జట్టులో చిల్లర్, జస్విర్ సింగ్‌లు 9, 5 పాయింట్లతో జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు.

నేటి మ్యాచ్‌లు
రాత్రి 8 గంటలకు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ x యు ముంబా
రాత్రి 9 గంటలకు తెలుగు టైటాన్స్ x ఉత్తరప్రదేశ్ యోధా



ఆరంభం నుంచే ఎదురు దాడి..

తమిళ్ జట్టు తన మూడో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌కు షాకిచ్చి తొలి విజయాన్ని సాధించింది. రెండో అర్ధభాగంలో నువ్వానేనా అన్న రీతిలో నాటకీయ పరిణామాలతో సాగిన మ్యాచ్‌లో బుల్స్‌ను 29-24 తో ఓడించింది. తమిళ్ జట్టు నుంచి కె పరాంపజేన్ తొలి రైడ్ పాయింట్ ఖాతాలో వేసుకుని బోణి కొట్టాడు. బుల్స్ ఆల్‌రౌండర్ రోహిత్ కుమార్ తనదైన శైలిలో బరిలో కలియ తిరిగి ఓ పాయింట్ తీసుకొచ్చాడు. ఇరుజట్ల మధ్య నువ్వానేనా అన్న రీతిలో తొలి అర్ధభాగంలో పాయింట్ల వేట సాగింది. 4-4, 5-5 8-9 ఇలా స్వల్ప ఆధిక్యంతో తమిళ్ జట్టు ఆధిపత్యం చెలాయించే దిశగా సాగింది. తొలి అర్ధభాగం ముగిసేటప్పటికీ తమిళ్ జట్టు బుల్‌పై 12-8తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో అర్ధభాగంలో తలైవాస్ రైడర్లు దుమ్మురేపారు. రైడ్, టాకిల్, ఆలౌట్ పాయింట్లతో బుల్స్‌కు ముచ్చెమటలు పట్టించారు. 10-18తో తమిళ్ జట్టు ఆధిక్యంలో కొనసాగుతున్న దశలో బుల్స్ వరుస పాయింట్ల ప్రత్యర్థి జట్టును కుమ్మేసింది. 18-20 ఆధిక్యంను తగ్గిస్తూ దూసుకెళ్లింది. చివరి ఐదు నిమిషాల్లో నువ్వానేనా అన్న రీతిలో స్వల్ప పాయింట్ల తేడాతో ఇరుజట్లు ముందంజ వేశాయి. బెంగళూరు బుల్స్ తమిళ్ తలైవాస్ జట్ల మధ్య ఇది రెండో మ్యాచ్. అంతకు ముందు జరిగిన తొలి మ్యాచ్‌లో బుల్స్ జట్టు తమిళ్ జట్టుపై ఘన విజయం సాధించింది. బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్ అత్యధికంగా 12 రైడ్ పాయింట్లతో అనుహ్యంగా చెలరేగి ఆడాడు.

మహిళా ప్రపంచకప్‌కు బ్రహ్మరథం

18 కోట్ల మంది వీక్షించినట్లు అంచనా

దుబాయ్: ఐసిసి మహళల వన్డే ప్రపంచకప్-2017కు ప్రపంచ వ్యాప్తంగా బ్రహ్మరథం పట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ టోర్నీని 18 కోట్ల మంది వీక్షించినట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ గురువారం ప్రకటించింది. ఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో భారత్ 9 పరుగుల తేడాతో పోరాడి ఓడిన మిథాలీ సేన రన్నరప్‌గా నిలిచిన విషయం తెల్సిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్‌లోనే 15.6 కోట్ల మంది మహిళా ప్రపంచకప్ ప్రసారాలు వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో 8 కోట్ల మంది చూడగా, ఒక్క ఫైనల్ పోరునే 12.6 కోట్ల మంది వీక్షించడం విశేషం. 2013 టోర్నీతో పోలిస్తే ప్రపంచ వ్యాప్తంగా ఇది 300 శాతం పెరిగిందని ఐసిసి ప్రకటించింది. సోషల్ మీడియాలోను హవా కొనసాగింది. ఐసిసి డిజిటల్ వేదికల్లో 10కోట్ల మంది వీక్షణలు నమోదు అయ్యాయి.



భారత్ షట్లర్ల హవా


బిడబ్ల్యుఎఫ్ టాప్-100లో 12 మంది షట్లర్లు





న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ర్యాంకులో భారత షట్లర్లు తమ హవాను కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో పలు టోర్నీల్లో సత్తా చాటి అనుహ్యంగా ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. పురుషుల విభాగంలో కిడాంబి శ్రీకాంత్‌లో టాప్ టెన్‌లోను, హెచ్‌ఎస్ ప్రణయ్ టాప్ -20లో నిలబడ్డారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి 12 మంది షట్లర్లు టాప్-100లో చోటు దక్కించుకున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా సూపర్ సిరీస్ విజయాలతో తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ టాప్ టెన్‌లో చేరుకోవడం విశేషం. కిడాంబి శ్రీకాంత్(8వ ర్యాంకు), ప్రణయ్(15), అజయ్ జయరామ్ (19), సమీర్ వర్మ (29), సౌరభ్ వర్మ (32), పారుపల్లి కశ్యప్(46), సుభాంకర్ దేవ్ (73), అభిషేక్ యెల్గర్ (81), ఆనంద్ పవార్ (95), సిరిల్ వర్మ(97) ర్యాంకుల్లో నిలిచారు.మహిళల పరంగా ఒలింపిక్ రజత పతక విజేత పివి సింధు నాలుగో ర్యాంకులోను, కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ 12 ర్యాంకులోను కొనసాగుతున్నారు.

ఆస్ట్రేలియా ఫీల్డింగ్ కోచ్‌గా హాడిన్



సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా బ్రాడ్ హాడిన్ ఆ దేశ బోర్డు గురువారం నియమించింది. మాజీ వికెట్ కీపర్ హాడిన్ ఈ పదవిలో 2019 వరకు కొనసాగనున్నాడు. వెటరన్ హాడిన్ 66 టెస్టుల్లోను, 124 వన్డేలోను జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. గ్రెగ్ బ్లెవెట్ వైదొలగడంతో కొత్త కోచ్‌గా హాడిన్ నియామకం ఖరారు చేశారు. బంగ్లాదేశ్ పర్యటనకు ఆస్ట్రేలియా హాడిన్‌తో వెళ్లనుంది. అక్కడ రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడిన తర్వాత ఇండియా టూర్‌కు వెళ్లనుంది. వన్డే, టి 20 సిరీస్‌ల్లో భారత్ తలపడ్డాక, ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌లో తలపడనుంది.

క్లీన్‌స్వీప్‌పై విరాట్ గురి

- శ్రీలంకకు గాయాల బెడద
- బరిలో కొత్త పేసర్లు చమీరా, గామేజ్
- రేపట్నుంచి మూడో టెస్ట్

కాండీ: స్వదేశంలో టెస్ట్ సిరీస్ కోల్పోయిన శ్రీలంక జట్టు మూడో టెస్ట్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని చూస్తోంది. తొలి టెస్ట్‌కు ముందే నుంచి శ్రీలంకను గాయాల బెడద తీవ్ర కలవరానికి గురి చేసింది. గాలె టెస్ట్‌కు కెప్టెన్ చండీమాల్ దూరం కాగా హెరాత్ సారథ్యం వహించాడు. రెండో టెస్ట్‌లో ధనుంజయ డిసిల్వాను తీసుకున్నారు. కాగా పల్లెకలెలో ఈ నెల 12 నుంచి జరిగే మూడో టెస్ట్‌కు గాయాల కారణంగా బౌలర్లు కంగనా హెరాత్, నువాన్ ప్రదీప్ , దనుష్క గుణతిలకేలు దూరం అయ్యారు. దీంతో వారి స్థానాల్లో ఫాస్ట్ బౌలర్లుగా దుష్మంత చమీరాతో పాటు ఇంత వరకు ఒక్క టెస్ట్ ఆడని లాహిరు గామేజ్ టెస్ట్‌ల్లో అరంగ్రేటం చేయనున్నాడు. ఈ ఇద్దరి ఫాస్ట్ బౌలర్లతో భారత్ భారీ స్కోర్‌కు చెక్ పెట్టాలని లంకేయులు యోచిస్తున్నారు. చివరి టెస్ట్‌లో భారత్ బ్యాట్స్‌మెన్ నిలువరించేందుకు చండీమాల్ బౌలర్లను ఏ విధంగా ఉపయోగిస్తాడన్నది ఆసక్తి కరంగా మారింది. ఇదిలా ఉండగా రెండు టెస్ట్‌ల్లోను 600ల పైచిలుకు పరుగుల సాధనతో పాటు, బౌలర్లు తడఖాతో విరాట్ సేన విజయాల మోత మోగించింది. దీంతో మూడో టెస్ట్‌లోను జయభేరి మోగించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్నాడు. ఓపెనర్లు, మిడిల్ ఆర్డర్‌లోను బ్యాటింగ్‌లో ఫుల్ జోరుమీద భారత బ్యాట్స్‌మెన్ ఉండటంతో బౌలింగ్ విభాగం రెట్టించిన ఉత్సాహంతో మూడో టెస్ట్‌కు సిద్ధమైంది. తొలి రెండు టెస్ట్‌లను భారత్ నాలుగో రోజే ముగించి తన హవాను చాటింది.



శ్రీలంక జట్టు సైన్యం ఇదే..

దినేష్ చండీమాల్ (కెప్టెన్), అంగోలా మ్యాథ్యూస్, ఉప్పుల్ తరంగ, డిముచ్ కరుణ రత్నే, నిరోషాన్ డిక్వెల్లా(కీపర్), కుశాల్ మెండీస్, ధనుంజయ డిసిల్వా, లాహిరు తిరుమాన్నే, లాహిరు కుమార,విష్వా ఫెర్నాండో, దుష్మంతు చమీరా, లాహిరు గేమేజ్, దిల్రువాన్ ఫెరీరా, మలింద పుష్ప కుమార, లక్షణ్ సందకన్.





వన్డే సిరీస్‌కు అశ్విన్, జడ్డుకు విశ్రాంతి

టెస్ట్‌ల్లో భారీగా భారాన్ని మోస్తున్న భారత స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలకు రానున్న వన్డే సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. ఈ నెల 13న వన్డే సిరీస్‌కు భారత్ జట్టును చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నారు. మూడో టెస్ట్‌పై జడేజాపై నిషేధం కొనసాగుతున్న విషయం తెల్సిందే. అశ్విన్,జడేజాలు 150 ఓవర్ల పైబడి బౌలింగ్ చేశారు. దీంతో వన్డే జట్టులో యజువేంద్ర చాహల్, అక్షర పటేల్, కృనాల్ పాండ్య, జస్ప్రిత్ బుమ్రాలను తీసుకోనున్నారు. భారత్ స్వదేశంలోనే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీ లంకతో డిసెంబర్ వరకు వరుస వన్డే సిరీస్‌లతో బిజీగా గడపనున్న విషయం తెల్సిందే. కొత్త సంవత్సరంలో దక్షిణాఫ్రికాతో ఇండిపెండెన్స్ కప్‌లో తలపడనుంది.ఇప్పటికే పేస్ బౌలర్ మహ్మద్ షమీకి విశ్రాంతినిచ్చారు.



పరిటాలశ్రీరామ్ నిశ్చితార్థం

హాజరైన స్పీకర్ కోడెల, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి పరిటాల సునీత కుమారుడు శ్రీరామ్ నిశ్చితార్థం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో పరిటాల కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య వైభవంగా జరిగిన ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు విచ్చేశారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, అయ్యన్న పాత్రుడు, కామినేని శ్రీనివాస్, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి పీతల సుజాత, సినీ నటులు తారకరత్న, నారా రోహిత్, సునీల్ తదితరులు హాజరయ్యారు. అనంతపురం జిల్లా జెడ్పీ చైర్మన్ చమన్, ఆ జిల్లాకు చెందిన పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. అనంతపురం జిల్లా నార్పల మండలం ఎవిఆర్ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ ఆలం వెంకటరమణ, సుశీలమ్మల కుమార్తె ఆలం జ్ఞానతో అక్టోబర్ 1న వివాహం నిర్వహించనున్నట్లు మంత్రి సునీత వెల్లడించారు.

సివిల్స్ ఉచిత శిక్షణలకు బ్రేక్..!

- ఎంపికైె అభ్యర్థుల ఎదురుచూపులు
- గత శిక్షణల్లో అక్రమాలే కారణమా?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సివిల్స్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు ప్రభుత్వం అందిస్తోన్న ఉచిత శిక్షణకు బ్రేకులు పడ్డాయని తెలిసింది. లక్ష్య సారూప్యత కలిగిన సంక్షేమ పథకాలన్నీ ఏకీకృత విధానంతో అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాటు, ఇటీవల కాలంలో కాపు కార్పొరేషన్‌లో ఉచిత శిక్షణలో చోటు చేసుకున్న అవకతవకలూ దీనికి ప్రధాన కారణాలని తెలుసోంది. దీంతో ఉచిత శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన ఫైల్ పెండింగ్‌లో పడింది. అనుమతులు కోసం గత రెండు నెలలుగా అధికారుల చుట్టూ అది ప్రదక్షిణలు చేస్తోంది. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి, కాపు, బ్రాహ్మణ, ఇబిసి అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది 700 మంది ఎస్సీ, 300 ఎస్టీ, 1000 బిసి, 750 కాపు, 300 మైనారిటీ, 750 ఇబిసి, 50 మంది బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని వర్గాల అభ్యర్థులకు కలిపి జూన్ 20న ఒకే కామన్ పరీక్షను కూడా నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 83,600 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వారిలో 25వేల మంది ఎస్సీలు, ఎస్టీలు 8 వేలు, బిసిలు 40వేలు, ఇబిసిలు 6వేలు, మైనార్టీలు 4 వేలు, కాపులు 8 వేలు, బ్రాహ్మణ అభ్యర్థులు 600 మంది ఉన్నారు. ఉమ్మడి పరీక్ష పరీక్షలో ప్రతిభ ఆధారంగా శిక్షణకు అర్హులైవారి జాబితానూ కూడా సిద్ధం చేశారు. జూన్ నుంచి లేదా జులై ప్రారంభం నుంచి ప్రారంభం కావాల్సిన ఈ శిక్షణలు ఇంతవరకు ప్రారంభము కాలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. శిక్షణ కోసం ఒక్కో అభ్యర్థికి రూ. 1.30 లక్షలు ఫీజు చెల్లించడంతో పాటు, శిక్షణ సమయంలో నెలకు రూ. 10 వేలు స్టైఫండ్ కింద ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెల్లిస్తున్న ఫీజులకు ఆశపడి అనుభవం లేని కొన్ని సంస్థలను శిక్షణ జాబితాలో చేర్చి పర్సెంటేజ్‌ల కోసం అధికారులు కక్కుర్తి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సంస్థలైతే తమ సంస్థకే అభ్యర్థులకు పంపాలని ఏకంగా సిఎం ఛాంబరు నుంచే అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లూ సమాచారం. తాజాగా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణలు ప్రారంభం కాకపోవడానికి ఈ నేపథ్యమే కారణమని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

నిరంతరం ప్రజాపక్షమే

- ప్రతిపక్షాలను సంఘటిత పర్చడంలోనూ కీలక పాత్ర
- రాజ్యసభ సభ్యునిగా ఏచూరికి ఘన వీడ్కోలు
- అధికార ప్రతిపక్ష సభ్యుల ప్రశంసలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ సభ్యునిగా నిరంతరం ప్రజల పక్షాన సీతారాం ఏచూరి పోరాడేవారని, ప్రతిపక్షాలను సంఘటితం చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్ని పక్షాల సభ్యులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు. గురువారంతో పదవీకాలం ముగిసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి, పార్టీ సభాపక్షనేత సీతారాం ఏచూరికి రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికన సందర్భంగా పలువురు సభ్యులు ఆయనతో తమ అనుబంధాన్ని, అనుభూతులను నెమరువేసుకున్నారు. ఆయనతో పాటు గుజరాత్‌కు చెందిన బిజెపి సభ్యుడు దిలీప్ బాయ్ పాండ్య, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణముల్ కాంగ్రెస్ సభ్యుడు డి. బందోపాధ్యాయలకు కూడా రాజ్యసభ వీడ్కోలు తెలిపింది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతలు, వివిధ పార్టీల సభ్యులు ఏచూరితో తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏచూరి వ్యక్తిత్వం, సభలో నిర్మాణాత్మకంగా చర్చల్లో పాల్గొన్న తీరు, ప్రజా సమస్యలపై ఆయన సాగించిన అలుపెరగని పోరాటాలను ప్రస్తావిస్తూ, ముక్తకంఠంతో ప్రశంసించారు. ఇటువంటి నేతను ఇకముందు సభలో చూడకపోతున్నామని కొందరు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ సభ్యుడు ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ, ఏచూరి ఆదర్శప్రాయుడని, నిరంతరం ప్రజల కోసం తపించేవారని పేర్కొంటూ ఉద్విగ్నతకు గురయ్యారు. ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి నిర్మాణాత్మకమైన సలహాలిచ్చేవారని, రాజ్యసభ సజావుగా కార్యకలాపాలను కొనసాగించడంలో ఆయన పాత్ర మరువలేనిదని, ప్రతిపక్షాలను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారని పలువురు సభ్యులు అభిప్రాయ పడ్డారు. సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలో ఆయన కృషి అమోఘమని, దేశమెదుర్కొంటున్న సవాళ్లపైన, ప్రజలెదుర్కొంటున్న సమస్యలపైన జరిగే ప్రతి చర్చలో పాల్గొనేవారని గుర్తు చేసుకున్నారు. తొలుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పి.జె కురియన్ మాట్లాడుతూ ఏచూరి పార్లమెంట్ లోపల, వెలుపల ప్రజల గురించే మాట్లాడేవారని, ఆయనకు ఆ పార్టీ అదే నేర్పిందని పేర్కొన్నారు. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో విలువైన సమాచారం ఇచ్చేవారని, చాలా సార్లు ఆయన సుదీర్ఘంగా మాట్లాడినప్పటికీ సమయం ఇంకా ముగియలేదనిపించేదని గుర్తు చేశారు. ఉన్నత విలువలకు ఆయన నిలువుటద్దమని, మృదువు స్వభావైన ఏచూరి అందరితో కలిసిమెలిసి ఉండేవారని, ప్రజా సమస్యలపై రాజీ పడేవారు కాదని తెలిపారు. సమాజ్ వాదీ పార్టీ సీనియర్ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఏచూరి తనకు మిత్రుడుని, వివిధ అంశాలపై చాలా సార్లు తనకు సలహాలిచ్చారని తెలిపారు. ఇకనుండి నుంచి ఆయన సభకు హాజరుకారన్న ఊహనే భరించలేకపోతున్నానని ఉద్వేగానికి లోనైయ్యారు. ఈ దశలో ఏచూరి ఆయనను ఓదార్చుతూ సభలో లేకపోయినా, బయట కలిసి పని చేద్దామని ఉపశమింపజేశారు. అన్నాడిఎంకె పక్షనేత నవనీత్ కృష్ణన్ మాట్లాడుతూ దేశంలో ప్రతి భారతీయుడు ఏచూరి నుండి స్ఫూర్తి పొందాలని అన్నారు. డిఎంకె పక్షనేత తిరుచ్చి శివ మాట్లాడుతూ ఏచూరి దేశానికి సేవలను అందించారని, ఆయన సభలో లేకపోవడం పెద్ద లోటని అన్నారు. అణగారిన వర్గాల గొంతుకై నిలిచారని కొనియాడారు.

ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాలి: ఏచూరి

పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాలని సీతారాం ఏచూరి పేర్కొన్నారు. తన వీడ్కోలు సందర్భంగా ఆయన రాజ్యసభలో చివరి సారిగా మాట్లాడారు. ప్రజా సమస్యలపైన, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపైన చర్చకు వేదికగా పార్లమెంట్ ఉభయ సభలుండాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, ప్రైవేటీకరణ దేశానికి హానికరమని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, యువతకు ఉపాధి, దళిత, మైనార్టీ, మహిళ, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడులపై విస్తృచర్చ జరగాల్సుందని అన్నారు. కులం, మతం, భాష పేర్లతో ప్రజల్ని విడగొట్టడం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. ప్రజల వాస్తవ ఎజెండాకు పార్లమెంట్ ప్రతిబింబించాలని. దేశంలో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన అవసరం వుందని ఏచూరి అన్నారు. పార్లమెంట్‌లో ప్రజల వాస్తవ సమస్యలపై చర్చ జరపాలని అధికార, ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు : అరుణ్ జైట్లీ



సీతారాం ఏచూరి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారని కేంద్ర ఆర్థిక మంత్రి, రాజ్యసభ నేత అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. సీనియర్ రాజకీయ వేత్తగా గుర్తింపు పొందారని, విద్యార్థి ఉద్యమం నుంచి రాజకీయ వేత్తగా ఎదిగారన్నారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడుగా సేవలందించారని అన్నారు. పార్లమెంట్ విలువలకు కట్టుబడి పనిచేశారని, తనకు అనేక సార్లు సలహాలిచ్చేవారని గుర్తు చేశారు.

ప్రతిపక్షాలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర: గులాం నబీ ఆజాద్



ప్రతిపక్షాలను సమన్వయం చేయడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని ప్రతిపక్షనేత గులాం నబీ ఆజాద్ అన్నారు. " సభలో చాలా మంది సీనియర్లు ఉన్నారు. అయినా ఏచూరికి వీడ్కోలు పలకాలంటే ఎంతో బాధకలుగుతోంది. ఆయన నిరంతరం ప్రజల పక్షాన నిలిచేవారని,. ఆయన సభలో లేకపోవడం తీవ్ర లోటని'అన్నారు.

ఉద్యమాల్లో కలిసి పనిచేస్తాం: డి.రాజా



ఏచూరి సభలో లేకపోయినా ప్రజా ఉద్యమాల్లో కలిసి పనిచేస్తామని సిపిఐ సభ్యుడు డి.రాజా పేర్కొన్నారు. ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐలో ఉన్నప్పుడు, తాను ఎఐవైఎఫ్‌లో పని చేశానని, ఆయన సభలో లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరముందని, సిపిఐ, సిపిఎం కలిసి పనిచేస్తాయని అన్నారు. ఏచూరి రాజకీయ మార్గదర్శకుడని తృణముల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓ బ్రెయిన్ అన్నారు. సీతారాం ఏచూరి ప్రజల ప్రోగ్రామ్(మినిమమ్ కామన్ ప్రోగ్రామ్)కు రూపకల్పన చేశారని జైరాం రమేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా గత యుపిఎ ప్రభుత్వానికి అనేక సూచనలు సలహాలు ఇచ్చారని అన్నారు. దేశానికి వామపక్షాల అవసరం ఎంతో వుందని పేర్కొన్నారు.

ఎల్ఐసి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం ఉదయం సౌత్ సెంట్రల్ జోనల్ లేవెల్ క్యారమ్స్, చెస్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 17 ఎల్ఐసి డివిజన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 73 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం వేదికగా ఎల్ఐసి ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించి ఉద్యోగులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆడిన క్రీడాకారులు ఎస్.అపూర్వ, పి.నిర్మల పాల్గొన్నారు. మహిళల విభాగం నుంచి 36 మంది, పురుషుల విభాగం నుంచి 37 మంది ఈ పోటీల్లో తలపడుతున్నారు. రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగుస్తాయని నిర్వాహక కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆడిన క్రీడాకారులు ఎస్.అపూర్వ, పి.నిర్మలను సత్కరించిన విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68